# నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | గురువారం 3-6-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 254 | పేజీలు: 6 | వెల: రూ.1/-


## నమ్మలేని నిజాలు

తాళం పడింది
ఓడి గెలుచుటకై
మేడి పండేను.

వలసి కూలి
బతుకు చితిమంట
పురుగు తంట

తట్టు కోవాలి
ఎండల భగభగ
రాలి పోతావు.

బయట రాకు
గుడి గూడేను భద్రం
కరోన గాలం.

ఆరోగ్య శ్రీలు
శ్రీలుపండె పొలాలు
ఆమడ దూరం

– రేడియమ్
సెల్: 9291527757

## శ్రీనిజాలు

తెలంగాణ రాష్ట్రంలో
లీటరు పెట్రోలుపంద !
ఇక సామాన్యుని కెట్లా
నడుచు సంసారం బొంద!

సోనూసూద్ కేటీఆర్‌ను
రాముని మించిన రాముడు !
కేటీఆర్ అంటాడోచ్
సోనూసూద్ ఒక దేవుడు !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

జూన్ 6, 2016న రవీంద్రభారతిలో 'నేటినిజం' దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు సంపాదకత్వంలో వెలువడిన "అక్షర నివాళి" స్మృతి కవితా సంకలనం ఆవిష్కరిస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డా॥ కె.వి.రమణాచారి. వేదికపై బైస దేవదాసు, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖా సంచాలకులు మామిడి హరికృష్ణ, శాతవాహన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కడారు వీరారెడ్డి, ప్రెస్ అకాడమీ ఛైర్మన్ అల్లం నారాయణ, బిసి కమీషన్ సభ్యులు జూలూరి గౌరీశంకర్, డా॥ నాళేశ్వరం శంకరం, డా॥ పత్తిపాక మోహన్, శంకరమ్మ , డా॥ పోరెడ్డి రంగయ్య.

## 15 నుంచి రైతుబంధు డబ్బులు జమ : మంత్రి కేటీఆర్

రాజన్న సిరిసిల్ల, జూన్ 2:: వానాకాలం పంట ఖర్చుల నిమిత్తం ఈ నెల 15వ తేదీ నుంచి రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు జమ అవుతాయని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటిస్తున్న మంత్రి కేటీఆర్.. సర్దార్‌పూర్‌లో మార్కెట్‌యార్డు పనులు, బెటాలియన్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని స్పష్టం చేశారు. రైతులను ఆదుకోవడానికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. రెండో హరిత విప్లవానికి సీఎం కేసీఆర్ నాంది పలికారు. ఎన్నడూ లేని విధంగా సిరిసిల్ల మెట్ట ప్రాంతంలో రికార్డు స్థాయిలో వరి దిగుబడి వచ్చిందన్నారు. వేసవిలో కూడా అప్పర్ మానేరు మత్తడి దుంకుతోందన్నారు. రైతుబంధు డబ్బులు జమ అయ్యేలోపు భూ సమస్యలు ఉంటే పరిష్కరించాలని కలెక్టర్, ఆర్డీవోకు సూచించారు. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టామని తెలిపారు. ఫారెస్టు అధికారులతో సమన్వయం చేసుకుని అటవీ భూముల సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సిరిసిల్ల రైతులకు అధునాతన మార్కెట్‌యార్డును నిర్మించామని కేటీఆర్ తెలిపారు.

## అమరవీరులకు నివాళులర్పించిన సీఎం కేసీఆర్

హైదరాబాద్ , జూన్ 2: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు గన్‌పార్క్‌లోని అమరవీరుల స్మారక స్తూపం వద్ద పుష్పగుచ్చం ఉంచి నివాళులర్పించారు. సీఎంతో కేసీఆర్‌తో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, ఎంపీ సంతోష్‌కుమార్, రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూదనచారి, మేయర్ విజయలక్ష్మి అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం గన్ పార్క్ నుంచి సీఎం కేసీఆర్ నేరుగా ప్రగతిభవన్ చేరుకొని ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించి, వందనం చేశారు. తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. కొవిడ్ నేపథ్యంలో వరుసగా రెండో సంవత్సరం తెలంగాణ ఆవిర్భావ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా నిరాడంబరంగా సాగుతున్నాయి.

## జూన్ 11 నుంచి భూముల డిజిటల్ సర్వే.. తొలుత 27 గ్రామాల్లో మాత్రమే

హైదరాబాద్ , జూన్ 2:తెలంగాణలోని ప్రతి ఇంచు భూమిని డిజిటలైజేషన్ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. జూన్ 11వ తేదీ నుంచి భూముల డిజిటల్ సర్వే ప్రారంభం కానుంది. తొలుత పైలట్ ప్రాజెక్టు కింద 27 గ్రామాల్లో మాత్రమే సర్వే నిర్వహించనున్నారు.

గజ్వేల్ నియోజకవర్గం నుంచి 3 గ్రామాలను, మిగతా 24 గ్రామాలను 24 జిల్లాల నుంచి ఎంపిక చేయాలని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు. భూతగాదాలు లేని తెలంగాణ లక్ష్యంగా డిజిటల్ సర్వే నిర్వహిస్తున్నామని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. పట్టాదారుల భూములకు శాశ్వత రక్షణే ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు. ప్రజల భూమి హక్కులు కాపాడేందుకే డిజిటల్ సర్వే చేస్తున్నామని తెలిపారు. సర్వే ఏజెన్సీలు సామాజిక సేవగా భావించాలి

## మధ్యప్రదేశ్‌లోనూ 12వ తరగతి పరీక్షలు రద్దు

భోపాల్, జూన్ 2:: కరోనా మహమ్మారి కారణంగా కేంద్ర ప్రభుత్వం సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్షలను రద్దుచేసినట్లు ప్రకటించిన మరుసటి రోజే ఒక్కో రాష్ట్రం తమ స్టేట్ బోర్డుల పరిధిలోని పరీక్షలను కూడా రద్దు చేస్తున్నాయి. ఇప్పటికే గుజరాత్ ప్రభుత్వం 12వ తరగతి పరీక్షలను రద్దు చేయగా.. తాజాగా మధ్యప్రదేశ్ ప్రభుత్వం కూడా అదే నిర్ణయం చేసింది. రాష్ట్రంలో 12వ తరగతి పరీక్షలను రద్దు చేస్తున్నామని స్వయంగా మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రకటించారు.

## గవర్నర్ తమిళిసైని కలిసిన సీఎం కేసీఆర్

హైదరాబాద్ , జూన్ 2: రాజ్‌భవన్ లో గవర్నర్ తమిళిసైని ముఖ్యమంత్రి కేసీఆర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. నేడు గవర్నర్ పుట్టిన రోజు కూడా కావడంతో.. తమిళిసైకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు సీఎం కేసీఆర్. అనంతరం రాజ్‌భవన్ నుంచి ప్రగతి భవన్‌కు సీఎం వెళ్లారు.

## కొత్త నక్షత్రం

మరువలేని గాథలకు సలాం
మంటలను తొడుక్కున్న గాథ
రైలుకు ఎదురు నడిచిన గాథ
చెట్టుకు కలలు వేలాడిన గాథ
నెత్తిటితో లేఖలు రాసిన గాథ.

వాళ్ళ త్యాగం గొప్ప
కాలం ఆగి కన్నీళ్ళు రాల్చింది.

వాళ్ళ హృదయం సున్నితం
భూమి మోదుగుపూల దోసిలి పట్టింది.

వాళ్ళ లక్ష్యం పవిత్రం
మొగులు మీద
తెలంగాణ నక్షత్రం పొడిచింది.

– డా॥ నందిని సిధారెడ్డి
సెల్: 9440381148



ఈ సంకలనంలోని కొన్ని కవితలు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా 'నేటినిజం' పాఠకుల కోసం...
– సంపాదకులు

## సమరంలో అమరం

ఏ రోడ్డుమీద నడుస్తున్నా
మీరే గుర్తుకొస్తున్నారు
వేలాడుతున్న తోరణాల్లో
మీ ముఖ బింబాలే కనుల మెదుల్తున్నాయి.

అంబరాన్నంటిన సంబరాలు
చుక్కలుగా మారిన
మీదాకా చేరుతున్నాయో లేదోగానీ
మీకోసం మా గుండెలు
బాణా సంచాల్లా పేలుతూ
మీ ఆత్మాహుతిని తలపిస్తున్నాయి.

బిడ్డల్లారా! మీ త్యాగం వృధాపోదు
మీ మరణం నిరాశకాదు
మహా నిరసన!

మీరెప్పటికీ
మాగూట్లో దీపాలై వెలుగుతారు
వా వాకిళ్ళలో ఉద్వేగగీతాలై మోగుతారు
స్వతంత్ర తెలంగాణ
ఎప్పటికీ మీ జ్ఞాపకాల వాన.

– డా॥ ఎన్.గోపి
సెల్: 9391028496

## అమరవీరులారా! జోహార్లు!

అరవై ఏళ్లు
ఆధిపత్యంతో అదిమిపట్టిన
సీమాంధ్రుల శృంఖలాల నుండి
విడిపించిన
తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ యజ్ఞంలో
సమిధలైన తెలంగాణ త్యాగధనులు
ఎందరో అమరవీరులు!
అందరికీ వందనాలు!

మీ కాష్టం కలిన బూడిద మా నొసట
విభూది
ఇదే మా ఆన!
మా ధ్యేయం బంగారు తెలంగాణ!
మీరే మా గాంధీలు.
అంబేద్కరులు, సుభాష్‌చంద్రబోసులు!
మీరే, మీరే! మా తెలంగాణ రాష్ట్రపితలు!
మళ్ళీ మళ్ళీ పుట్టండీ!
తెలంగాణులై ఉదయించండి!

– ఆచార్య కడారు వీరారెడ్డి
సెల్: 7893366363

## అమరుల నిర్వచనం!

అమరుని ఆత్మే ఆయుధం
మనం అనుభవించబోయే
ఉద్యమ జీవఫలం అదే!
దళారులకు ఆత్మలుంటే కదా!
ఉద్యమకారుల ఆత్మహననం
అర్థమయ్యేది!

ఈశ్వరుడే పట్టలేని
ఇంటి దొంగలు ప్రతి ఇంట్లో
ఇంకా ఉండనే ఉన్నారు!
వాసాలు లెక్కపెట్టి
పాలించే పాలెగాళ్లు
ఇంటిముందు కాచుకూర్చున్నారు!
మేమిక విడిపోవడమెందుకు?
ఇంటి దొంగల్ని కొలవడమెందుకు?

రాష్ట్రంగా అవతరించిన
అస్తిత్వ–ఆయుధం మా వెంటే ఉంది
అది మరణించదు నిష్క్రమించదు
నేల అస్తిత్వాన్ని
హరించుకుపోయే ప్రతిచోట
మళ్లీ ఆయుధమై జనిస్తుంది!
హరించే వాడి చితికి
నిప్పుపెట్టడమే నేర్పుతుంది!



– డా॥ నాళేశ్వరం శంకరం
సెల్: 9440451960

## ఉద్యమాగ్నులు

చీకట్లను పారద్రోలడానికి
తామె మంటకావడం అమరత్వం.
జన్మకు సార్థకత చేకూర్చే చావును
ఆలింగనం చేసుకోవడం అమరత్వం.

త్యాగాలు లేకుండా ఆకాంక్షలు పండవని
ఆత్మ బలిదానాల నారుపోసి
స్వేచ్ఛా పంటలను పండించారు
ఎవరు ఏమీ ఇచ్చి తీర్చుకోలేని
రుణం త్యాగం.

తెలంగాణలో ఇపుడు
త్యాగ ఫలాలు పండాలి
సృజన పురుడు పోసుకునే తత్వం
తెలంగాణా మట్టిలోనే ఉంది.

ఈ నేల పొరల్లో మీ త్యాగాలు
ఆరని నిప్పులాగా వుంటాయి.

మీరు నింగికెగసిన ఆత్మగౌరవ జెండాలు
సబ్బండవర్ణాలు శిరస్సెత్తిన కంటిచూపులు
మీరు మా అరువుల అక్షరాలు
మీరు మా పలవరింతలు 'కలవరింతలు'
నాల్గు కోట్ల మందికి
గెలుపు రుచి చూపిన ధీరులు
మీరు మా అక్షరాల్ని
అస్థిత్వ సైనికులుగా మలిచినోళ్ళు
మీరు మా బిగించిన పిడికిల్లోంచి
ఉదయించే ఉద్యమాగ్నులు.

– జూలూరి గౌరీశంకర్
సెల్: 9440169896

## దీప ధారి

ఓ అమర వీరుడా!
త్యాగాల శూరుడా!
నాడు–
పదునెక్కిన కత్తిలా
ఉదనుతొక్కి కదిలావు!
ఉద్యమాలలోకి దూకి
ఊపిరులనే వదిలావు!
నీవు చిందించిన
ఆ ఎర్రటి నెత్తురే తైలంగా
నేడు–
'తెలంగాణ' దీపం వెలిగింది!
ఉద్యమాల పురిటి నేల
ఉరికంబాల ఉయ్యాల
ఈ తెలంగాణా నాల్గు చెరగుల
ఇన్నాళ్ళ దుస్థితి తొలగింది!

– టి. గౌరీశంకర్
ఎల్: 9440969130

## విలువ

కొత్తపొద్దు పొడిచింది నిజమే!
ఇదే విజయం అనుకోలేను!

త్యాగధనుల తల్లుల పేగులపై
విధిలిఖిత విషాదభరిత
దుఃఖిత కవితను
పాలకులు చదివిన రోజు
వారు ప్రమాణ స్వీకారంలోని
వాక్యాలకు అర్థం తెలుసుకున్న రోజు
వారి బలిదానాలకు విలువ
నా కవిత మీ ఆత్మలకు చలువ.

– మౌనశ్రీ మల్లిక్
సెల్: 9394881004

## తెలంగాణ తారలు

దూరంగా వున్నవింగిలో ఎన్ని తెలంగాణ తారలో
తెలంగాణ నేలలో ఎన్ని రక్తధారలో
బానిస సంకెళ్ళు తెంపేందుకు
వలసాంధ్ర పాలన పోయేందుకు
అరవై ఏళ్ళ కళ నెరవేరేందుకు
ఇరవై ఏళ్ళ పోరుబిడ్డల బలిదానంతో ॥దూరంగా॥

నడిరోడ్డులపైన తగులబెట్టుకుని
నిలువెత్తు బిడ్డలు నిలువెత్తు మంటలై
పరుగెడుతూ పరుగెడుతూ
జై తెలంగాణ అంటూ సొంత రాష్ట్రం కోరి
గొంతెత్తి నినదీస్తు కుప్పకూలి అదిగో ॥దూరంగా॥

ఆంధ్ర పెత్తనమోలె అటు నుండి రైలు
ఇటు నుండి తెలంగాణ త్యాగమై వీరుడు
కొండను ఢీకొట్టె సింగమల్లె
కొండ చిలువపైకి దండెత్తి చీమవలె
రైలును ఢీకొట్టె వీరుడు అదిగో
రాష్ట్రం కావాలన్న రక్త పరుగదిగో ॥దూరంగా॥

ట్రాంస్‌ఫార్మర్ ఎక్కి తెలంగాణ పోరడు
ప్రవహించె కరంటు తీగను చూశాడు
రెండు చేతులు ఎత్తి తెలంగాణ తల్లిని
గుండెలో తలిచాడు తీగపట్టుకున్నాడు
అగ్గిలోపడ్డ నెత్తుటి చుక్కవలె విలవిలలాడిన దేహం
మరణ వాంగ్మూలం తెలంగాణ నినాదం ॥దూరంగా॥

ఉరితాడును పేని దుసుడిముడి వేసి మెడలోన వేసుకుని
ఇప్పుడు నా గొంతు ఉరితీసె తాడు ఇది
రేపు సంకెల తెంపే గొడ్డలి అవుతుంది
జై తెలంగాణ అంటూ లంఘించి దూకాడు
ఉరికి అర్పించిన కంఠాలవి తెలంగాణ రాష్ట్ర గీతాలవి ॥ దూరంగా॥

పాల గిన్నెలో ప్రహ్లాదుడానాడు
శేష తల్పంపైన విష్ణువును చూశాడు
విషం గిన్నెలలోన వీర కిశోరాలు
వేరైన తెలంగాణ రాష్ట్రాన్ని చూశారు
గుటగుట విషమును తాగి కను మూశారు
తెలంగాణ రాష్ట్ర సరిహద్దులై నిలిచారు. ॥దూరంగా॥

తెలంగాణ రాష్ట్రాన్ని సాధించే యజ్ఞంలో
సమిధలుగా మందారు ప్రమిదలుగా మిగిలారు
తెలంగాణ యుద్ధ శంఖాలు పూరించారు
మా ఆత్మకోవెలలో దేవుళ్ళు అయినారు ॥దూరంగా॥

– డా॥ సుద్దాల అశోక్‌తేజ
సెల్: 9618442424

## ప్రభుత్వ వైద్యవిధానంలో లొసుగులు- ప్రయివేటు ఆసుపత్రుల దోపిడీ అరికట్టడం ఎలా?

విద్యా, వైద్య రంగాలలో ప్రభుత్వాలు తమ సామాజిక బాధ్యతను సుమారుగా నాలుగు దశాబ్దాలుగా మరిచిన కారణంగా ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రులు నామమాత్రంగా మిగిలిపోవడం కాకుండా అనేక వింత సంఘటనలు జరిగిన సందర్భం భారతదేశంలో అందులో తెలంగాణ ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మనకు సుపరిచితమే.

నామమాత్రపు బడ్జెట్ తో ప్రభుత్వ ఆస్పత్రులను ప్రభుత్వాలే నిర్వీర్యం చేస్తూ తాము పెంచి పోషిస్తున్న టువంటి ప్రైవేటు రంగాన్ని ముఖ్యంగా వైద్యశాలల ను దోపిడీకి చిరునామాగా మార్చిన సందర్భాలు ఇటీవలి కరోనా నేపథ్యంలో మనందరం కళ్లారా చూస్తూ ఉన్నాము. ఈ రెండింటి నడుమ పేదవాళ్లు అనాథగా, అభాగ్యులుగా, దిక్కులేని వారిగా, దీనులుగా మారి అప్పులపాలై అలమటిస్తూ లక్షలాది రూపాయలను ఖర్చు చేసిన శవాలతో ఇంటికి వస్తున్నటువంటి దయనీయ గాథ లను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం శోచనీయం. దారుణం.

### ప్రభుత్వ ఆసుపత్రుల తీరు అవినీతి:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గ స్థాయిలో ,జిల్లా స్థాయిలో ,రాష్ట్ర స్థాయిలో అనేక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మిస్తానని వాగ్దానం చేసింది. కొత్తవి నిర్మించక పోగా ఉన్నవాటిలో కనీస సౌకర్యాలు కూడా కనుమరుగై ఎక్స్–రే ,ల్యాబ్ ,సిటీ స్కాన్, రక్త మూత్ర పరీక్షలు కూడా లేకపోవడం, అందుబాటులో ఉండక పోవడం ,నిపుణులు లేకపోవడం, సిబ్బంది నిరాకరించడం వంటి అనేక చర్యల వలన ప్రైవేటు ప్రయోగశాలల్లో వేలాది రూపాయలు ఖర్చు చేసి పరీక్షలు చేయించుకోవాల్సి వస్తుంది.

ఇటీవలి కరోనా నేపథ్యంలో జిల్లాస్థాయి ఆస్పత్రిలో కూడా ఆక్సిజన్ వంటి కనీస సౌకర్యాలు లేక ఎందరో చనిపోగా ఇటీవలనే ఎంజీఎం ను సందర్శించిన ముఖ్యమంత్రి గారి పర్యటన అనంతరం మందులు ,వివిధ వైద్య పరికరాల కుంభకోణం బయట పడడం దారుణం.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మెట్పల్లి ఆస్పత్రిలో ఇటీవల టీకాలను, పరీక్ష కిట్లను వందలాది రూపాయలు తీసుకొని బ్లాక్లో అమ్ముతున్నటువంటి సందర్భాలను కనులారా చూస్తున్న అధికారులు ప్రభుత్వం పట్టించుకోకపోవడం దేనికి సంకేతం?.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సౌకర్యాల పట్ల నిఘా ఉంచకపోవడం, పేద వర్గాలకు అందించకపోవడం వలన ప్రభుత్వ వైద్యశాలల పట్ల విశ్వాసం కోల్పోయిన వాళ్లు ప్రైవేటు ఆసుపత్రుల చుట్టూ తిరగడం దారుణం. ఇది రాజ్యాంగ ఉల్లంఘన కాదా?

ఇటీవల చనిపోయిన శవాలను కూడా మార్చి ఒకరిది ఒకరికి ఇచ్చిన సంఘటనలు, ఖాళీ ఆక్సిజన్ సిలిండర్ ను అమర్చడం, ఆంధ్రప్రదేశ్‌లోనూ తెలంగాణ రాష్ట్రంలోని ముఖ్యంగా అనేక ప్రభుత్వ , ప్రైవేట్ ఆసుపత్రులలో ఆక్సిజన్, వెంటిలేటర్ లేక వందలాది సంఖ్యలో చనిపోయిన వార్తలు విన్నాము .కానీ ప్రభుత్వానికి అయ్యో అనిపించకపోవడం దారుణం.

### ప్రైవేటు ఆస్పత్రుల దోపిడి– ప్రభుత్వ అజమాయిషీ వైఫల్యం:

ఆంధ్రప్రదేశ్ లోనూ, తెలంగాణ రాష్ట్రంలోను రోజు రోజు కరోనా పాజిటివ్ సంఖ్య తగ్గకపోగా కొనసాగుతూనే ఉన్నది.

ప్రభుత్వ ,ప్రైవేటు వైద్యశాలలో అనేక సంఘటనలు జరుగుతూ రోజు పిట్టల్లా రాలిపోతున్న విషయాన్ని పత్రికల్లో చదువుతూ టీవీల్లో వింటూ ఆవేదన చెందుతున్న సగటు ప్రజల గురించి పట్టించుకునే వారే లేరా?

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నైనా కరోనా వైద్యాన్ని ఆరోగ్యశ్రీలో చేర్చినారు. కానీ తెలంగాణలో అలాంటి సౌకర్యం లేదు. ఇన్ని ఒత్తిళ్లు చేసిన ప్రభుత్వం అంగీకరించకపోవడం శోచనీయం. ఆరోగ్య కార్డులు కలిగినటువంటి అనేక వర్గాలకు కూడా సౌకర్యం లేకపోవడం వలన ప్రభుత్వ వైద్యశాలలో ఈ సౌకర్యం లేక విశ్వాసం లేకపోవడం వలన ప్రైవేట్ ఆస్పత్రిలో లక్షలాది రూపాయలు ఖర్చు చేయవలసి వస్తున్నది.

ఇటీవల ప్రభుత్వం విడుదల చేసినటువంటి 248 ఉత్తర్వు ప్రకారంగా ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యానికి ఫీజుల రేట్లు నిర్ణయించినప్పటికీ ఆస్పత్రుల్లో ఒకరోజు వైద్యానికి లక్ష, లక్షకు పైగా వసూలు చేస్తూ చివరికి శవాల కుకూడా వైద్యం చేసి శవాలు అప్పగించి నటువంటి ఉదంతాలు మానవత్వానికి మచ్చ . ప్రైవేట్ ఆస్పత్రుల ఫీజులు వసూళ్లపై నిఘా ఉంచకపోగా ప్రైవేటు ఆస్పత్రులకు మద్దతు ఇచ్చిన సందర్భాలు చూసీచూడనట్టు ఉన్నటువంటి విషాద సంఘటనలు అనేకం.

తమిళనాడు, గోవా, మహారాష్ట్ర, ఢిల్లీ, కేరళ అనేక రాష్ట్రాలలో తక్షణ పరిష్కారం కింద ప్రైవేటు ఆసుపత్రులను ప్రభుత్వాలు స్వాధీనం చేసుకొని వాటిని ఆదేశించడంతో పాటు ప్రైవేట్ ఆస్పత్రిలో జరిగిన చికిత్సకు ప్రభుత్వమే ఫీజులు చెల్లిస్తూ ప్రైవేటు దోపిడిని కట్టడి చేస్తూ ఉంటే ఆంధ్ర ప్రదేశ్‌లో ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో మాత్రం ఎలాంటి సౌకర్యానికి నోచుకోక పోగా ప్రైవేటు దోపిడిని అరికట్ట కపోవడంతో ముఖ్యంగా పేదవాళ్లు లక్షలాది రూపాయల అప్పు చేసుకుని ఆస్పత్రుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో శవాలను మూటగట్టుకొని ఇల్లు చేరుతున్న టువంటి దీనగాథలు. తెలంగాణ రాష్ట్రం ఆకాంక్షలు ఇవేనా? ఇదేనా బంగారు తెలంగాణ?

ఆర్థికంగా దయనీయ స్థితిలో ఉన్నటువంటి అనేక కుటుంబాలు ఆసరా లేక, అనాథలుగా, అప్పులతో, కరోనా సోకిన సందర్భంలో అయోమయంలో, ఏమీ తోచని నిస్సహాయ స్థితిలో, ప్రాణాల మీద ఆశతో ప్రైవేట్ ఆసుపత్రిలో చేరితే ప్రభుత్వాలు భరోసా ఇవ్వాల్సిందే పోయి ప్రైవేట్ ఆస్పత్రిలో జరుగుతున్నటువంటి సంఘటనలు పట్టించుకోకపోవడం ప్రజలు గమనిస్తున్నారనే విషయాన్ని అందరూ ఆలోచించాలి.

అసలు కరో నాకే చికిత్స లేదన్నటువంటి సందర్భంలో లక్షలాది రూపాయలు దేనికి ఖర్చు అవుతున్నట్లు?

ప్రభుత్వ పెద్దలకు, శాసనసభ్యులు, మంత్రులకు కరోనా సోకిన నేపథ్యంలో

హైదరాబాదులోని గాంధీ ఆస్పత్రి గాని ఇతర ప్రభుత్వ ఆసుపత్రిలో చేరక ప్రైవేట్ ఆస్పత్రిలో చేరడంలోని ఔచిత్యం ఏమిటి?

– హోం ఐసోలేషన్ కు సంబంధించి తమిళనాడు ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం రోజే నాలుగు వేల రూపాయలు మంజూరు చేస్తూ ప్రైవేటు ఆస్పత్రులను ఆధీనంలోకి తెచ్చుకున్నాడు. ఇది తెలంగాణ ప్రభుత్వానికి సాధ్యం కాదా?లేక చిత్తశుద్ధి కొరవడినందుకా?

– ప్రభుత్వ వైద్యశాలలో పనిచేస్తున్న సిబ్బందికి ఎలాంటి మాస్కులు, గ్లౌజులు, పీపీ ఇకిట్లు ,రక్షణ సౌకర్యాలు లేనేలేవు.

– గ్రామాలలో పట్టణాలలో ఐ సొల్యూషన్‌లో ఉన్నటువంటి వారికి ఇళ్లల్లో సౌకర్యంలేని కారణంగా పోషకాహారం అందుబాటులో లేక చాలీచాలని ఆర్థిక పరిస్థితుల్లో సరఫరా చేస్తున్నటువంటి నాసిరకం మందుల కారణంగా తిరిగి బయట మందులు కొనుక్కోవాల్సిన దుస్థితి వస్తున్నది.

– ముఖ్యంగా రెండవ దశలో యువకులు ఎక్కువగా చనిపోతున్న నేపథ్యంలో 18 నుండి 44 సంవత్సరాల లోపు వారికి ముందుగా వ్యాక్సినేషన్ సౌకర్యాన్ని కల్పించే ప్రయత్నం చేయవలసిన అవసరం ఎంతగానో ఉన్నది.

ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యంగా ప్రైవేటు ఆస్పత్రులను ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకుని పేషెంట్లకు అయినటువంటి ఖర్చును ప్రభుత్వమే చెల్లించి ప్రైవేటు ఆసుపత్రుల దోపిడీ అరికట్టడంతో పాటు ప్రభుత్వం యొక్క సామాజిక బాధ్యతలు నిర్వహించి ప్రభుత్వ వైద్యశాలల పట్ల విశ్వాసాన్ని పెంచి పోషించవలసిన రక్షణ కర్తవ్యాన్ని ప్రభుత్వం గుర్తించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆపద సమయంలో ఆదుకున్నట్లయితే ప్రజలకు విశ్వాసం పెరుగుతుంది. మెరుగైన ప్రభుత్వ వైద్యం అందించడం ద్వారా ప్రభుత్వం ప్రజల మనసులను చూరగొనే అవకాశం కరోనా సందర్భమే.

అవకతవకలకు , అవినీతికి పాల్పడుతూ ప్రభుత్వం సరఫరా చేసినటువంటి పరికరాలు, మందులు ,ఇంజెక్షన్లను బ్లాక్ మార్కెట్లో అమ్ముతున్నటువంటి ప్రభుత్వ వైద్యశాలలోని సిబ్బందిపైన కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అధిక ఫీజులు వసూలు చేస్తూ శవాలకు కూడా వైద్యం చేస్తున్నటువంటి ప్రైవేటు దోపిడిని వెంటనే అరికట్టి ప్రైవేట్ ఆస్పత్రులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం ద్వారా నాణ్యమైన ఉచిత వైద్యాన్ని అందించడం ద్వారా ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవలసిన అవసరం నేడు ఎంతగానో ఉన్నది.ఢిల్లీ ప్రభుత్వం అవసరమైనవారికి ఇంటికే ఆక్సిజన్ సరఫరా చేస్తుంది.వైద్యానికి నిధులు ఎక్కువ కేటాయించింది. మనమూ ఆబాటలో నడిస్తే మంచిదే కదా!

– వడ్డేపల్లి మల్లేశము,
9014206412

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేత

మహబూబాబాద్ : సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో మహిళలు, ఆడపిల్లల సంక్షేమానికి, భద్రతకు చేపట్టిన కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతూ.. వారికి అండగా నిలుస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజున లైంగికదాడికి గురైన బాధిత కుటుంబాలకు మహిళా, శిశు సంక్షేమ తరపున గిరిజన, స్త్రీ, సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ఆర్థిక సాయం అందించారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో బాధిత ఇటీవల జిల్లాకు చెందిన మహిళ లైంగిక దాడికి గురైన నేపథ్యంలో ఆమె కుటుంబానికి నేడు 25,000 రూపాయల చెక్కును అందించారు. ఆమెకు లక్ష రూపాయలు ఆర్థిక సాయం, వైద్యానికి అయ్యే ఖర్చు భరిస్తామని చెప్పారు. అదేవిధంగా ఇటీవల లైంగిక దాడికి గురై, హత్య కావించబడిన మోడు ఉష కుటుంబానికి మొదటి విడత 25 వేల రూపాయలు చెక్కును అందించారు.

కార్యక్రమంలో జిల్లా జడ్పీ చైర్పర్సన్ కుమారి బిందు, ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్యే శంకర్ నాయక్, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ జిల్లా సంక్షేమ అధికారి సబిత, తదితరులు పాల్గొన్నారు.

## కొవిడ్ వ్యాక్సిన్లపై మేథో సంపత్తి హక్కుల రద్దుకు హర్షవర్ధన్ పిలుపు

న్యూఢిల్లీ, జూన్ 2: కరోనా మహమ్మారి ప్రపంచాన్ని పీడిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో మేథో సంపత్తి హక్కుల (ఐపీఆర్) విషయంలో పరిశ్రమ పట్టుదలతో ఉండేందుకు అవకాశం లేదని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ పేర్కొన్నారు. కొవిడ్–19 వ్యాక్సిన్లపై ఐపీఆర్ ఎత్తివేతను కోరుతూ ఉమ్మడి సవాళ్లను సమిష్టి బాధ

నేటినిజం
# సాహితీ కిరణాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 3-6-2021

## నేటికవిత-కవిత్వ విశ్లేషణ

-శ్రీదాసం లక్ష్మయ్య
అడిక్, నేరేడచర్ల
9440155240

నేటికవితలో ఈ వారం: ధనదాహం

అనే అంశంపై వచ్చిన 64 కవితల సమీక్షలో అత్యుత్తమంగా నిలిచిన కవితల్లోంచి ఓ మూడు ఎంపికయిన కవితలపై విశ్లేషణ

-దాసం సేనాధిపతి
కవిత్వ విశ్లేషకులు
9440525544

### మనిషి పతనం

పెళ్ళింట్లో దొంగలు పడి
నగా నట్రా పట్టుకెళ్తే
ఆకలి కేకలు ఒకనాడు
నేడు ఆశలు ఆకలి హద్దులు దాటి
శవంపై పేలాలేరుకునే స్థితికి దిగజార్చింది
ధన దాహం రూపాంతరం చెంది.

కాసుల కవ్వింపులు
తుఫానులుగా పరిణమించి
బీటలు వారుతున్నాయి
అనుబంధాల గోడలెన్నో.

డబ్బు రుచిమరిగిన పులులు కొన్ని నేడు
జనారణ్యంలో జొరబడుతున్నాయి
ధనదాహమే ఉన్మాదంగా మారుతూ
ఉచ్ఛం నీచం మరిచి సాగుతుంటే..

మానవత్వం మరుగై
వారి దురాశల ఇనుప పాదాలకింద
అమాయకపు బతుకులు నలిగిపోతున్నా..
ఆక్రందనలు వినిపించుకోని
సమాజంలో కేకలుపెడుతూ
పరిపాలన తీరు మారని పాలనలో
జీవితాలు మసకబారుతుంటే
కన్నీరే తోడుగా సాగుతున్న
అడుగుల ముద్రలుచూస్తూ
కాలం సైతం విస్తుబోతోంది
డబ్బుకు బానిసైన మనిషి
పతనానికి

-ఉదయశ్రీ ప్రభాకర్
9866687134

హన్మకొండకు చెందిన కవయిత్రి ఉదయశ్రీ ప్రభాకర్ గారు ధనదాహం అంశంపై మనిషితనం శీర్షికతో రాసిన కవితలో మానవత్వం మరిచి ధనం పట్ల మనిషి ఎలా బానిసైనాడో తెలియజేసే ప్రయత్నం చేశారు. ఈ రోజు డబ్బు పట్ల వ్యామోహం పెరిగి మానవత్వానికి పాతరేసి మనిషి అనుసరిస్తున్న తీరుతెన్నులను కవయిత్రి ఉదయశ్రీ గారు తమ కవితలో ఆవిష్కరించారు.

కాలం సైతం విస్తుపోయే విధంగా మనిషితనానికి తెరవేస్తూ డబ్బే లోకమని భావించే ప్రబుద్ధులు అమానవీయ పనులు చేస్తున్న ప్రస్తుత పరిస్థితులకు అద్దం పడుతూ కవయిత్రి తమ కవితను కొనసాగించిన తీరు బాగుంది. కవిత ఎత్తుగడలోనే ఒకనాడు పెళ్ళింట్లో దొంగలుపడి నగానట్రా పట్టుకెళ్లే ఆకలి కేకలు వింటే.. నేడు ఆశలు హద్దులు దాటి శవాలపై పేలాలేరుకునే దుస్థితికి దిగజార్చి ధనదాహంగా రూపాంతరం చెందిందని తమ ఆవేదనను వ్యక్తపరచారు. ధనంపై మోజుకు హద్దేలేని విధంగా నేడు పరిస్థితులు దాపురించాయన్న అర్థం ధ్వనించే విధంగా ప్రారంభ పంక్తుల్లో ఇవ్వబడిన కవితా వస్తువుకు బలం చేకూరేలా కవయిత్రి ఉదయశ్రీగారు తమ భావాలకు అక్షరరూపం ఇచ్చారు. కాసుల కవ్వింపులు తుఫానులుగా పరిణమించి అనుబంధాల గోడలు బీటలు వారుతున్నాయని కవితాత్మకంగా నడుస్తున్న చరిత్రకు అద్దంపట్టారు. డబ్బు రుచి మరిగిన పులులు కొన్ని నేడు జనారణ్యంలో చొరబడుతున్నాయని ధనదాహమే ఉన్మాదంగా మారి ఉచ్ఛం..నీచం మరిచి సాగిపోతుంటే మానవత్వం మరుగున పడుతోందని కవయిత్రి ఉదయశ్రీ గారు ఆర్ద్రంగా తమ భావాలను అక్షరాలలో బంధించారు. ఆక్రందనలు వినిపించుకోని ఈ సమాజంలో మానవత్వం మరిచి డబ్బుకోసం పీడిస్తున్న వారి దురాశల ఇనుప పాదాల కింద అమాయకబతుకులు నలిగిపోతున్నాయని తమ బాధను ప్రకటించారు. పరిపాలన తీరు మారని నేపథ్యంలో కన్నీరే తోడుగా సాగుతున్న జీవితాలు మసకబారుతున్న అడుగుల ముద్రలను కవయిత్రి తమ కవితలో దృశ్యమానం చేసారు. డబ్బుకు బానిసై 'మనిషితనం' పతనమై పోతున్న వైనాన్ని అర్థవంతంతంగా ప్రస్తావించారు. అభివ్యక్తిలో నవ్యత, శిల్పవిషయంలో చతురతను ప్రదర్శించారు. పదబంధ ప్రయోగం బాగుంది. కవితావస్తువును బలంగా ప్రకటించ ప్రయత్నించడం ప్రశంసనీయం.

### పచ్చనోటు

ధనదాహం రాక్షసంగా విస్తరిస్తూ
చిక్కటి రక్తాన్ని తాగుతూ
దు:ఖపు నదిలో ముంచుతోంది.

నీతి నిజాయతంటూ
ఏ నియమాలు లేకుండా
బతికించే ధైర్యాన్ని
కార్పోరేట్ సిరంజి లాక్కుంటోంది...
మందు బిళ్ళల రంగుల్లో..
ఎన్ని కుట్రలో..
మొసలి కన్నీళ్ళతో
డబ్బే ప్రపంచమంటూ
చెప్పకనే చెబుతున్న.
ఫార్మా కంపెనీలు.
నీటిమీద రాతల్లా అంతటా
భ్రమల లోయలే
వైద్య విద్య రంగాలేమో
డబ్బెవరికి చేదంటూ
సిరిగలవానికి చుట్టమయ్యాయి.
సత్యపు దారులను వదిలి
కోట్లతో కనికట్టు చేసే
పచ్చనోటుదే రాజ్యమైందిప్పుడు.

పట్టుకున్నదేమో దౌర్భాగ్యపు రోగం
ఔషధమేమో ఔటులా బతుకుపై పేలుతుంటే
ఎక్కడికక్కడ.. పీక్కుతునే గుంటనక్కలు
అడుగడుగున కాటువేస్తున్నాయి.

పుస్తెలమ్మైనా బతుకుపేజీలో
రూపాటి ఆశలను నిలబెట్టుకుందామంటే
ఎన్ని దందాలను దాటించాలి
విచ్చలవిడిగా పారుతున్న
కల్తీమందులకు లొంగి
ఎన్ని నిద్రలు శాశ్వతమవుతున్నాయో
లెక్కతేల్చగలమా..
కాటిలో కూడా కాచుకుంటున్న చిల్లరగాళ్ళు.

మానవత్వం ఎప్పుడో చచ్చిపోయింది
ధనమే సమస్తమైన కాలాన
ధనదాహపు రాజకీయాలకు
పంచనామా చేసే దిక్కేది?

-భానుశ్రీ కొత్వాల్
9866863913

నల్లగొండకు చెందిన కవయిత్రి భానుశ్రీ కొత్వాల్ గారు ధనదాహం అంశాన్ని పచ్చనోటు శీర్షికతో రాసిన కవితలో సత్యపు దారులను వదిలి కోట్లతో కనికట్టుచేసే పచ్చనోటే రాజ్యమేలుతోందని వ్యాఖ్యానించారు. రోజురోజుకూ సమాజంలో ధనదాహం రాక్షసంగా విస్తరిస్తున్నదని చిక్కటి రక్తాన్ని తాగుతూ దు:ఖపు నదిలో ముంచుతోందని వివరించిన తీరు కవితయొక్క ఎత్తుగడకు నిండు శోభను కూర్చింది. నేడు నీతి నిజాయితంటూ ఏ నియమాలు లేకుండా బతికించే ధైర్యాన్ని కార్పోరేటు సిరంజి లాక్కుంటోందని వాపోయారు. మానవత్వాన్ని మనిషితనాన్ని గాలికొదిలి జనాన్ని పట్టి పీడిస్తోన్న కార్పోరేటు ఆసుపత్రుల దోపిడీపై కవయిత్రి తమదైన శైలిలో చక్కని శిల్పంతో పదబంధాలను కూర్చి ప్రస్తుతపరిస్థితులపై ధ్వజమెత్తారు. కవితా వస్తువును చక్కగా ఆవిష్కరించారు. ప్రయోగింపబడిన పదబంధాలు ఔచిత్యవంతంగా ఉండడమే కాక అవి చక్కగా కవితలో ఒదిగిపోయాయి. విలక్షణమైన అభివ్యక్తితో కవితను కొనసాగించారు. మందుబిళ్ళల రంగుల్లో ఎన్ని కుట్రలో మొసలి కన్నీళ్లతో డబ్బే ప్రపంచమంటూ చెప్పకనే చెబుతున్న ఫార్మాకంపెనీలు అంటూ రాసిన పంక్తులు నడుస్తున్న చరిత్రకు అద్దం పట్టాయి. నీటిమీద రాతల్లా అంతటా భ్రమల లోయలే. వైద్య విద్యారంగాలేమో డబ్బెవరికి చేదంటూ సిరిగలవానికి చుట్టమయ్యాయని తేల్చిచెప్పిన తీరు బాగుంది.

నేడు దౌర్భాగ్యపు రోగం పట్టుకున్న నేపథ్యంలో ఔషధం పేరుతో ఎక్కడికక్కడ గుంటనక్కలు వేధిస్తున్న వైనాన్ని కవయిత్రి భానుశ్రీ గారు చక్కగా తమ కవితలో ప్రస్తావించారు. పుస్తెలమ్మైనా బతుకుపేజీలో రేపటి ఆశలను నిలబెట్టుకుందామంటే ఎన్నో దందాలను దాటి రావలసిన పరిస్థితి దాపురించిందని వాపోయారు. విచ్చలవిడిగా పారుతున్న కల్తీమందులకు లొంగి ఎన్ని నిద్రలు శాశ్వతమైపోతున్నాయని వాటి లెక్కలు తేల్చడం ఎవరితరం? అన్న అర్థం ధ్వనించేలా కవయిత్రి అంశం వెలుగులో తమ భావాలను బలంగాప్రకటించారు. కాటిలోకూడా కాచుకుంటున్న చిల్లరగాళ్ళను ఎండగట్టారు. మానవత్వం ఎప్పుడో చచ్చిపోయి ధనమే సర్వస్వమైందని వ్యాఖ్యానించారు. ధనదాహపు రాజకీయాలకు పంచనామా చేసే దిక్కేది? అంటూ ప్రశ్నిస్తూ ప్రస్తుత సమాజంలోని పరిస్థితులను అక్షరాలలో అర్థవంతంగా నిక్షిప్తం చేశారు. కవితావస్తువును ఆద్యంతం ఆలోచనాత్మక భావాలను కవితాత్మకంగా మలచడంలో కవయిత్రి భానుశ్రీగారు సఫలీకృతులైనారు.

### డబ్బు జబ్బులో

ఉమ్మనీరు చీకటిలో
అమ్మ గర్భాన ఎదిగిన జీవం
నేలపై పురుడోసుకున్నాక
లబ్ డబ్ మరిచి డబ్బు జబ్బులో.

ఉప్పు చెమట రుచికి కట్లపాములు
నిప్పుల కల్లం చేరేదాకా మారని మూర్ఖులు.
రూకకు రూపం మార్చే మారీచులు
ఊపిరి గడియమూసే కర్కోటకులు.

ఏరూ విషాన్ని నింపుకుని ఎక్కెక్కి
నురగలు కక్కుతున్నా
కట్లల్లో ఊరేగుతూ
పాపాలు కడుక్కోను సందేశాలు.
ఉప్పునీరు దాహార్తిని తీర్చదు
కిరోసిన్ యజ్ఞక్రతువుకు అనర్హతే
ముళ్ళచెట్లు పందిళ్ళ పచ్చనాకు కాదు
పాపపు క్రియలు సమాజానికి పాశానాలు.

మామూల్లు శవపంచనామాకు
తప్పని కాలం
కబ్జాలన్నీ ఈజీమనీ వైట్ కాలర్ నేరాలు.
వీరిని శాసించే చట్టాలు నిదుర లేచిన్నాడు
కోకొల్లలుగా నా భారతావని నిండా
పూచే కార్తీక వెన్నెలలు

-ఏడెల్లి రాములు
9494800454

పెద్దపల్లి జిల్లా ఎల్లంపల్లికి చెందిన కవి ఏడెల్లి రాములు గారు ధనదాహం అంశంపై డబ్బు జబ్బులో శీర్షికతో రాసిన కవితలో నేడు సమాజాన్ని పట్టిపీడిస్తున్న వైట్‌కాలర్ నేరాలను ఎండగట్టారు. నేడు అడుగడుగునా సమాజంలో దోచుకుంటున్న వైట్ కాలర్ నేరగాళ్ళ గురించి అక్షరాలలో ఆవిష్కరించిన తీరు బాగుంది. చట్టాలెన్ని ఉన్నప్పటికీ నేడు దేశమంతా అవినీతిపరులు జలగల్లా మారి జనం రక్తాన్ని పీల్చుతున్న వారిపై తమ కవితలోఎండగట్టారు.

ఎత్తుగడలోనే కవి రాములు గారు నేడు కొందరు సమాజంలో డబ్బుకు ఎలా దాసోహమయ్యారో చక్కగా ప్రస్తావించారు. ఉమ్మనీరు చీకటిలో అమ్మ గర్భాన ఎదిగిన జీవం నేలపై పురుడోసుకున్నాక లబ్ డబ్ మరిచి డబ్బు జబ్బులో కూరుకుపోయారని వ్యాఖ్యానించారు. గుండె లబ్ డబ్ అని అనడం మాని డబ్బు డబ్బు అని గుండె కొట్టుకుంటుందన్న అర్థం వచ్చే విధంగా డబ్బు జబ్బు పట్టుకుందని అభిప్రాయపడ్డారు. కవిత్వ సృజనలో, శిల్పం విషయంలో చక్కని ఉపమానాలు, వర్ణనలకు చోటు కల్పించి కవితా వస్తువుకు పుష్టిని కలిగించారు. ఉప్పు చెమట రుచికి కట్లపాములు నిప్పుల కల్లం చేరేదాకా మారని మూర్ఖులపై కవి రాములు గారు తమ కలాన్ని సంధించారు. రూకకు రూపం మార్చే మారీచులు ఊపిరి గడియ మూసే కర్కోటకులు నిలువెల్లా విషాన్ని నింపుకుని ఎక్కెక్కి నురగలు కక్కుతున్న కలల్లో ఊరేగుతూనే పాపాలు కడుక్కోవడానికి దొంగేషాలు వేస్తున్నారని వాపోయారు. ఉప్పునీరు దాహార్తిని తీర్చదని, కిరోసిన్ యజ్ఞ క్రతువుకు అనర్హతేనని ముళ్ళచెట్టు పందిళ్ళ పచ్చనాకు కాదని తెలియజెపుతూ పాపపు క్రియలు సమాజానికి పాశానాలుగా మారాయని కవి తమ ఆవేదనను వ్యక్తపరచారు. సమాజాన్ని నేడు ధనదాహం ఎంత తీవ్రంగా పట్టిపీడిస్తుందో కవి తమ లోకపరిశీలనా పటిమతో ఔచిత్యవంతమైన పదబంధ ప్రయోగంతో ఈనాటి అవినీతి మహమ్మారిని కవితయందు దృశ్యమానం చేయడంలో ఆయన కృతకృత్యులయ్యారు. శవపంచనామాకు కూడా లంచాలు అడుగుతున్న పరిస్థితులను ప్రస్తావిస్తూ కవితకు కవితావస్తువుకు బలాన్ని కూర్చారు. కబ్జాలన్నీ ఈజీమనీ వైట్‌కాలర్ నేరాలుగా అభివర్ణించారు. చట్టాలు ఎన్ని ఉన్నప్పటికీ ధనదాహంతో చెలరేగిపోతున్న అవినీతిపరుల సంకెళ్లలో బంధింపబడి ప్రజానీకం పడుతున్న వ్యధలకు కవి రాములు గారు తమ కవితలో చోటు కల్పించారు. ఆద్యంతం నడుస్తున్న చరిత్రకు అద్దం పట్టారు. అభివ్యక్తిలో వస్తువిశ్లేషణలో శ్రద్ధ చూపుతూ మున్ముందు మరింత బలమైన కవిత్వాన్ని పండిస్తారన్న విశ్వాసం ఉంది.

# సహజ వారసత్వం జానపద కళలు - సాహిత్యం

-డా ॥ పూసల రజనీగంగాధర్
9290680605

"జా"నపదం " అనే పదానికి అర్థం జానపదులనుండి పుట్టిన,లేదా జానపదుల సంబంధమైన అనే అర్థాన్ని స్థూలంగా చెప్పుకోవచ్చు . జానపదులనుండి పుట్టినవే జానపదాలు. జానపదాల్లో ప్రాచీన నాగరికత, ప్రాచీన సంస్కృతిఆచార వ్యవహారాలు విస్పష్టంగా కనిపిస్తాయి. ఈ జానపదులకు సంబంధించిన కళలనే జానపదకళలని, ఆ సాహిత్యాన్ని జానపద సాహిత్యమని, ఆ సంగీతాన్ని జానపద సంగీతమని, గేయాలను జానపద గేయాలని అనడం జరిగింది జానపదాలు అంటే ఆ సాహిత్యం,ఆ సంగీతం శ్రమజీవుల సొత్తు అని చెప్పవచ్చు.

**జానపద సాహిత్య ఆవిర్భావం** – జానపద సాహిత్యానికి అజ్ఞాత కర్తృత్వం ప్రధాన లక్షణం. తొలినాటి మానవుడు భాష నేర్పడానికి పూర్వం తన భావ వ్యక్తీకరణ కొరకు హావ భావాలను ప్రదర్శిస్తూ, ఆ సందర్భంగా తన నోటి వెంట అప్రయత్నంగా వచ్చిన కొన్ని శబ్దాలకు మాటల రూపాన్నిచ్చి తదుపరి కాలంలో దానికి అక్షర రూపాన్ని సంతరింపజేశాడు

భాష ఏర్పడిన తరువాత కొన్ని కొన్ని సందర్భాలలో ఆ వ్యక్తి ఆవేశంతోనో ఆనందంతోనో స్పందించినప్పుడు అప్రయత్నంగా తన నోటివెంట లయబద్ధంగా పుట్టుకొచ్చిన గానానుకలమైన పదాల కలయికే జానపద సాహిత్యమయ్యింది.మౌఖికమైన ఈ సాహిత్యానికి కవులందరూ అజ్ఞాత కవులే.

**జానపద కళలు** – సాహిత్యానికీ, కళలకు అవినాభావ సంబంధం ఉంది. కళలకు సాహిత్యమే ప్రధానం అయితే కొన్ని వాద్య, నృత్య అభినయ ప్రధానమైన కళలు కూడా ఉన్నాయి. వాటికి సాహిత్యంతో సంబంధం లేదు. ఎక్కువ భాగం కళలు సాహిత్యాధారాలనేది వాస్తవం. కళలు అనేక రకాలుగా ఉన్నాయి. వాటిలో జానపదులకు సంబంధించిన కళలు జానపద కళలు. తొలినాటి మానవుడు ఆనంద పారవశ్యంతో గానం చేస్తూ లయబద్ధంగా వేసిన అడుగులు చేసిన అభినయమే నృత్య రూపాన్ని సంతరించుకున్నది. ఆ విధంగా ప్రారంభించబడిన అభినయ గాన ప్రదర్శన యోగ్యమైన కళలు ఒక్కొక్కటి మరికొన్ని రూపాలుగా రూపాంతరం చెందాయి. సంప్రదాయ సాహిత్యానికీ, సంప్రదాయ సంగీతానికీ, సంప్రదాయ నృత్యానికీ అన్నిటికీ మూలం జానపదమే అన్నది సుస్పష్టం.

**జానపద కథాగేయాలు** – ఈ నాటి పరిస్థితిలా ప్రదర్శనకు ప్రత్యేకమైన వేదికలు ఆనాడులేవు. కేవలం గాయక భిక్షకులు గాన యోగ్యమైన గేయాలను ఆలపిస్తూ సంచారం చేస్తూ తద్వారా పొట్టబోసుకునేవారు. ఈ జానపద గేయాలు భావాంశాలు ప్రధానమైనవిగా ఉండి కాలక్రమంలో కథాంశాలు ప్రధానంగా కథాగేయా లుగా మరో రూపాన్ని ప్రోదిచేసుకున్నాయి. కథాంశాలు ప్రధానం కావడంతో వీటికి శ్రావ్యమైన జానపద సంగీతంతో బాటు అభి నయ ప్రదర్శన హావభావ ప్రకటన చోటుచేసుకొని వీటి ప్రదర్శనకు ఒక ప్రత్యేకమైన వేదిక కావలసి వచ్చింది

ఆనాడు రచ్చబండలు, గ్రామంలోని కూడలి, దేవాలయాలు మొదలైనవి ప్రదర్శనా స్థలాలుగా ఉపయోగపడ్డాయి.ఈ ప్రదర్శన యోగ్యమైన జానపద కళలు, కథను గానంచేసే జాతులవారి పేరుల మీదుగా కొన్నికథలు వెలిశాయి.అసలీ జానపద కథాగానాల్లో ప్రధానమైనది వీధి భాగవతం, మరొకటి తోలుబొమ్మలాట.

**వీధి భాగవతాలు** – బ్రొలాట, యక్షగానం, వీథినాటకం, కలాపం వీటి నన్నింటినీ భాగవతాలుగానే పిలుస్తున్నా ప్రదర్శనా విధానంలో భిన్న రీతులు ఉన్నాయి. యక్షగానాల్లో, చిందు యక్షగానం. దీనినే చిందు భాగవతమని కూడా అంటారు.అందులో ఆహార్యం ఉత్తర కెనడా యక్షగానాలను పోలి ఉంటుంది. ఇది ఎస్.సి ల వృత్తి కళా రూపంగా పేరు పొందింది. ఇందులో స్త్రీలు స్త్రీవేషాలే గాక పురుష వేషాలుకూడా వేస్తుండేవారు.' తూర్పు భాగవతం ' పారిజాతంకథ ఆధారంగా మలచబడ్డ భామాకలాపం. ఇది కేవలం విజయనగరం శ్రీకాకుళం విశాఖ జిల్లాలో మాత్రమే కన్పిస్తుంది

**వీధి నాటకం** – దీన్ని ' వీధి భాగవతం ' ' బయలాట ' అంటారు.చిత్తూరు, కడప, గుంటూరు, మెదక్, నల్గొండ జిల్లాలో విస్తృతంగా ఉంది.

**పగటి వేషాలు** – నాటకం ప్రేక్షకులను ఒక చోటికి చేర్చి ప్రదర్శించేదైతే, పగటి వేషం ప్రేక్షకుల దగ్గరకు వెళ్ళి ప్రదర్శించేది. ఇది తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణాజిల్లాల్లోని కూచిపూడి ఈ కళలకు ప్రసిద్ధి.

**తోలు బొమ్మలాటలు** – తోలుతో తయారు చేయబడిన బొమ్మలను తెరవెనుకనుండి ఆడించడం వలన తోలుబొమ్మలాట అని పేరు వచ్చింది. ఇది కేవలం ఇతిహాస వస్తు ప్రధానమైనది.ఈ ప్రదర్శనోద్దేశంలో భక్తి ప్రాధాన్యత ఎక్కువ. దీనికి సంగీతంతోబాటు సాహిత్యం కూడా అంతే ప్రధానంగా ఉంటుంది. దీన్ని సంచార జాతులవారు ప్రదర్శిస్తారు. కాని వీరికి తోలుబొమ్మలవారు లేదా బొమ్మలాటవారు అన్న పేరు సార్థకమయ్యింది. గతంలో జంగాలు, పద్మశాలీలు కూడా ఈ ప్రదర్శనలిచ్చేవారు. ప్రస్తుతం ఆరె మరాఠీవారు మాత్రమే ప్రదర్శిస్తున్నారు. రాయలసీమ, కోస్తా, ఆంధ్రాలలో ప్రముఖంగా ఉండేవారు. దీనిలో జానపద సాహిత్యానికి తోడు ఇతిహాసాలలో శ్లోకాలు పద్యాలు కూడా గానం చేయడం జరుగుతుంది.

నృత్యగీతంగా మొదట ప్రచారంలో ఉన్న ఈ ప్రక్రియనే తరువాత ' కథా గేయం ' అని పిలిచారు. జానపద సాహిత్య లక్షణాలు ప్రపంచమంతా ఒకే విధంగా ఉండడం విశేషం. ఇంగ్లీషులో ఈ కథా గేయాలకు Balled Folk Epic, Narrative Poem అనే పదాలు వాడుకలో ఉన్నాయి. మధ్యకాలపు యూరపు దేశాలలో ఈ జానపద గేయ కథలకు ఢిూశ్రీశ్రీవన అనే పేరు ఏర్పడింది. ఈ పదం లాటిన్‌లోని Balled అనే పదంనుండి పుట్టింది. ఇంగ్లీషు, ఫ్రెంచి, జర్మన్ భాషల్లో ఢిూశ్రీశ్రీవన అని వ్యవహరిస్తే రష్యన్ భాషలో Bylini అని లాటిన్‌లో Baller అని వ్యవహరి స్తున్నారు.ఇంచుమించు ఇవన్నీ సమానార్థకాలే Balled is a song to which folk used to dance. Yet mearly every variety of short poem in english has been called a balled ఈ కథాగేయాల్లో వీర, రౌద్ర, కరుణ రస ప్రధానాలైన కథాగేయాలు, వీరగాథా గేయాలుగా వేరుపడ్డాయి..

### జానపద కథలు – రకాలు

జంగం కథలు – శైవమత వ్యాప్తికి దోహదం చేయడానికి ప్రారంభమైన ఈ కథలను ' జంగం ' జాతివారు గానం చేయడం వలన ఈ కథలకు జంగం కథలు అని జాతిపరంగా నామం సార్థకమయ్యింది.వీరు ఊరూరూ తిరుగుతూ

శైవమత ప్రచారానికై కథాగానం చేసేవారు.ఈ కథను గానం చేయడానికి ఒక కథకుడు, ఒక్కరు లేదా ఇద్దరు వంతలు ఉంటారు. ప్రారంభ దశలో శైవమత ప్రచారానికే ప్రాధాన్యత నిచ్చిన ఈ జంగం కథకులు దీనినే జీవనాధారంగా చేసికొని వృత్తి కళగా స్వీకరించడంతో కథకునితో బాటు వంతలు వారి భార్యలే కావడం విశేషం.

> "జానపదం " అనే పదానికి అర్థం జానపదులనుండి పుట్టిన,లేదా జానపదుల సంబంధమైన అనే అర్థాన్ని స్థూలంగా చెప్పుకోవచ్చు .

వీర విద్యావంతుల కథలు – వీర విద్యావంతులు గానం చేయడంవలన ఈ కథలకు వీరవిద్యావంతుల కథలు అని పేరు వచ్చింది. వీరు ప్రధానంగా రాయలసీమ ప్రాంతంలోని వారు కావడం చేత ' పల్నాటి యుద్ధం' కథను ప్రధానంగా గానం చేస్తారు.

కొమ్ముగొల్లల కథ – కొమ్ము గొల్లలు అనే జాతి ఈ కథను గానం చేయడం వల్ల ఈ కథలకు కొమ్ముగొల్లల కథ అని పేరు వచ్చింది.దీనినే కొమ్ము కథ అనికూడా అంటారు.వీరు కాటమరాజు కథను గానం చేస్తారు.ఈ కథలో కొమ్ము ప్రధానమైన నాద పరికరం.ఈ విధంగా కథలను గానం చేసేవారి పేరు మీదుగానే గాక కథకులు ఉపయోగించే వాద్యాలను బట్టికూడా కొన్ని పేర్లు వచ్చా యి.వీటిలో ప్రధానమైనవి తంబుఱకథ, బుఱ్ఱకథ,కంజరికథ, జముకులకథ, రుంజకథ, కొమ్ముకథ మొదలైనవి. ఇవికాక గొల్లసుద్దులు, ఒగ్గుకథ, ' ఆ ' కథ కిన్నెర కథ మొదలైనవి మరికొన్ని

' ఒగ్గుకథ ' అభినయ నృత్యాలకు ప్రాధాన్యతనిస్తే కిన్నెర కథలో లాలిత్యం, కరుణ, జంగం కథలో వీరత్వం ప్రధానాంశాలు.

**యక్షగానం** – హరికథను కూడా యక్షగానం గానే పూర్వం వ్యవహరించేవారు.యక్షులు గానం చేయడం వల్ల ఆనాడు దీనికా పేరు వచ్చిందని నానుడి. దీనిలో సంగీత సాహిత్యాలు సమపాళ్ళలో ఉంటాయి.ఈ హరికథ కూడా జానపదకళే అయినప్పటికీ ప్రస్తుత కాలంలో దీన్ని జానపద కళల్లో పేర్కొనడానికి వీల్లేదు. ఎందుచేతనంటే మాత్రా ఛందస్సుతో కూడిన రగడలు, ద్విపదలు ఇందులో చోటు చేసుకున్నా భాషా పరంగా ఇది జానపదుల వ్యవహార శైలికి దూరంగా ఉండి కేవలం ఐతిహాసిక మైనందున దీనిని జానపద కళ నుండి వేరుచేసి చూడాల్సి వస్తుంది. ఎందుకంటే జానపద సాహిత్యంకాని, సంగీతం గాని జాన పదులనోట నుండి ఆనందావేశాల సందర్భాలలో అప్రయ త్నంగా జాలువారినవే. వాటికి నియమ నిబంధనలు నిర్దుష్టమైన ఛందస్సు కర్తృత్వమూ లేవు. అట్టి జానపద శైలికి భిన్నంగా సంగీత సాహిత్యాలు ఇందులో చోటుచేసుకోవడం చేత దీనిని జానపద కళ అనడంలో ఔచిత్యంలేదు. అయితే ప్రస్తుతం వివిధాంశాలు కథా వస్తువులుగా హరికథలు కూడా రూపుదిద్దుకుంటున్నాయి.ఈ హరికథలను గానం చేసేవాళ్ళను భాగవతులని, భాగవతార్‌లని, హరిదాసులని, హరికథా భగవతారులని ఆంధ్రలో వివిధ రకాలుగా పిలుస్తుంటే ఈ కళారూపాన్ని తమిళులు ' కాలక్షేపం ' అని మహారాష్ట్రలో ' అరంగే ' అని పిలుస్తున్నారు. ఐతిహాసిక యుగంలోని కుశలవులు గానంచేసిన రామాయణం ఈ కోవకు చెందినదే. తొలుత దీనిని యక్షగానమనే పిలిచారు అయితే యక్షగానం బహువ్యక్తికంగా, హరికథ ఏకవ్యక్తికమై బహుపాత్రాభిన యంతో చేసే ఒక సంగీతోపన్యాసం అని చెప్పవచ్చు. సంగీత సాహిత్యాభినయాలతో బాటు హాస్యం కూడా ప్రాధాన్యత సంతరించుకొంటుంది.

**రుంజకథ** – ఈ కథను విశ్వబ్రాహ్మణుల వివాహాది శుభకార్యాల సందర్భంగా గానం చేస్తారు. విశ్వబ్రాహ్మణులను యాచన చేసే ఒక ప్రత్యేకమైన జాతివారు కథను గానం చేస్తారు. వీరు శివ భక్తులు. బ్రహ్మచేత సంహరించబడిన రహుంజుడనే రాక్షసుని చర్మాన్ని ఎముకలను నాడులను ఉపయోగించి ఈ వాద్య పరికరం నిర్మాణం చేయబడింది

రహుంజుడనే రాక్షసుని దేహం కావడంవల్ల దీనికి ' రహుంజ ' అని పేరు వచ్చింది. కాలక్రమేణా ఉచ్చారణా సౌలభ్యం కోసం నేడది ప్రజల్లో ' రుంజ' గా స్థిరపడింది. రుంజతో చెప్పేకథ కాబట్టి దీనికి రుంజకథ అని పేరు. దీనికి గానంతో బాటు వాద్యం ప్రధానం.

**రుంజ పూర్వగాథ** – త్రేతాయుగం మూడవ పాదంలో రహుంజుడనే రాక్షసుడుండేవాడట.అతన్ని సంహరించడం ఎవరివల్లా కాకపోతే విశ్వకర్మ సంహరించాడట. ఆ రహుంజ రాక్షసుడు చనిపోతూ తన కళేబరానికి శాశ్వతత్వం ప్రసాదించమని కోరి విశ్వకర్మచేత అవుననిపించుకొని ప్రాణాలు విడిచాడట.ఇది ఇలా ఉండగా దక్షుడు పార్వతీ కళ్యాణాన్ని అతి వైభవంగా జరుపతలపెట్టగా పార్వతి తన కళ్యాణానికి నూతన వాద్యం కావాలని కోరిందట.ఆ వివాహానికి వచ్చిన విశ్వకర్మకు రహుంజుని కోరిక, తన వాగ్దానం గుర్తుకొచ్చి వెంటనే అతని కళేబరాన్ని రహుంజ వాద్యంగా మలచి పార్వతీ కళ్యాణానికి నూతన వాద్యంగా వాయించారట.పార్వతీ కళ్యాణానికి ఇంతకు ముందు ఎన్నడూ లేని ఈ నూతన వాద్య పరికరం పార్వతీ కళ్యా ణంలో దేవదానవ గంధర్వులను సహితం సమ్మోహితులను జేసిందట. నాటినుండి ఈ రహుంజ శైవుల కళ్యాణ మహోత్సవాలలో అంటే ప్రత్యేకించి విశ్వబ్రాహ్మణుల వివాహాది ఉత్సవాలకు వాయించడం ఆనవాయితీగా మారింది. స్కాంధ పురాణంలో ఈ గాథ వివరించబడింది.

**రహుంజ నిర్మాణం** – రహుంజాసురుని కళేబరాన్నుండి చర్మాన్ని వాద్య పరికరానికి చర్మంగానూ ప్రేవులను బొందు త్రాళ్ళుగానూ ప్రక్కటెముకలను వీరణం పుల్లలుగానూ ( పంకరగా ఉంటాయి) నరములను బిగింపు త్రాళ్ళుగానూ ( ఇవి 72 ) చిన్న నరాలను అడుగున ఉండే చిక్కంగానూ 16 పళ్ళను నాగవాసములుగానూ బాహువులను చక్రములుగానూ ( రెండు వైపులా చర్మంగా మొదటి దశలో ఉండేది ) చేసి విశ్వకర్మ పార్వతీ కళ్యాణానికి సృష్టించి ఇచ్చాడు.ఈ రుంజ వాద్యంపై 32 శబ్దాలతో సప్త తాళాలు మూడు కాలాలు పలికిస్తారు.

ఈ వాద్యంతో కథాగానం – తొలుత విశ్వబ్రాహ్మణుల వివాహాలకు వారింట పండుగలకు మాత్రమే పరిమిత మైన ఈ వాద్య ఘోష ప్రస్తుతం ఇతరులు సహితం సంబరాలలోనూ జాతరల్లోనూ ఉపయోగిస్తూ దక్షయజ్ఞం, పార్వతీ కళ్యాణం, బ్రహ్మంగారి చరిత్ర, బాకాసురవధ, రుక్మిణీ కళ్యాణం మొదలైన కథలను ( ముఖ్యంగా కళ్యాణ ప్రధానమైన కథలను ) గానం చేస్తున్నారు.ఇది ఏకవ్యక్తి ప్రదర్శన ( ) ఒకే వ్యక్తి వాద్యాన్ని వాయిస్తూ గానం చేస్తాడు.సుమారు రెండు గంటల పాటు ఈ కథాగానం ఆహూతులను అబ్బురపరుస్తూ ఆనందాబ్ధిలో ఓలలాడిస్తుందంటేఅతిశయోక్తి కాదు.ప్రస్తుతం ప్రముఖంగా ఉభయగోదావరి, విశాఖ జిల్లాల్లో దీనికి అత్యంత ఆదరణ ఉన్నదంటున్నారు ప్రముఖ రుంజ వాద్యకారుడు జీడికంటి సత్యనారాయణ.( బహుశ: ఇప్పుడు వీరు కీర్తి శేషులై ఉండవచ్చు ) ప్రాముఖ్యత – ప్రముఖంగా ఈ రుంజ వాద్యం విశ్వబ్రాహ్మణుల వివాహాలకే అని ముందుగానే చెప్పుకున్నాం. పెండ్లి తంతుకు ప్రారంభంనుండి దశల వారిగా పెండ్లితంతు ముగిసేవరకు అంటే స్వయంవర ప్రకటన నుండి పెండ్లి కుమారుల రాక, వీరణాలు, మంగళ సూత్రధారణ, తలంబ్రాలు, ఊరేగింపు, దండాడింపు, కొలువు, విందు, మంగళ హారతులు మొదలైన కళ్యాణ ఘట్టములన్

## ఆదర్శంగా బతకాలి!

జీవిత ప్రయాణం ఆగిపోయింది
మృత్యువు
వెంట తీసుకెళ్లడానికే నిర్ణయించుకుంది.

ఇలానే పోతాం మనం కూడా
మనకే తెలియకుండా రేపటిని వదిలేసి
ఎవరూ మనవెంట రారు
ఏది రాదు
ఒక్కళ్ళమే వెళ్ళాలి
నువ్వేదో ఇక్కడే ఉండి పోయేందుకు
వచ్చినట్టు
స్వార్థంగ బతుకుతున్నావ్!
తెలుసుకో
నీకంటూ ఒక మృత్యువు ఉందని
నీకే తెలియకుండా అది సమీపిస్తుందని
ఆధ్యాత్మిక చైతన్యుడువై మేలుకో
నిన్ను నీవు ఏలుకో
నలుగురిలో గొప్పోడిలా బతుకు
ఇదే జీవితం అంటే
ఇలాగే గొప్పగా బతకాలి
ఆదర్శంగా విలువలతో....!!

-కళ్లెం నవీన్ రెడ్డి
9963691692

## ఇంకా ధరించవేం?

నిమిషానికొకరు
కరోనా కోరల్లో చిక్కుకుంటున్నా
ప్రాణాలన్నీ
పండుటాకుల్లా రాలిపోతున్నా
నిన్నూ నీ దేశాన్ని కాపాడే
మాస్కేదో ధరించవేం?

నువ్వేదో మానవాతీతుడివైనట్టు
నీకేదో దైవికశక్తులున్నట్టు
కరోనా కాటేయకుండా
వరాలనేవో సంపాదించినట్టు
అహంకారపు కిరీటం ధరించి
అనునిత్యం విర్రవీగుతూ
నీ చుట్టుపక్కల కుటుంబాలన్నీ
అయినవాళ్ళ మరణాలతో
కన్నీటి సంద్రంలో మునకేస్తున్నా
మాస్క్ ధరించే కనీస బాధ్యతను
నీ మస్తిష్కపు పొరల్లోంచి
బయటకు లాగవేం?

బహిరంగ సభల్లోనే
నీ భవితవ్యముందని
గుంపులోయేదో
గూడుపుఠాణి ఉందని
కరచాలనంలోనే యేదో
కమనీయ స్పర్శవుందని
నీకు నువ్వే ఊహించుకొని
కోవిడ్ నిబంధనలన్నీ
నిర్లక్ష్యపు కొక్కానికి వేలాడదీసి
కోవిడ్ శవయాత్రలకు
కొత్త ప్రేరణాగీతం
పాడాలనుకుంటావేం?

ఆసుపత్రులన్నీ
కోవిడ్ యాత్రాస్థలాలవుతున్నా
ఆక్సీజన్ సిలిండర్లప్పుడు
గాలాలకు చిక్కని చేపపిల్లలవుతున్నా
వైద్యమిప్పుడు
సామాన్యుని చేతికందని
గగన కుసుమమౌతున్నా
కోవిడ్ మహమ్మారి బంధిపోటై
నీ దేశ ఆరోగ్యసంపదను కొల్లగొడుతున్నా
ఇప్పుడైనా కాస్త కళ్లు తెరచి
నిన్నూ నీ దేశాన్ని కాపాడే
మాస్కేదో ఇంకా ధరించవేం ?

-ఎన్.నరేశ్ చారి
9701334516

## మీన మేషాలు లెక్కిస్తూ

ప్రాణ వాయువు కొరతతో
చీకట్లు నిండిన హృదయం
ఆరుతున్న దీపాలు
చిన్నగా దూరంగా
కమురుతున్న వాసన.

కరోనా సునామిలో
ప్రపంచమే ఒక మొహంజదారో
దహనానికి కూడా క్యూ
అరణ్య రోదనలతో సామాన్యుడు
భారత్ అభివృద్ధి చెందుతోంది.

ఇప్పుడు
అర్జంటుగా ఆక్సిజన్ కావాలి
చెట్ల సమాధులపైన లేచిన
భవనాల్లోని కళేబరాలకోసం.

అర్జెంటుగా
ఒక మొక్కను నాటాలి
అది ఈ క్షణమే ఆక్సిజన్ ఇవ్వాలి!
రూపాయల దిమ్మెలపై
మొలిచిన ఆసుపత్రుల్లో
ప్రాణం విలువ వేలంపాట!
నోట్ల కట్టలనిండా చెమట వాసన
ఐనా
విఐపిల లెక్క తేలాకె
గరీబోళ్ళ లిస్టు షురూ!

మండుతున్న చితి మీద
పేలాలు ఏంపుతున్న
ఖద్దరు బట్టలు
ప్రాణ రక్షణ ఆశ్చర్యార్థకం!
ఉద్విగ్న క్షణాల్లో
ఎగుడు దిగుడు జీవితాల
జ్ఞాపకాల దారాలన్నీ
కండెకు చుట్టి వేయబడ్డాయి

బేల చూపులు వాడిన ముఖాలు
అడుగడుగునా కెమెరా కళ్ళలో
రేటింగ్ పేరుతో
శవాల పోస్టు మార్టం
మీనమేషాలు లెక్కిస్తూ
అధికారం జోగుతోంది మత్తుగా
జవాబుదారీ 'వాతావ'రణం'
కావాలిప్పుడు

-సముద్రాల కుమారస్వామి
9705476138

## మనసు మూగబోయింది

తల్లిదండ్రులను పోగొట్టుకున్న పిల్లలు
పిల్లల్ని చేజార్చుకున్న తల్లిదండ్రులు
తన వారిని పోగొట్టుకుని ఆత్మ బంధువులు
కుమిలి కుమిలి ఏడుస్తుంటే
మనసు మూగబోయింది!.

ఎందరికో ఆయువు పోస్తూ తమ ఆయువు
పోగొట్టుకుని తన భార్యా బిడ్డలను
అనాథలను చేస్తున్న వైద్యోనారాయణుల
హృదయ వైశాల్యం చూసి
మనసు మూగబోయింది!

సమాజ హితమే పరమావధిగా
మానవత్వ పరిమళమే ఆలంబనగా
మానవ సేవే మాధవ సేవగ గుబాళించిన
ఆరోగ్య సేవకులను చూసి
మనసు మూగబోయింది!

మిన్నంటిన ఆర్తనాదాలతో
కన్నీటి కాలువల ప్రవాహంతో
స్మశానాల దిబ్బలతో
మరుభూమిని తలపిస్తున్న
భారతావనిని చూసి
మనసు మూగబోయింది!

బూడిదయి పోతున్న మానవ విలువలు
మసకబారిన మనసు తెరలు
మూగబోయిన అనుబంధాలు
దూరం పెంచిన అభిమానాలు చూసి
మనసు మూగబోయింది!.

క్షణక్షణం భయం గుప్పిట్లో
ప్రతిక్షణం కలవరం కౌగిట్లో
మరుక్షణం అపాయం ముంగిట్లో
కొట్టుమిట్టాడుతున్న ప్రాణం చూసి
మనసు మూగబోయింది!

-గుడ్ల అమ్మాజీ
7386408306

## ఆసుపత్రులా .. కాసుపత్రులా?

కోవిడ్ కష్ట కాలంలో
ఆస్తులు కరుగుతున్నాయి
అప్పులు పెరుగుతున్నాయి
కానీ ..
ఆరోగ్యం కుదుటపడుతుందనే
గ్యారెంటీ మాత్రం లేదు ..?
కోవిడ్ రోగం సాకుతో ...
ప్రైవేట్ ఆ(కా)సుపత్రులంతా
కాసులతో కళకళ లాడుతుంటే
కాయకష్టం చేసి కూడబెట్టినదంతా
ఆసుపత్రులకే దారాదత్తం చేసిన
కరోనా రోగుల ప్రాణాలుమాత్రం ...
మలమలా మాడిపోతున్నాయి ..!
ప్రాణాలనరచేతిలో పెట్టుకుని
కొన ఊపిరితో వెళ్ళిన వారికి
లక్షల్లో ముందస్తు చెల్లింపయితేనే
వైద్యం చెల్లుబాటవుతుందంటూ ..
ఊపిరి పోయాల్సిన వారే
ఉసూరు మనిపిస్తూ ..
అమానవీయంగా ప్రవర్తిస్తున్న
తీరును ... ఎలా చూడాలి ?
ఆపత్కాలంలో ఆదుకోవాల్సిన వారే
కరోనా రోగుల (సొమ్మును) రక్తాన్ని
జలగలా పట్టి పీలుస్తుంటే
కొరడా ఝుళిపిస్తామని చేసిన ..
ప్రజా ప్రతినిధుల ప్రకటనలు
కాగితాలకే పరిమిత మయితే
ఇక ముస్ముందు మనకు కనిపించేవి
కోవిడ్ మరణాలొక్కటే కాదు ..
పేదల ఆకలి మరణాలు కూడా !!

(కోవిడ్ కారణంగా ఆస్పత్రిలో చేరిన వారి నుంచి లక్షల బిల్లులతో నిలువు దోపిడి చేస్తున్న తీరుకు నా స్పందన .. )

-రవి చంచల
8500330700

## శేష గీతం...

ఒత్తిడి, ఆందోళనలు
మనసును చిత్తడి చేస్తుంటే
పుత్తడిలాంటి జీవితాన
భయం చుట్టడి దూకుతుంటే
కన్నుకలలన్ని కాలంతోపాటే
మెల్లిగా కరిగిపోతుంటే
ఏమి చేయలేని నిస్సహాయస్థితిలో
తనువున రక్తం మరిగిపోతుంది.

ఏ క్షణాన ఏ దుర్వార్త
వినాల్సివస్తుందో
ఏ ఉదయం ఈ జీవితానికి
చరమాంకం పాడుతుందో,
ఏ రాత్రి కాళరాత్రియై తన
కబంధ హస్తాల్లో బంధిస్తుందోనని
క్షణమొక యుగంలా
ఈ విపత్తు సమయమొక
భయానక లోకంలా మారి
కంపింపజేస్తుంది.

అశేష జనవాహిని నిశ్శేషంగా
కాలం చేతిలో భాగింపబడుతుంటే
దినదినగండంతో ప్రాణాపాయ
భయంతో ఆత్మవిశ్వాసం తీసివేతలా
ప్రతిరోజు తరిగిపోతుంది..
నిరాశనిస్పృహలు కూడికలా
ప్రతిరోజు పెరిగిపోతుంటే
భయాందోళనలు గుణకారంలా
హెచ్చించబడుతున్నాయి
మానవత్వం ఒక అవశేషమై
మిగిలిపోతుంది.

జరిగిన దారుణకాండల్నిగాంచి
నిస్సహాయస్థితిలో ఉన్న కళ్ళల్లో
ఆశయ వత్తుల్ని వెలిగించి,
ఎద లోతుల్లో మిగిలిపోయిన
ఆత్మవిశ్వాసాన్ని పైకితెచ్చి,
ఎండిపోయిన ఆశలపై
ఆత్మస్థైర్య నీళ్లను చల్లి
ఈ లోకం శేషగీతం ఆలపిస్తుంది.

-సత్యరాజ్ అన్వర్
9440981198

## ఓ మనవా...ఇంకా మారవా...!

నీకుఁ నచ్చేలా ఉంటూ
నీ మనసు మెచ్చింది చేస్తూ
ఇంత నిర్లక్ష్యంగా మెలుగుతూ
ఎన్నాళ్లు జీవనం సాగిస్తావ్...
ప్రకృతిని అస్టచ్ఛేబుల్ చేసి
వికృత పోకడలు పోతూ
కృత్రిమ అలవాట్లతో
విషతుల్యం చేసావ్....
ఇంకా నీ యాదిలో
పొద్దుపొడుపును చూడక
ఎన్నోద్దులు అయ్యిందో
ఎండ పొద్దు తాకని పెయ్యిని
ఎన్ని రోగాలు గావు పట్టిస్తయో....
కూర్చున్న చెట్టు కొమ్మనే
నరికేసుకునే తెలివి తెచ్చుకున్నావ్....
అంటీ ముట్టనట్టు మెలుగుతూ
ప్రకృతిని చెల్లని రూపాయి చేసి
టచ్ మీ నాట్ గాఁ దూరం దూరం
ఉంచుతూ ఇపుడు అనుభవిస్తున్నావ్....
సహజ వనరుల్ని అసహజం చేస్తూ
ముట్టుకుంటేనే కాదు
ఊపిరి తీసుకోవాలన్నా
విలవిల్లాడాల్సిన
రోజుల్ని కొని తెచ్చుకున్నావ్...
అందుకే ఇకనైనా ప్రకృతిని
గుండెకు హత్తుకోవాలి
సహజ జీవనంతో
సావాసం చెయ్యాలి
అపుడే ఏ క్రీములు
జీవజాతుల కీడును కాంక్షించవు
మారాలి ఇకనైనా మానవా
ఇంత అనుభవిస్తూ ఇంకా
నీ కృత్రిమ అసహజ
అలవాట్లు మానవా..!

-మంచికట్ల లక్ష్మణ్
9494800112

## కరోనా కాదది కాలసర్పం...

చెత్తకుండీలోఎంగిలి మెతుకులు
ఏరుకునే "బిక్షగాన్నీ" కిటికీలో నుండి
"చూసిన ఓ ధనవంతుడు"
"థ్యాంక్స్ టు గాడ్...
నేను బిక్షగాన్ని కాదు" అనుకున్నాడట.

మతిస్థిమితం కోల్పోయి
నగ్నంగా నడివీధిలో తిరిగే
"పిచ్చివాన్ని చూసిన ఓ బిక్షగాడు"
"థ్యాంక్స్ టు గాడ్...
నేను పిచ్చివాన్ని కాదు"అనుకున్నాడట

కరోనా వైరస్ సోకి అంబులెన్స్ లో
హాస్పటల్ కెళ్ళే రోగిని చూసిన,
కాస్త "ఇంగ్లీషొచ్చిన ఓ పిచ్చోడు"
"థ్యాంక్స్ టు గాడ్..
అయామ్ నాట్ ఎ కరోనా పేషెంట్"
అనుకున్నాడట

హాస్పిటల్లో పడకల్లేక ఉన్నా
ఆక్సిజన్ అందక ఊపిరాడక
మరణించి మార్చురీకి వెళ్ళే
"కరోనా శవాన్ని" చూసిన మరో రోగి
"థ్యాంక్స్ టు గాడ్..
నేనింకా బ్రతికే ఉన్నాను" అనుకున్నాడట.

నిజానికి ఒక్క చనిపోయినవారే
భగవంతునికి థ్యాంక్స్ చెప్పలేరు.

మరి అన్ని అవయవాలనిచ్చిన
మంచి ఆరోగ్యాన్నిచ్చిన
తరతరాలకు తరగని ఆస్తినిచ్చిన
ఏ రోగాలురాని,ఏ కష్టాలులేని
ఏ కరోనా వైరస్ సోకని
ప్రశాంతమైన జీవితాన్ని ప్రసాదించిన
ఆ భగవంతునికి, బాగానేవున్న
బ్రతికేవున్న, ఉన్నతస్థితిలో వున్న
మీరెందుకు కృతజ్ఞతలు
చెప్పలేకపోతున్నారు
ఒక్కసారి ఆలోచించండి
లెటజ్ సే థ్యాంక్స్ టు గాడ్...ఎందుకు ?
కరోనా
కాలసర్పం కాటెయ్యనందుకు..

-పోలయ్య కవి కూకట్లపల్లి
9110784502

## కవి, రచయిత, బహుముఖ ప్రజ్ఞాశాలి
# "గోశిక నరహరి" ఇక లేరు

నివాళి

సుప్రసిద్ధ యక్షగాన కవి,రచయిత, వాస్తు సంఖ్యాశాస్త్ర నిపుణులు, నటులు, నాటకకర్త,ప్రయోక్త,వ్యాఖ్యాత,బహుముఖ ప్రజ్ఞాశాలి శ్రీ గోశిక నరహరి గారు. వీరు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా, బీర్కూర్ మండలం, దురికి గ్రామంలో శ్రీ గోశిక భూమయ్య (యక్షగాన కవి),శ్రీమతి రాధా రుక్మిణీ భాయి దంపతులకు కలిగిన ఏడుగురు సంతానంలో మూడవ సంతానమే శ్రీ నరహరి గారు. తేదీ:21-06-1959 వికారినామ సంవత్సరం జేష్ఠ మాసం పాడ్యమి నాడు వీరు జన్మించారు.

**బాల్యం - విద్యాభ్యాసం - వివాహం:**

చిన్నప్పటి నుండీ అనేక కష్టాలు అనుభవించిన నరహరి గారు పసిప్రాయం లోనే తల్లిప్రేమకు దూరమయ్యారు. అందువలన తల్లిలేని లోటు దరికి రాకుండా కొడుకును ప్రేమతో పెంచి పెద్ద చేసాడు తండ్రి భూమయ్య. పల్లె అందాలను చూస్తూ,ప్రకృతి ఒడిలో పరవశిస్తూ పెరిగిన ఆ బాల్యం ప్రాథమిక స్థాయి నుండి, ఉన్నత విద్యను అభ్యసించే వరకు దురికి,బాన్సువాడ లోనే కొనసాగింది. బోధన్ వాస్తవ్యులైన శ్రీ కూచన్ విఠల్ గారి కుమార్తె యైన శ్రీ మతి లక్ష్మి గారితో 18 - 04 - 1980 న వివాహం జరిగింది.

**"కవి"గా మారడానికి తండ్రే ఆదర్శం:**

తెలంగాణలో ప్రసిద్ధులైన యక్షగాన కవులలో ఒకరుగా పేరు గడించిన తండ్రి భూమయ్య గారు 5 యక్షగానాలు,అనేక భజన, తత్వకీర్తనలను రచించి నాడే ముద్రితంచేసారు. తండ్రి రచించిన యక్షగానాలను కొన్నిసార్లు వ్యంగంగా మాట్రాడడం వలన "ఎడ్డివో గుడ్డివో నేను కన్నవి సంసారం జేస్తున్నయి.అట్లనే నువ్వు కూడా ఒక గ్రంథమును రాయురా" అన్న తన తండ్రి మాటలను సవాలుగా తీసుకుని తన 19వ ఏట "సానంద విజయము" అనే చిరుతల నాటకమును రచించి తండ్రికి చూయించగా, తానందులో కొన్ని మెళకువలు, సూచనలు ఇవ్వగా అటుతరువాత భాషపైన అమితమైన పట్టు సంపాదించుకొని, అత్యంత ప్రౌఢమైన శైలిలో, జిగి,పటిమ,విషయ నిపుణతతో "పురందరవిజయం" అనే యక్షగానమును రచించి నక్కరామన్న,పుల్కంటి రామ కృష్ణయ్య వంటి సాహిత్య ద్రష్టలను ముక్కున వేలేసుకునే విధంగా "ఔరా" అనిపించి వారి మెప్పును అలనాడే చూరగొన్నాడీకవి.

వీరి వంశమునందలి పూర్వీకులు అందరూ దేశీసాహిత్య పరిమళాలను వెదజల్లుతు,తెలుగు కళామతల్లికి సేవచేస్తూ,సారస్వత వ్యాప్తికై కంకణ బద్ధులైన వారే. కావున పెదనాన్న శ్రీ గోశిక నరసింహార్యులు (మంచి హరికథకులు) గారి నిరంతర ప్రోత్సాహం వలన చిన్నప్పుడే రామాయణం, భారతం, భాగవతం, బాలవ్యాకరణం, అమరకోశం, నీతిశాస్త్రం, వంటి సద్గ్రంథాలెన్నో చదివి, వాటన్నింటినీ ఆకలింపు చేసుకోవడమేకాక పెదనాన్న ద్వారా తన ప్రదర్శనలకు ఆకర్షితులై అందులోని మళకువలను ఒడిసిపట్టి హరికథకునిగా కూడా అనేక చోట్ల ప్రదర్శనలు ఇచ్చారు.

అందుకు తన పెదనాన్నను ఒక పద్యంలో ఇలా కీర్తిస్తారు.

**కందం:-**

ఎన్నగ పండితుడౌ పెద
నాన్నరొ నా బాల్యమందు నరహరి కథలన్
ఎన్నో దెలిపిన దెలివిని
గొన్నాడను నారసింహ!గోశిక బ్రహ్మా!!

**రచనలు:**

**శతకాలు:** సోమలింగ శతకము, శిరిడీ సాయి శతకము, నవయుగ పద్మశాలి శతకము, శ్రీ వేంకటేశ్వర శతకము, పురందరవిజయం (యక్షగాన ప్రబంధం) (ఇవన్నీ ముద్రితరచనలు)

**యక్షగానాలు - నాటకాలు:**

వీరమణ్య చరిత్రము,బసవ చరిత్రము, లక్షణా పరిణయం,జయంత జయపాలము, మదాలస పరిణయము,భట్టి విక్రమార్క, ఉషాకళ్యాణము, సానందవిజయము, గంగాదేవి కళ్యాణము, శ్రీ కృష్ణార్జున యుద్ధం, గజగౌరీ వ్రతము, సోమేశ్వర విజయం - రూపకం.(ఇవన్నీ అముద్రితాలు)

**జానపద హరికథలు:**

భక్త మార్కండేయ, శ్రీ దత్త జననం, శ్రీ కృష్ణ జననం,శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ చరిత్ర, శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర, రుక్మిణీ కళ్యాణం, నాందేవ్ కళ్యాణం, భక్త పురూరవ,కౌంసల్యా పరిణయం, బసవ చరిత్ర, కుమారస్వామి కళ్యాణం, భూ కైలాసం, చంపక సుమతీ స్వయంవరం, అజ్ఞానదాసు చరిత్ర, భక్త చిరుతొండ, చంప కవల్లి చరిత్ర, భీమార్జున గర్వాపహరణం, అంబరీష,నరహరి కీర్తనలు,గోదావరి. (దీర్ఘ కవిత)

21-06-1959 13-05-2021

**నాటక కర్తగా - వాస్తు, సంఖ్యాశాస్త్ర నిపుణుడిగా:**

తండ్రి భూమయ్య గారి ఆధ్వర్యంలో ప్రదర్శించే అనేక నాటకములందు తానెన్నో పాత్రలను వేసి మెప్పించారు.ముఖ్యంగా: సానందుడు, సుయోధనుడు, అర్జునుడు, నారదుడు, శ్రీ మహావిష్ణువు, ఆనంద భైరవయోగి,రావణబ్రహ్మ వంటి పాత్రలను పోషించి, ఆ పాత్రలకే జీవకళ ను ఆపాదించారు.

శ్రీ మాన్ తార్కిక అణ్ణణాచార్యుల వద్ద వాస్తువిద్యను, తండ్రి ద్వారా సంఖ్యాశాస్త్ర విద్యను,స్వర్గీయ దా??చాట్ల నరసయ్య గారి వద్ద వ్యాకరణ ఛందోనియమాలను, బ్రహ్మశ్రీ భీంశాస్త్రి మహరాజ్ గారి వద్ద రామతారక మంత్రోపదేశ కటాక్షము స్వీకరించారు. వాస్తువిద్యలో సుమారు 40 సం??ల సుదీర్ఘ అనుభవమును సంపాదించి ఎన్నో నూతన గృహ, ఆలయాలకు వాస్తునందించారు.

**యక్షగాన రచనలో తనదైన ముద్ర:**

**చం॥నరహరి నామధేయుడను నాదగుతల్లియు రాధరుక్మిణీ - వరుడగు భూమయాఖ్యకవి వారలకేను సుతుండనైతి నీ - ధరణిని దుర్మిపౌరి నిజదామము నాదగు సేమమొంద నీ - శరనిధిలోన గోశిక సుధార్ణవ వంశము నందుబుట్టితిన్!!**

అంటూ బాల్యంలోనే సాహిత్యంపట్ల మక్కువ పెంచుకుని తన పుట్టుక వివరాలను పద్యరూపంలో తెలుపుతూ అనేక యక్షగానాలను రచించిన నరహరి గారు కనుమరుగై పోతున్న యక్షగాన ప్రక్రియను నడుంబిగించి, అనేక నవీన పద్ధతులను సృష్టించి,వినూత్నమైన బాణీలు, దర్వులు, తాళాలు, కల్పనచేసి యక్షగాన ఒరవడికి కొత్తసొబగులద్దారు.కొన్ని యక్షగానాలలో చూపించిన నరహరి గారి పాండిత్యమును పరీక్షిస్తే "రావురూకుల విరలాఖ్యుని" వంటి యక్షగాన కవుల ప్రభావం లేకపోలేదనే చెప్పాలి.

**సాహితీ - కళారంగానికి సేవలు:**

స్వగ్రామమైన దురికిలో తండ్రి భూమయ్య గారిచే నెలకొల్పబడిన "శ్రీ కృష్ణ నాట్యమండలి" ని తన తరంవరకు నడిపిస్తూ, ఎందరో కళాకారుల ఆదరాభిమానాలు చూరగొన్నారు. ఆ కళాకారుల కోరికమేరకు వారడిగిన యక్షగానాలను రచించి ఇచ్చి, దురికిలోనే కాకుండా చుట్టుప్రక్కల గ్రామాల్లో కూడా ప్రదర్శనలను ఇస్తూ పలువురి ప్రశంసలు పొందారు. కొందరు భజన భక్తాదుల కోరికమేరకు "నరహరి కీర్తనలు" అనే ఆధ్యాత్మిక,భక్తి,తత్వకీర్తనలను కూడా రచించగా ఇవి ఇంతవరకు ముద్రింపబడలేదు.ఇలా అనేకానేక మంగళహారతులు, కీర్తనలను రచించి సాహిత్య సృజనను తుదిశ్వాస వరకు అలుపెరుగకుండా కొనసాగించిన కవితాఝరి నరహరి!.

ఇకపోతే సాహిత్య పోషణ విషయానికి వస్తే బాన్సువాడ ప్రాంతపు సాహితీ మరియు యువకవులను వెలుగులోకి తేవాలనే తలంపుతో 14 - 08 - 2011 న దురికి శ్రీ సోమలింగేశ్వర స్వామి ఆలయంలో యువకవి, రచయిత "శ్రీ సుప్పని సత్యనారాయణ" ను అధ్యక్షునిగా నియమిస్తూ "భీమన్న సాహితీ పీఠము" ను నెలకొల్పారు. తండ్రి పేరిట "గోశిక భూమన్న సాహిత్య కళాపరిషత్'', తల్లి పేరిట "రాధారుక్మిణీ కళాక్షేత్రం", ఎల్లారెడ్డి లో రచయిత శ్రీ అయ్యవారు మురళిని అధ్యక్షునిగా నియమిస్తూ "తెన్నరంగం తెలుగు సాహిత్య కళాపీఠము'' లను స్థాపించి, బాన్సువాడ ప్రాంతపు కవితావికాసమును కాంక్షిస్తూ, నవకవులకు చేయూతనిస్తూ, ఎన్నో సాహిత్య కార్యక్ర మాల ను చేపట్టారు. స్వగ్రామ మైన దురికిలో గల వృద్ధ కళాకారులకు తల్లి తండ్రుల జ్ఞాపకార్థం ప్రతీ సం??రం తగిన సహాయమునందించి, పాఠశాలలో పిల్లలకు ఉచితంగా పార్యపుస్తకాలు, పెన్నులు పంపిణీ చేసేవారు.

తన గ్రామంవట్ల తనకున్న మమకారమెటు వంటిదో ఈ పద్యం చదివితే మనకు అవగతమౌతుంది.

**సీసం:-**

**నవనాథ సిద్ధులు నడచితిర్గిననేల**
**దూర్వాసనగర మీ దురికి పురము!**
**అల్లమాప్రభుచెంత నవతరించిన గంగ**
**దక్షిణ దిశపారు ధన్య దురికి!**
**పొందుగా సాహిత్య ప్రౌఢకవనముల**
**సురుచిరంబైనట్టి పురము దురికి!**
**భాగవత నటన భజన భక్తులమ్రోల**
**దుక్కిదున్నెటి భూమి దురికి పురము!**
**తే॥గీ:-**
**కొదువలేనిది జనముల కోటి శుభము**
**ధర్మమర్థము కామము దగనుమోక్ష**
**మనెటి పురుషార్థ సాధకుల్ మాన్యులున్న**
**నరహర! దుర్కి నీపురం నవసదనము!!**

అని కొనియాడుతూ..తనకత్యంత ప్రీతికరమైన యక్షగాన, కవిత్వ పద్ధతులను కీర్తిస్తూ చెప్పిన పద్యాలు చదివితీరవలసిందే.

**కందం:-**

**రచయిత కవితా రాజ్యము**
**వచనమ్ముల నేలుచుండు వాగ్ఝరితోడన్**
**సుచరిత ప్రచురిత గ్రంథము**
**లిచటన్ వెల్వడగ స్వర్గమిల్లేనాకున్!!**

**కందం:-**

**గానమునిది గాంధర్వుల**
**గానంబన నిజము యక్షగానంబనగా**
**గానము విద్యాదరులకు**
**ప్రాణంబిది యక్షులకును ప్రాభవమాదిన్!!**

**పురస్కారాలు - సన్మానాలు:**

-విశ్వసాహితీ సంస్థ వారిచే - " సాహిత్యరత్న" అవార్డు.

-భావన సాహిత్య సంస్థ వారిచే - "భాషోద్ధారక" అవార్డు.

-ప్రతిభా పురస్కారం

-2015 లో బీర్కూర్ మండల "ఉత్తమ సాహితీవేత్త" అవార్డు.

-వీరి నవయుగ పద్మశాలి శతకానికి విశ్వసాహితీ వారిచే "ఉత్తమ గ్రంథం" గా ఎంపిక చేయబడింది.

-అక్కినేని నాగేశ్వరరావు గారి "ప్రతిభా పురస్కారం'' వంటివేకాక లెక్కకుమిక్కిలి సన్మానాలు, సత్కారాలు పొందారు.

నిత్యం కావ్యరచనతో నిమగ్నమయ్యే నరహరి గారి స్వగృహం ఎప్పుడూ సాహితీవేత్తలతో, యక్షగాన, నాటక, భజన, ఆధ్యాత్మిక వేత్తల చర్చోపచర్చలతో సందడిగా ఉండేది. ఆ సందర్భంలో వారిద్వారా ఎన్నో అమూల్యమైన విషయాలు చర్చింపబడేవి.నరహరి గారి అద్భుతమైన ప్రసంగధార అందరినీ ఆశ్చర్యపరిచేది.

వారి కుటుంబ నేపథ్యానికి వస్తే భార్య,ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె.

ఊపిరి ఉన్నంతకాలం కవితా రచన సేద్యానికే తన జీవితాన్ని, సమయాన్ని వేచ్చించిన నరహరి గారు ధన్యులు.కేవలం ఒక జిల్లాకు, మండలానికి పరితమయ్యే రచయిత కారు.వారి మహాప్రస్థానం (13- 05- 2021) యావత్ తెలంగాణ కంతటికీ ముఖ్యంగా యక్షగాన సాహిత్య లోకానికి తీరనిలోటేనే చెప్పవలసి వచ్చినా, " సుకవి జీవించు ప్రజల నాలుకలయందు" అన్న ఆర్యోక్తి అక్షర సత్యం! భౌతికంగా వారు మనసుండి దూరమైనా వారు సాహిత్య చరిత్రలో ''చిరంజీవి'' యై వెలుగొందుతారనే మాట చెప్పక తప్పదు.

ఒకానొక సందర్భంలో నరహరి గారు కవిత్వమునుద్దేశించి చెప్పిన ఈ పద్యం వింటే ఆశ్చర్య పోవలసిందే!

**కందం:**

**భువనము వెలుగులు రవిశశి**
**భవనము వెలిగించు భార్య భాగ్యంబనగా**
**హవనము వెలుగే నగ్నియు**
**కవనము వెలుగెత్తు జనుల కంఠములోనన్!!**

అపారమైన నరహరి గారి అముద్రిత కావ్యాలను వెలుగులోకి తీసుకువచ్చి , క్షేత్రస్థాయిలో వాటిపై మంచి పరిశోధనలు జరిపి, భావితరాలకు గోశిక వారి కవితాపటుత్వాన్ని ఎరుకపరిచేవిధంగా భాషా సాంస్కృతిక శాఖ, సాహిత్య అకాడమీలు చొరవతీసుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

అప్పుడే ఆ "మహాకవి" ఆత్మకు శాంతి చేకూరుతుందని ఆశిస్తూ...వారి మృతికి నా ప్రగాఢ సానుభూతిని ప్రకటిస్తు,ఆ మహనీయుని దివ్య చరణారవిందాలకు ఈ విధంగా "స్మృత్యంజలి" ఘటిస్తూ, ఈ నాలుగు అక్షర కుసుమాలను సమర్పించుకుంటు...

-సుప్పని సత్యనారాయణ,
9492626910








## గెలుపు సంతకం

కాలంపై స్వారీ చేయడం
మనకు అలవాటైన పనే కదా
కఠినమైన చిన్న సమయానికే
కరిగి కన్నీరై తల్లడిల్లితే ఎలా?
మహోగ్రమని విర్రవీగే సముద్రాన్నే
వంతెన వేసి ఓడించిన వాళ్ళం కదా
కాళ్ళు కూడా తడపలేని కాలువను చూసి
కళ్ళు బరువై
గుండె చెరువై బెంబేలెత్తితే ఎలా?
కోటి కలలకు కళ్ళ గూటిలో
ఆశ్రయమిచ్చినవాళ్ళం కదా
కళ్ళలో చిన్న నలుసు పడిందని
కళ్ళను పీకేస్తే ఎలా?
మనం ఆశ్రయమిచ్చిన కలలను
మనమే అనాథలు చేసేస్తే ఎలా?
మన కళ్ళకు కన్నీరు
కార్చడమన్నది తెలియదు
మన కళ్ళకు కలలను
సాధించడమే తెలుసు
కమ్ముకున్న చిమ్మ చీకటిలో
వెన్నెలలా విరబూసినవాళ్ళం కదా
చిన్న మబ్బుపొరకే ఇలా చిన్నబోతే ఎలా?
ఆశల సంజీవనిని
అరచేతిలో మోసినవాళ్ళం కదా
దూడిపింజనే మోయలేమని
దిగులు పడితే ఎలా?
మన నమ్మకాన్ని
చంపేసే ఆయుధమేముంది
మన విజయాన్ని ఆపేసే ఆటంకం ఏముంది
ఊయలలోని పసిపాప మన భవిష్యత్తు
దాని నుదుటిపై తలరాతను
మన చేతితో రాసేద్దాం
కాలం దారి తెలియని గుర్రం
దాని వీపుమీదికెక్కి
మనం రాసినవైపు పోనిద్దాం
లోకమంతా నివ్వెరపోయే
విజయతీరం చేరుదాం
కాలమనే పేజీ చివర
మన గెలుపు సంతకం చేద్దాం

-డి.క్రాంతి కుమార్
7396721108

## కరోనా రుద్దిన అలవాట్లు

సామాజిక దూర ఆచారాలు
ముక్కు నోరు కప్పే మాస్కులు
రుద్దుకోవడానికే సానిటైజర్లు
సబ్బుతో చేతుల స్నానాలు
ఇవేగా కరోనా రుద్దిన నిబంధనలు,
తరగతి గది మాయమై..
ఆన్‌లైన్ పాఠాలు వచ్చే
సమావేశాలు అంతరించి..
జూమ్ వేదికలు మొలిచె !.
దుకాణాలు పలుచబడి..
ఈ-వాణిజ్యాలు వెలిసె
కార్పొరేట్ క్యూబికల్స్ పోయి..
వర్క్ ఫ్రమ్ హోమ్ వసతులొచ్చే !.
పేపర్ పరీక్షలు మాయమై..
ఆన్‌లైన్ ఎక్జామ్ తెరలొచ్చే
లాక్‌డౌన్ కర్ఫ్యూ రోజులొచ



## వలస కార్మికులు

తినడానికి తిండి లేక
ముల్లె మూట కట్టుకుని
బ్రతుకు జీవనానికి బాట పట్టిన
వలస కార్మికులనీ.
కరోనా మహమ్మారి కాటేసింది ఒకసారి
విదేశంలో పుట్టిన వైరస్ మహమ్మారి
బ్రతికితే బట్ట కట్టుకుంటామన్న దీమాతో
పట్నం నుండి పల్లె తల్లి ఒడిలోకి
బాట పట్టిననీ.
ఉండటానికి గూడు లేక పొట్ట చేతబట్టుకుని
సంకల పిల్ల నెత్తి మీద ముల్లె మూటతో.
రహదారుల వెంట
కవర్లు పాదాలకు కట్టుకుని
ఆకలి బాధలతో పయణమైతిమి
కడుపు పట్టుకొని.
ఆకాశాన్ని తాకే
అద్దాల భవనాలను నిర్మించినం
రెక్కలు ముక్కలయ్యేటట్టుగా
యంత్రాలను నడిపినం.
మా కన్నీటి గొసలను తీర్చే
పాలకులు ఎవరు?
మేము వలస కార్మికులనీ అని ఎవరన్నారు?,
కాంట్రాక్టర్ల ఖజానాను
రెట్టింపు చేసిన మనుషులం
పెద్దోళ్ల సాయమందని
సామాన్య మనుషులం.
ఇటుక ఇటుక వేసి
ఇంద్ర భవనాలను తయారు చేసినం
మట్టి ముద్దలు పిసికి
బంగారు పంటలు ఇచ్చినం,
ఎవరున్నారు
వలస కార్మికుల గోస తీర్చడానికి?
ఎవరున్నారు కార్మికుల గీత మార్చడానికి?

-కమ్మరి శ్రీనివాస్ చారి
9177324124

## ఉషోదయం

పచ్చదనం, పరిశుభ్రతతో
అనురాగాలను పూయించిన ప్రకృతి
మనిషి తీరని దాహానికి బలియై
మనిషుల పాలిట మృత్యువై
కరోనా రూపంలో ప్రాణాలను
తృణప్రాయంగా మింగేస్తుంది.
గుస గుస లాడే పైరు పంటలు
కిలకిలలాడే పక్షుల శబ్దాలు
చల్లని మలయమారుతాలు
పిల్లలు అల్లరి చేష్టలు
బంధువుల ఇష్టాగోష్ఠితో
కళకళలాడిన జగతిలో
కరోనా కాలనాగై
విషం చిమ్ముతున్నది.
సంధికాలం పోయి
ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని
చేతులు చేతులు కలుపుకొని
చెట్టాపట్టాలు వేసుకుని
అందరూ కలిసి కులాసాగా
కబుర్లు ఆడే రోజుల కోసం
ఆసక్తిగా ఎదురుచూస్తున్నది లోకం..
కాలం మిగిల్చిన చేదు అనుభవాలు
అనుమానపు భయాలు
అభద్రతా భావాలు
సంధి కాలపు అయోమయాలు
నశించి మరలా మునుపటి
రోజులు త్వరగా రావాలి
సెలయేరు సవ్వడిలా..
ఉషోదయపు కిరణాల్లా..

-పిల్లి.హజరత్తయ్య
9848606573

## తెగిన బొక్కెన

ఒంట్లో ఓసరలేకున్నా
బొండిగెల ప్రాణమున్న
బరిబద్దల బొక్కలుదేలిన బీదలు
భూమ్మీద నూకలున్నంతకాలం
పొద్దస్తమానం
సేతులు కాయలు కాసేలా
సేతుల గల్ల పనిజేసినంక
ఎదురైనపని ఎద్దోలెజేసి
బట్ట పొట్టకు దెచ్చి
పెండ్లాం పిల్లల సాదుడు
గిసోంటి గిరిగీసుకున్న బతుకుల్ల
కరోనా ఊపిరిని ఊర్సుక తిన ఉరిమి
నెత్తిమీద పిడుగువడ్డట్టు పడ్డది.
పిరికితో నీల్లువడ్పి
నెత్తురు కలి కలి అయి
పుట్టున పానాలవిసిపోతున్నాయి
పానభయాన్ని దీరతో
బిరాన పరం పరం పిండోలే నలిపి
సటసట సక్కని ముద్ద జేసి
మహమ్మారి రోగానికి నీల్లులేని తావుల్ల
పిడాత పిండం పెట్టాలే.
రోగం పురుగుపెయ్యిల సొచ్చిందంటే చాలు
అయే పాయే పానాలు చేసుడు
అగాదం జగన్నాదం అవుడు
పానమేదో యిప్పటికిప్పుడే పోయినట్టు
యిరుగు పొరుగు ఏమగొస ముచ్చట్లు
ఎడముఖం పెడముఖం
పుల్కాసు సూపుల ఇక్కట్లు
సలిపిడుగు మీదపడ్డట్టు సావ సావగొడితే
బలగమంత పుల్కు
పుల్కున ఏడ్సుడుతో
భయ్యం లేని బండమనిషయినా
పానభయంతో ఏగ లేక
బల్మిటికీ నోరుదెర్సి సచ్చే కాలమచ్చే.
ఎయ్యి ఏండ్లున్నా ఏరు తప్పది
నూరేండ్లున్నా సావు తప్పది
ఇచ్చిన దేవుడే
ఏనంగనో ఎత్తుకపోతే ఎవరడ్డం
నెత్తిమీదఎంటికలన్ని తాకులుతిన్నావ్
వన్కలేదు జన్నలేదు
యిప్పుడు గట్లనే
తెగిన బొక్కనోలే నిమ్మలంగుండు

-జినుకల వెంకటేష్
9652092120

## ధైర్యమేవ జయతే

నీ జీవితం
బుద్ధుత ప్రాయం
కాలం తెరచాటున
పాత్రదారులెందరో.
ప్రకృతి ప్రకోపం
కరోనా ఒకరూపమే
మానవ తప్పిదం
కల్లోల ప్రపంచం.
గాలిపటమై
ఆకాశం హద్దుగా..
దూరాన్ని చెరిపావు
దారాన్ని మరిచావు.
నిజాల్ని చూసావా
గంగానదిని చూడు.
కాలుష్యం పోయింది.
మనుషుల్లో కాదు.
ఏనాడో చేసిన పాపం
మూటలై
మోసుకోస్తుంది.
కాలమే సాక్ష్యం.
ఉలిదెబ్బ పడి
శిలరూపం మారింది.
ఉప్పెన వస్తేనే
మనిషి మారునా?
వేలమాటలు
నీటిరాతలు
కన్నీటి ధారలు
కరోనా ఆర్తనాదాలు.
వేల పక్షులు
గూడును వదిలాయి.
ఆకలి సమాధి
బతుకు పోరాటం.
ప్రతీ ఇల్లు
వైద్యశాలయే
బయటికి వెళ్లే
క్వారెంటైన్ కేంద్రమే.
నిన్ను కోరేది
నిన్ను బతికించేది
కదలని అడుగే
స్వీయ నిర్బంధమే.
ఉక్కు సంకల్పం
ఉప్పెనదూరం
లాక్ డౌన్ మంత్రం
ఇంట్లో ఉందాం.

-పెద్ది.భరత్
8500091095

## కరోనా జర జల్ది పో??

గియాల దునియా మొత్తం
మూతికి ముంత కట్టుకొని
వదిలిన గాలినే పీల్సుకుంటూ
అనుమానపు అడ్డుగోడల మధ్య
వొన్కుతూ బత్కుతాంది .
విషపురుగు ఎక్కడికేలి అత్తాందో,
ఎట్లా మొపైతాందో
అస్సలు సమజైతలే గానీ ,
ఎంత పైలంగున్నా ,
పెయ్యి లో సర్రున
జొరబడి గాలి తిత్తుల్ని
కరాబ్ జేత్తాంది
ఒల్లును ,ఇల్లును గుల్లజేత్తాంది.
ఏడాదిన్నర పొద్దాయితాంది ,
దోస్తుగాళ్ళతోటి
ముచ్చట్లకు మూతులు సాపక,
దేన్ని కొందామన్నా ,
దేన్ని తిందామన్నా
మస్తు ఫికరైతాంది ,
అస్సల్ వశపడ్తాలే
దవఖానాలన్నీ పూరా నిండుకున్నయ్ .
కాటిలో సందు లేక
మస్తు తిప్పలైతాంది
పీల్సుకునే గాలి లేక
మస్తు మంది గోసపడి జీవిద్తాండ్రు
పసిపిల్లోడి నుండి పండుటాకుల వరకు
అందరినీ అరుసుకుంటాంటే
పానమంతా మస్తు గుబులైతాంది.
బుర్రంతా గిర్రున తిరుగుతాంది
ఇండియా ను ఎప్పుడు ఇడిశిపెడ్తదో ఏమో
పూరా అర్థమైతలే, నువ్వు పోకుంటే
కట్టమైసమ్మ కు పొటేల్ ను బలిచ్చినట్టు
నిన్ను బలిస్తం, వదిలిపెట్టం
ఉచ్చులు పేని నిన్ను ఉరితీస్తం
నీ మీద మన్ను బోయ
మస్తుమంది నీవల్ల గోసపడ్తున్నం
కరోనా జర జల్ది పో
మేము కాస్త ఊపిరి పీల్చుకుంటం.

-తాటిపాముల రమేష్
7981566031

## అహ్హహ్హహ్హహ...!

కరి మింగిన
వెలగ పండులా
కాలం తడిలో
కరిగిపోయే జీవితాలెన్నో
కలిసిపోయిన తరాలెన్నో...
కాటేసిందనో వాటేసుకుందనో
వీధులన్నీ నిశబ్ద
నిషాతో జోగుతున్నాయనో
భయం బీజాక్షరాలు నాటుకుంటూ
క్షణక్షణం సమయాన్ని నిందిస్తున్నావా...?
అహ్హహ్హహ్హహ...!
నీ విద్యుక్త ధర్మాన్ని
నీవు నిర్వర్తించావా...?
కాల ధర్మాన్ని ధిక్కరించావా...?
కన్నులు తెరిచి
నీలోకి నువ్వు ఒక్కసారి చూసుకో
అంతర్ నేత్రాన్ని అవధానంతో మేల్కొలిపి
విపత్తును కాలంతో
ముడి వేయడం మానుకో
సేద్య భూమిలో నాటిన బీజమైన
మనో భూమిలో నాటిన నిజమైన
ఏదైనా...నాటిన దానికి పది రెట్లు
ఇవ్వడం దాని లక్షణం
అది మంచైనా చెడైనా...
భూమిని చీల్చి చీల్చి
పగలగొట్టుకొని రావడం
దాని సహజత్వం.



-శ్రీతరం బింగి శ్రీకాంత్
7893613015

## క్విట్ ఇండియా... క్విట్ కరోనా

Quit Corona
Hit Corona
Kick Corona
Kill Corona
Crush Corona
Chase Corona
ఇవే నేటి మన నినాదాలు.
కత్తులు
కటారులొద్దు
మర పిరంగులు
అణుబాంబులు
ఆటంబాంబులొద్దు
యుద్ధవిమానాలు మనకొద్దు.
శానిటైజేషన్
సెల్ఫ్ లాక్ డౌన్
స్వీయ నియంత్రణ
ముఖానికి మాస్కులు
అరడుగుల భౌతిక దూరం
అన్న ఆయుధాలే మనకు ముద్దు.
అపోహలొద్దు
ఆందోళనలొద్దు
అనుమానమొద్దు
అనవసర భయం వద్దు
భయభ్రాంతులకు గురికావద్దు.
వ్యాక్సిన్...
ఇమ్యూనిటీ...
అవగాహన...
ఆత్మబలం...
ఆత్మస్థైర్యం...
ఆత్మవిశ్వాసం...
అన్న ఆయుధాలే
మనకు ముద్దు.
కలిసి కరోనాను
కట్టడి చేద్దాం !
కరోనాను ఖతంచేద్దాం !

-పోలయ్య కవి కూకట్లపల్లి
9110784502

## హ్యాపీ డెత్ డే కరోనా...

ఓసీ ! కరోనా రాక్షసీ !
ఓసీ ! మాయదారి మహమ్మారీ !
సర్వం బంద్ చేసి మా అందరినీ
ఇళ్ళల్లో బంధీలనుచేసి...
రెక్కలు తెగిన పక్షులను చేసి...
నీవు మాత్రం విశ్వంలో విహంగంలా ...
విచ్చలవిడిగా విహరిస్తున్నావే...
వికృతి చేష్టలు చేస్తున్నావే...
అగ్రరాజ్యాలకు సైతం
నీ ఉగ్రరూపాన్ని చూపిస్తున్నావే...
నిర్లక్ష్యము చేసిన వారినెత్తిన
నిప్పులు కురిపిస్తున్నావే...
అన్ని ప్రపంచదేశాలను
శవాల దిబ్బలుగా మార్చి
సెల్ఫీలు తీసుకుంటూ
సంబరపడిపోతున్నావే...
ఓసీ ! కరోనా రాక్షసీ ! ఏమా ఘోరకలి ?
మళ్ళొస్తున్నావా ఇంకా తీరలేదా నీ ఆకలి?.
ఓసీ ! కరోనా రాక్షసీ !
ఓసీ ! మాయదారి మహమ్మారీ !
నీవల్లే వేలమంది వలసకార్మికులు
పిల్లాపాపలతో అల్లాడిపోతుంటే...
ఎర్రనిఎండల్లో లెక్కచేయక దిక్కుతోచక
నాలుగు మెతుకులు రాల్చేదాతలకోసం
రోడ్లమీద ఆశతో ఎదురుచూస్తుంటే...
ఆదుకునే నాధుడే లేక, పనుల్లేక
పిల్లాపాపలతో పస్తులుండలేక
కన్నీటితో కడుపు నింపుకుంటుంటే...
ఆకలికి అలమటిస్తుంటే...
అస్థిపంజరాలైపోతుంటే నీవు మాత్రం
కుళ్ళిపోయిన శవాలతో
"పెళ్ళివిందు" చేసుకుంటున్నావే...
ఓసీ ! కరోనా రాక్షసీ ! ఏమా ఘోరకలి ?
మళ్ళొస్తున్నావా ఇంకా తీరలేదా
నీ ఆకలి ?...
ఓసీ ! కరోనా రాక్షసీ !
ఓసీ ! మాయదారి మహమ్మారీ !
సర్వం బంద్ చేసి మా అందరినీ
ఇళ్ళల్లో బంధీలను చేసి...
కాలసర్పమల్లే కరాళనృత్యం చేయకే
నీ విషపు కోరలు విరిచేస్తాం...
నిన్ను తరిమితరిమి కొడతాం...
వచ్చేసింది టీకా ఇక నీ పీక పిసికేసి
నీకు త్వరలో "హ్యాపీ డెత్ డే"చెబుతాం..
లాక్ డౌన్ తో...సోషియల్ డిస్టెన్స్ తో...
స్వీయ నియంత్రణతో...
వ్యక్తిగత శుభ్రతతో...
విజయం నీదని
విర్రవీగకే విజయం మాదే.

-పోలయ్య కవి కూకట్లపల్లి
9110784502

## ప్రపంచాన్ని నిర్మించుకుందాం

వేపచెట్టు పూలరవిక తొడుక్కుని
అందంగా ముస్తాబయింది
మావికొమ్మ చిగురులు తొడిగి
కాయల భారంతో
బాలింతరాలై వంగింది
అయినా ఈ ప్రకృతి సోయగంలో
ఏదో లోటు
శార్వరి వస్తూ తెచ్చిన విషాదఛాయలు
వెళ్తూ వెళ్తూ చేసిన శిశిరపు గాయాలు
ఇంకా చెరిగి పోలేదు
ఆసుపత్రుల్లో గడిపిన మౌనమజిలీలు
కన్నీళ్ళై ఒంటరి సమాధుల్లో ఇంకిపోయాయి
కరచాలనంకోసమైనా కలవలేని చేతులు
భౌతికదూరమంటూ ముడుచుకుపోతున్నాయి
డ్రాగన్ చిమ్మిన విషపుజ్వాలలు
ఎల్లలుదాటి విహరిస్తూనే ఉన్నాయి
అలలు అలలుగా పోటెత్తుతూనే ఉన్నాయి.
ఉగాది వెళ్ళిపోయినా. .
కోయిల స్వరమెందుకో వినబడడంలేదు . .
అదిగో . . కుహూ కుహూ రాగం మార్చుకుని
కొవిషీల్డ్ , కొవాగ్జిన్ అని కూస్తున్నట్టుంది .
మేలుకుని మేలుకోరే కూజితరాగం విందాం !!
కరోనా లేని ప్రపంచాన్ని నిర్మించుకుందాం !!
కొత్తగా మళ్ళీ ఉదయిద్దాం !!

-శ్రీధర్ కొమ్మోజు
9989464467

## మానస వీణ (కథ)

సింగారం ప్రాథమిక పాఠశాలలో మానస ఐదో తరగతి చదువుతోంది. మానస క్లాస్ ఫస్ట్ కాకున్నా, మనసుపెట్టి చదివితే ఫస్ట్ క్లాస్ లో పాస్ అవుతుంది. వాళ్ల నాన్న నారాయణ మంచివాడే, తాగితే మాత్రం నరసింహావతారమే!, వాళ్ళమ్మ చంద్రకళ బీడీలు చుడుతుంది.

కరోనా వైరస్ తోక తొక్కిన త్రాచులా బుసలు కొడుతుంటే, అప్రమత్తమైన కేంద్రం దేశమంతా లాక్ డౌన్ విధించింది. దాంతో చదువులన్ని అటకెక్కడంతో విద్యాశాఖ దూరదర్శన్ ద్వారా ఆన్లైన్ పాఠాలు ప్రారంభించి, విద్యార్థులను పర్యవేక్షించాలని ఉపాధ్యాయులను ఆదేశించింది.

ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందమంతా తగు జాగ్రత్తలు తీసుకుంటూ విద్యార్థుల ఇళ్ళల్లకు వెళ్లి, టీవీ, ఆండ్రాయిడ్ ఫోన్స్ గురించి ఆరా తీయగా మొత్తం 51 మంది విద్యార్థుల్లో 38 మంది విద్యార్థులకు టీవీ, 12 విద్యార్థులకు ఆండ్రాయిడ్ ఫోన్ సౌకర్యం ఉన్నట్టు లెక్క తేల్చారు. కేవలం మానస వాళ్లకి మాత్రమే ఎలాంటి డిజిటల్ పరికరం లేదు.

మానసను వాళ్ళింటి పక్కనే ఉన్న మౌనిక వాళ్ళింట్లో టీవి చూడమని శ్రీధర్ సార్ చెప్పడంతో రెండు రోజులు వెళ్లిన తర్వాత మా ఇంటికి రావొద్దని మౌనిక వాళ్ళమ్మ చెప్పింది. రోజు వారి పర్యవేక్షణలో భాగంగా మానస ఆన్లైన్ పాఠాలు వినడం లేదని తెలిసింది. ఎలాంటి సదుపాయం లేని ఇలాంటి పిల్లలకు గ్రామపంచాయతీలో తగిన ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా, వాళ్ళ ఊర్లో మాత్రం ఎలాంటి ఏర్పాటు చేయలేదు.

శ్రీధర్ సార్, వాళ్ళ నాన్న నారాయణతో మాట్లాడాలని వాళ్ళింటికి వెళ్తే మద్యం మత్తులో ఉన్న నారాయణ బూతుల పారాయణం చేశాడు! చేసేది లేక శ్రీధర్ సార్ మానసను స్కూల్ కి తీసుకెళ్లి తన ఫోన్లో పాఠాలు వినిపించాడు.

ఇలా కొన్ని రోజుల తర్వాత తన కూతురు ఒక్కతే బడికి వెళ్తుందని, తన తప్పు తెలుసుకున్న నారాయణ పదివేల రూపాయలు బాకీ చేసి ఫోన్ కొనిచ్చాడు. దాంతో సంతోషంతో మానస మొహం మందారంలా వికసించింది!.

-గంగశ్రీ
9676305949

## కరోనా మృత్యుఘోషలు

విశాల విశ్వంలో అడుగడుగున
కరోనా వింతైన నృత్యాలతో
మనుషులపై నాట్యం చేస్తుంది..
బ్రహ్మ చెప్పిన కాలాంతపు ఛాయలు
కళ్ళముందు కదలాడుతున్నవి
కరోనా వైరస్ దృశ్యాలు
వాయువు వేటగాడిలా మారి
గాలి వలను విసురుతున్నాడు
వలలో చిక్కిన శ్వాసలను
గొంతు నులిమేసి
పైలోకానికి పంపిస్తున్నాడు
స్మశానంలో క్యూ టికెట్ల గొడవ
మొదలవుతుంది నేనంటే నేను అనేలా
చోటు దొరకక
ఫైటింగ్ జరుగుతున్నట్టు
రోడ్లపై పేరుకుపోతున్న
శవాల గుట్టల దీనత్వం
విధి గీసిన గీతలో అంతా నిర్మాణుష్యమే
అందరిని చుట్టుముట్టేస్తున్నవి
అర్థం కాని ప్రశ్నలు ....??
మృత్యుఘోషగా వినిపిస్తున్నాయి
ఏమీ లేనట్టుగా తిరుగుతున్న వాళ్లతోనే
ఈ కరోనా వైరస్ వణుకు పుట్టిస్తుంది
వీళ్లు మనవాళ్లే అనే ధైర్యం
కరోనా కొంప ముంచుతుంది
మన అలసత్వానికి ఆనవాళ్లుగా
మారుతున్న మృత్యు ఘోషలకు
చివరి చరమగీతం పాడుదాం..

-కొలిపాక శ్రీనివాస్
9866514972

## కాన్వాస్ పై చిత్రాలు

పాఠాలింకా నేర్వనే లేదు
బడి మూతబడింది
ఉపచారాలన్నీ కానేలేదు
గుడి మూత బడింది
పెళ్లిపందిరికి అలంకార
మౌదామనుకున్న
జర్బరాలు పశువుల దానాలయ్యాయ్
వరమాలలన్నీ శవమాల లయ్యాయ్
భూతల వ్యోమగాములు
కనిపించని గమ్యాలకు
వాహనం లేని ప్రయాణాలు
సహస్ర హోమగుండాల్ని
తలపిస్తున్న
శివధామం
వైకుంఠ ధామం లో
తప్పని వేయిటింగులు
ఇప్పుడంతా ఆన్ లైన్
ఆన్లైన్ పెళ్లికి ఆఫ్ లైన్ కాపురమెట్లా
సానిటైసర్ హస్త భూషణం
మాస్క్ ముఖాలంకారం
అనుమానం తోడుగా
ఆమడ దూరం హద్దుగా
ఎక్కడాగమైతమో
ఎప్పుడాగి పోతమో
తెలువని బ్రతుకు ప్రయాణం
ఈ కాన్వాస్ పై
కొత్త చిత్రాలు ఎన్నో

-బి. అంజనీదేవి
9849875082

## లక్ష్మణ రేఖ దాటోద్దు..!

హద్దులు మీరి..
వైరస్‌ను చులకన చేస్తూ..
లక్ష్మణరేఖను అలక్ష్యం చేస్తేనేగా..
ఆగమగును అనారోగ్యం చితికి !
విలాసాలకు సెలవడిగి..
కరోనా క్రమశిక్షణకు లోబడి..
భౌతికంగా దూరమయితేనేగా..
మానసికంగా ఏకమై మనగలుగుతాం !
కరోనాకు భయపడితే..
సోకదు కదా వైరస్..
భయాన్ని వీడితేనేగా..
రికవరీ బహు సులభం !
మాస్కులకు మర్యాదనిచ్చి..
దూరాలను ఆదరించి..
చేతులకు స్నానం చేయించి..
కరోనాకు అడ్డుకట్ట వేద్దాం !
వైరస్ లంకను దహనం చేసే..
ఆంజనేయులం కావాలె అందరం
కరోనా రాక్షసి కంఠాన్ని తెగనరికే..
రామబాణం కావాలి ప్రతి ఒక్కరం !

- డా ॥బుర్ర
మధుసూదన్ రెడ్డి
9949700037

## చెమట పుట్టక పోవుడు

కాడు కాలంగ
రొట్టెలు కాల్చుకోజూసినట్లు
కార్పోరేట్ వైద్యాలయాల్లో
కొలువైన అల్ప చిల్లర వేల్పులు
పైకం మైకంలో
కల్లుతాగినకోతిలా సమతాస్థితి పట్టుదప్పి
వృత్తిసేవాభావం స్పృహ ఎండమావై
రోగి చికిత్స పేరిట
చచ్చినోడి పెళ్లికి వచ్చిందే కట్నమని
ఉన్నదో లేదో చెప్పకుండా
ఉన్నకాడికి ఊడ్చేసి
నిండు నిశిలో
చీకటి కొమ్ముకాస్తున్నవేళ
చావు వార్త చెవినేసి
మహమ్మారి కాలంలో
ఊపిరి లేని ఉత్త దేహాన్నైనా
చిల్లిగవ్వలేని చేతికివ్వక
చెమ్మగిల్లిన కన్నులతో
కళ్ళారా కనలేక
ఘోరంగా చేసే ఖననంతో
చితి చచ్చినొన్ని కాల్చుతుంటే
చింత బతికునోన్ని దహిస్తుంది
ఇది ముమ్మాటికీ
చెయ్యితంగవుడుతనం చూసి
పాలకుల్లో చెమటపుట్టక పోవుడే
తెల్లకోటు మాటున
నల్లధనం వేటలో
విలువల వలువలు విప్పిన
ప్రాణదాతలుధనదూతలైరి
ధనదూతలారా....!
సంద్రమంత సంపద
ధనదాహం తీర్చలేదు
ఊరే ఊట బావే
దప్పిక తీరుస్తుంది
జీవజలం తాగి
మనిషిదేహ పుష్పాలు
మానవత్వమై పరిమళిస్తే
మాపటికి లేకున్నా మారాజులే
సాప కప్పుకున్న సౌదర్లే

-జినుకల వెంకటేష్
9652092120

## మానవత్వమనే ఆక్సీజన్ కావాలి

ధన గర్వం కుల పిచ్చి
మత విద్వేషం రాక్షస రాజకీయం
ప్రతీది నాదేననే స్వార్థం
అంటూ ముట్టు పేరుతో అవమానాలు
ఎన్ని చేసావో...
ఎన్నెన్ని కలలు కన్నావో..
ఇప్పుడు
సిరిసంపదలు తరిగిపోయాయా?
బతుకంతా అరిగిపోయిన చెప్పులా మారిందా
నువ్వు కసురుకున్న మనుషులతో ఇప్పుడు
మనసు విప్పి మాట్లాడుతున్నావా...?
మూతికి బట్టకట్టి బతుకుతున్న నీతో
జత కడుతున్నారా...
అహంభావం పొకడతో
అన్నింటా అతి గతి తప్పావు
కంటి చూపుతో బెదిరింపులు
ఎంతవరకు నడిచాయి
ఇప్పుడు తుమ్మితే భయపడుతున్నావు
పక్కవాడు దగ్గితే పరుగులు తీస్తున్నావు
ముందూ వెనకా చూడాలంటే
జంకుతున్నావు
బాధ నీదాక వచ్చేసరికి
విలువల గురించి మాట్లాడుతున్నావు
ఎక్కడా నీ పలుకుబడి
ఎక్కడా నీ అధికారం
పచ్చని బతుకుల్లో
కుల మత పిచ్చి లేపి
మచ్చ తెచ్చుకున్నావు
నచ్చినట్లు చేసి మెట్లు జారావు
నీ ఆస్తి, అంతస్తు, హోదా
వర్గ వర్ణ బేధం తేజస్సు తగ్గిందా?
కాలిబూడిదైన అస్థికలను
ఏ కుండలోకి ఎత్తుతావు...
ఏ నది తీరంలో కలుపుతావు
ఖననం చేయబడిన దేహం వద్ద
ఏమని ప్రార్థన చేస్తావు
అంతా నాదేనని విర్రవీగి
ఏదీ నీది కాకుండా పోయినందుకు
ఏం చేయాలో దిక్కు తోచడం లేదా...?
ఇకనైనా మనిషిగా బతకడం నేర్చుకుంటావా?
మనసున్న మనిషిగా మార్పు కొరుతావా
మానవత్వమనే ఆక్సీజన్
అందించుతావా
కరోనాతో తనువు చాలించిన
వారి కుటుంబాలకు
అండగా నిలబడుతావా?
రా ... మనసు విప్పు
అహాన్ని తొక్కిపెట్టు
కరోనాను తరిమికొట్ట
సైనిక కవాతుకై సాగు

-సొరం ప్రవీణ్ కుమార్ ( కళాశ్రీ)
9866198112

## విశ్వాసంతో జీవిద్దాం

గుప్పెడంత మనసు
ఆకాశమంతలా ఎగరాలనంది
గురి తప్పని లక్ష్యము
గవాక్షాలను దాటాలనంది
కనుల ముందర దృశ్యాలు
మదిని కలచివేస్తున్నా
బతకడానికి కలలను
కనులు కనాలని
రెప్పలతో చెబుతున్నాయి
పడని కనురెప్పలకు
గడియవేయని తలుపులకు
అనుబంధమేర్పడినట్టు
బంధమేదో ఏర్పడి
చక్రమై తిరుగుతోంది
చెవులకింపుగా వినబడని
గానము,గాయమై
కాలప్రవాహములో తలుచుకుంటుంది
మరణశాసనము ప్రతిచోటా
ఘంటారావములా మ్రోగుతున్న
యుద్ధము చేయక తప్పలేదు మనిషికి.
యుద్ధము..
ఒకప్పుడు అశ్వబలము, గజబలము
మనుష్యబలము
ఆయుధాలు..కత్తి,డోలు,శూలము
తర్వాత యుద్ధము..తుపాకీల ప్రేలుడు
అణుబాంబులమోత
మిసైల్స్, పరిశోధనా పరికరాలతో
చంపడము.
ప్రస్తుతము యుద్ధము...
శత్రువు కంటికి కనబడడు
ఆదమరచి ,అజాగ్రత్తగా ఉన్నామా
భూగోళమంతా వామనుడులా
ఆక్రమించుతుంది
అయినా యుద్ధమేమీ
మనిషికి కొత్తకాదుకదా
తల్లిగర్భము నుండి మొదలయినదే
పోరాడకుండా బతుకు పండుతుందా?
కనబడని వైరస్సుకే తల్లడిల్లాలా
డీలాపడిపోవాలా,
రేయింపవళ్లు సేవలందించే
వైద్యులు"నారాయణులై" వుండగా
కష్టమైనా ఓర్చుకొని కాపాడే
రక్షకభటులు నీవెంటే వుండగా
నువ్వున్న చోటుకే వచ్చి
నువ్వువిసిరిన వాటిని తీసివైచి
పరిశుభ్రత పాటించే
పారిశుద్ధ్య పనివారుండగా..
భయమేల సోదరా
పాజిటివ్ వచ్చిందని దిగులేరా సోదరా
నీలో వున్న భయమును పోగొట్టరా
నీకు నీవే నంటు ఆలోచన చేయరా
హోం ఐసోలేషనంటే..
నిను నీవే కాపాడుకొనే
జాగ్రత్తల గది అని నీ మదికి చెప్పుకోరా
ఒక్కసారి నీ కనుల ముందర
నీకిష్టమైన రంగులకలను నింపుకోరా
నీ కల బతకడము
కరోనా వైరస్సును జయించడము
వైరస్ ని జయించాలంటే
కావల్సినది "శుభ్రతయే"
మాస్కు తీయకూడదు,
చేతులు శుభ్రత వీడకూడదు
అశుభ్రతను ఎట్టి పరిస్థిలోనూ
దరిచేయకూడదు

-విశ్వనాథ నరసింహం
9490971589

## గెలుపెవరిదో..?

కత్తులు లేవు
బాంబులు లేవు
రక్తపాతమసలే లేదు
కానీ
ప్రపంచ యుద్ధం మాత్రం
ముమ్మరంగా జరుగుతోంది
శవాల కుప్పలు
ఎవరెస్టు శిఖరాలవుతున్నాయ్
ఆర్తనాదాలు
అరణ్యరోదనలవుతున్నాయ్
కనీవినీ యెరుగని వింత యుద్ధమిది
చరిత్రలో ఏ రాజూ చేయలేదు
భవిష్యత్తులో
ఏ పాలకుడూ చేయడు.
ప్రపంచం అంతా ఒకవైపు
కరోనా ఒకవైపు
శత్రువు ఒక్కరే
కంటికి కనిపించదు
కానీ కళ్ళముందే తిరుగుతుంది
ప్రతి వ్యక్తిని
అణుబాంబుగా మార్చేయగలదు
కరోనా కనికట్టు నేర్చిందేమో!
యుద్ధం ముగియాలంటే
ఒకప్పుడు
శాంతి ఒప్పందం జరిగేది
కానీ ఈ యుద్ధమే
శాంతియుతంగా జరుగుతోంది
కాలం మారింది
ఈ శాంతియుత యుద్ధాన్ని
కలసికట్టుగా కాదు
విడివిడిగా పోరాడితేనే
గెలవగలమని రూఢీ అయ్యింది.
తరచిచూస్తే
ఈ యుద్ధానికి కారణాలు
రెండని తేలింది
ఒకటి అస్థిత్వం కొరకు
రెండు ఆధిపత్యం కొరకు
అస్థిత్వం కోసం మనిషి
ఆధిపత్యం కోసం
కరోనా
అలుపెరుగని
యుద్ధవీరుడికిమల్లే
అహర్నిశలూ
పోరాడుతున్నారిద్దరూ
తుదకు ఈ శాంతియుత యుద్ధంలో
గెలుపెవరిని
వరిస్తుందో మరి !

- ఎన్.నరేశ్ చారి
9701334516

## జీవన పోరాటం

పక్షులు బిడ్డల ఆహారం కోసం ఆరాటపడినా
కుటుంబాన్ని కాపాడుకునేందుకు
వ్యక్తి ఏకంగా చిరుతపులితో
పోరాటం చేసినా
కరోనా మృత్యువును జయించడానికి
మనిషి నిత్యం పోరాటం చేస్తున్నా
సృష్టిలోని ప్రతిజీవి జీవనం కోసం
ఆరాట పడుతున్నా
బతుకు చిత్రంలో జీవన కోసం చేసే
పోరాటంలో భాగమేనని ముందుకు సాగాలి
వజ్రానికి అయినా సాన పెట్టనిదే
మెరుపు రాదు కదా!
జీవిత మాధుర్యం చవి చూడాలంట
సుఖదుఃఖాలు అన్నింటినీ భరించాలి.
దివ్యాంగులు,ఆసక్తులు,
అల్ప ప్రాణాలు సాగించే జీవన పోరాటాన్ని
చూచి ప్రేరణ పొంది జీవించాలి.
జీవితం మూడు పువ్వులు ఆరు కాయలుగా
ఒకే కాన్పులో ఇద్దరు కవలలుగా
పచ్చని కాపురంగా ఉండకపోవచ్చు
చేతికొచ్చింది నోటిదాకా రాకనూపోవచ్చు
జీవితం మొత్తం కష్టాలు వెంటాడనూవచ్చు
జీవించడమే దుర్భరమనిపించే
విషాద క్షణాలుఎదురుకావచ్చు
బతుకు చిత్రంలో నీవు పడే ఆరాటమే
జీవన పోరాటంలో నిన్ను నిలబెట్టవచ్చు.
కష్టాలు మనుషులకు కాక
మానులకొస్తాయా?
మనిషి జీవితం పోరాటాల మయం
పోరాడుదాం!
జీవితాన్ని సుఖమయం
చేసుకుందాం..!!

-పిల్లి.హజరత్తయ్య,
9848606573

## రాయబడని మరణాలెన్నో

ఆ కనిపించని దేవుని యిలలో
రాయబడని మరణాలెన్నో
రణరక్కసి కరోన నృత్యం
బ్రతికించిన డాక్టరులెందరో.
మనుషులు సృష్టించిన క్రిమితో
వలసభిద్ర బతుకులుయన్నో!
అగుపించని కరోన క్రిమిఆటలో
శ్వాసకోతతో అల్లాడినమనుషు లెందరో! .
అణగారిన అగ్నిపర్వతం !
కనిపెంచిన లావా ఎంతో!
కరోనతో సచ్చే పేదల
శోకంలో కోపం యెంతో ! .
మనిషిగా మారుట కోసం
జరిగిన పరిణామాలెన్నో !
మనిషి చెసిన పాపానికి
ప్రకృతికి వికృతులెన్నో !.
సామూహిక దహణకాండలో
చితి తెలియని రోధనలెన్నో!
కాలని కాళ్ల కరోన శవాల
రుచిమరిగిన శునకాలెన్నో!.
పుడమితల్ల

## వేసవి శలవులు

(బాలగేయం - మకుపూసలు)

పరీక్షలకింక శెలవు
పాఠశాలకీ శెలవు
పరీక్షలైపోయాయోచ్
ఆటపాటలకిది నెలవు.

పెరటిలోన చెట్లుంటే
ఉయ్యాల ఊగుతుంటే
భలేమజా వస్తుందోయ్
కాయకోసి తింటుంటే.

కోతికొమ్మచ్చులు
గోదుంబిళ్ళాటలు
భలే బాగుంటాయోయ్
నేలాబండాటలు.

గుడుగుడుగుంజం అంటూ
గుజ్జనగూళ్ళాటంటూ
ఆటలతో కడుపునిండు
అన్నమింక వద్దంటూ.

చింతపిక్కలాటలు
దాగుడుమూతాటలు
అమ్మాయిలకివి ఇష్టం
వామనగుంటాటలు.

బొమ్మలపెళ్ళిళ్ళు చేసి
ఊరేగింపు జరిపేసి
తెగసంబర పడిపోతాం
పెద్దరికం వచ్చేసి.

వీధి క్రికెట్టాటలు
కబడ్డీల కేకలు
అబ్బాయిలకివి ఇష్టం
ఆరుబయట ఆటలు.

బొంగరాలనాడేస్తాం
వీధులన్ని తిరిగేస్తాం
పుల్లాటా చెండాటా
తెగసందడి చేసేస్తాం.

కర్రాబిళ్ళా వచ్చా?
ఏడుపెంకులాటొచ్చా?
ఈ సెల్ ఫోన్ కాలంలో
ఆడేదెవరడగొచ్చా?.

గాలిపటాలెగరేద్దాం
బొమ్మలెన్నో గీసేద్దాం
వినోదాన్ని కలిగించే
కథలెన్నో చదివేద్దాం

పంచతంత్ర కథలు భలే
భేతాళకథలూ భలే
మరో మాయాలోకమిది
కాశీమజిలీకథలే

వేమన పద్యాలు నేర్చి
సుమతీ శతకమే నేర్చి
తాతమెప్పు పొందుతాను
తిండినిద్రలనే మర్చి

అమ్మ ఊరుకుంటుందా?
అట్లు పెట్టకుంటుందా?
నాకు నోరూరేలా
రొట్టెచెయ్యనంటుందా?

ఉదయాన్నే ఇడ్లీలు
కాకుంటే పూరీలు
తెగలాగించేద్దామోయ్
పెసరట్లూ బజ్జీలు

ఆటుంటే తిండొద్దు
తిండుంటే కథలొద్దు
నిజం చెప్పాలంటే
కథలుంటే ఏమొద్దు

ఊళ్ళన్నీ తిరగాలి
గుళ్ళన్నో చూడాలి
మళ్ళీ బడి తెరిచాక
గొప్పలుగా చెప్పాలి

తిరుపతికే వెళ్ళాము
ఏడుకొండలెక్కాము
వెంకటేశ్వరుని చూసి
మొక్కులన్ని తీర్చాము

ఆటలింకా ఆడాలి
కథలనింకా చదవాలి
సెలవులు ముగిసేలోగా
అల్లరింకా చెయ్యాలి

సెలవులైపోతాయి
బడులు మొదలౌతాయి
కళ్ళుమూసి తెరిచేంతన
రోజులై పోతాయి

చదువులోన మజాచూడు
గురువు దీవెనంది చూడు
విద్యవిలువ తెలుసుకుని
నాన్న కళ్ళకాంతి చూడు

-గుడిపూడి రాధికారాణి,
9494942583

## అమ్మనాన్నలు

అమ్మ ఆదిదైవం
అమ్మ ఋణంతీరనిది
నాన్న తొలి దైవం
నాన్న మనసు తీయనిది

నవమాసాలు మోసింది
తన రక్తం పంచెను
చాకిరెంతో చేసింది
కష్టపడి పెంచెను

మనకోసం నాన్న
చెమటను దారపోసె
మనబాగుకై నాన్న
త్యాగమెంతొ చేసె.

అమ్మ అనురాగం
అపురూప బంధము
అమ్మ ప్రేమరాగం
వెలలేని గంధము.

నాన్న హృదయం
నవనీతం వంటిది
అమ్మ సహృదయం
తప్పులను క్షమిస్తది.

మనకోసం మనఅమ్మ
క్రొవ్వొత్తిలా కరుగుతుంది
త్యాగమూర్తి మన అమ్మ
మనకోసం తపిస్తుంది.

జీవితమంత మనకోసం
శ్రమపడును మన నాన్న
మనజీవిత బాగుకోసం
కృషిచేస్తడు మన నాన్న.

మనకాలికి ముల్లిరిగితే
రోదించును మన అమ్మ
మనకేమైన జరిగితే
తల్లడిల్లు మన అమ్మ

వృద్ధాప్యమున వారిని
ప్రేమతో చూడవలె
చేతగాని వారిని
సేవించుచు ఉండవలె

మాతపితరుల సేవయే
మాదవ సేవయగును
జన్మజన్మలకు మనకిదియే
మోక్షపదమే యగును

-అక్కి నర్సింలుగౌడ్
9912659965

## నేను ఏమని పాడగలను

ముసుగులేని ముఖాలు
వికృతంగా ఉన్న ముఖాలు
వింతగా లేదు కాని
నిజం అంటే భయంగా ఉంది
నేను ఏమని పాడగలను.

దిష్టి తగిలిందో ఏమో
గాజు మేడలాంటి
ఈ నగరం పగిలిపోయి
విరిగి చెల్లాచెదురు అయింది
చుట్టూ ఉన్న జనసమూహం
అందరూ నా వాళ్లు
కానీ ఒక్క స్నేహితుడు లేడు
నేను ఏమని పాడగలను.

చల్లటి వెలుగులు
ఇచ్చే జాబిల్లి కూడా
వెనుక నుండి వెన్నుపోటు
పొడిచి మేఘాలను దాటుకుని
కనబడకుండా వెళ్లిపోయింది
నా ఆత్మ నన్ను విడిచి పోవాలని
పదే పదే కోరుకుంటోంది
నేను ఏమని పాడగలను.

-అరుణ దేనియల్
9000606889

## నానీలు

చిన్నప్పుడు వానల్లో
తడుసుడెంత సంబరమో
వాన అందరి
దోస్తే..!

తొలి చినుకు
తాకిన పరవశం!
మదిలో తీయని
భావాల మొలకై..!!

కురిసింది
వాన!
అన్నదాత
ఎదురుచూపుల ఫలముగా.!!

ఎందుకు కురుస్తుందో
అకాల వర్షం!
రైతు గుండెల్లో
కాష్ఠం పేర్చుత్తూ..!

వాన కురిస్తే
నేలకి సీమంతమే
పచ్చంగ పెరిగి
పంటల ఫలమిస్తూ..!

-వెగ్గలం ఉషశ్రీ
9440370066

## మలుపు

మనిషిలోని మనసుకు
తడుతాయి ఎన్నో తలుపులు!
తలుపులన్నీ తలపోయు
తపనలే...
బ్రతుకులోని మలుపులు!
అరాటాల మనిషికి
ఆలోచనలే మేలుకొలుపులు!
మేలుకొనితెలుసుకుంటే
మనిషికి మలుపులే గెలుపులు!
సాగే మలుపు నీకోసం ఆగదు!
ఏ మలుపెటు తిప్పునో
ఎవరికి తెలియదు!
తెలుసుకొని మసులుకుంటే
మరలిరాని బ్రతుకులో
మలుపులన్ని మైలు రాళ్ళే!
మలుపులెన్నో వుంటాయి
బ్రతుకులో!
మబ్బులెన్నో వుంటాయి
నింగిలో!
బ్రతుకునుమార్చే
మేలుమలుపు
ఒక్కటే!
మబ్బుల్లో వర్షించే
వానమబ్బుఒక్కటే!
మబ్బులన్ని తేలిపోతే...
పారే ఏరు వుండదు!
మలుపులన్ని మసకబారితే...
మనిషికేది వెలుగు దారి?
మనసుకేది గెలుపుదారి?
మలుపులతోనే ఈ మహిలో
మనుగడలు ముడివడ్డయా!



-పి.బక్కారెడ్డి
9705315250

## వందనం

మనం భూమి
పుత్రులం
భూమి తల్లిని
ప్రేమిద్దాం
అడవులను
అడవి ప్రాణులను
రక్షిద్దాం
కాలుష్యం నివారిద్దాం
మనిషిగా
జీవిద్దాం
భూమి తల్లి నీకు
వందనం.

- యెల్లి సుదర్శన్ పద్మశాలి
సెల్: 9892411067

# "తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడు కర్రోళ్ల నర్సయ్య"

నిజాం పాలనలో గ్రామాల్లో పటేల్, పట్వారి, దొరలు, భూస్వాములు నానా బాధలు పెడుతుండేవారు వెట్టిచాకిరి, బానిసత్వం అధికంగా ఉండేది. నిజాం పాలన విముక్తి కోసం దొడ్డి కొమురయ్య, బందగి బద్దం ఎల్లారెడ్డి, చాకలి ఐలమ్మ, అమృతలాల్ శుక్లా, కొమురం భీం, అన బేరిప్రభాకర్రావు, దాశరథి ఎందరో పోరాటం నడిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా సిరిసిల్ల ప్రాంతంలో రైతాంగ సాయుధ పోరాటం సాగింది. ఎందరెందరో అమరవీరులు పోరాడి ప్రాణాలర్పించారు. వారి అమూల్యమైన జీవితాలను త్యాగం చేసి స్వాతంత్ర్యం సంపాదించారు. బతికి ఉన్నవారిలో కొందరు ఉన్నతంగా బతికితే మరికొందరు అవసాన దశలో దుర్భరమైన జీవితాన్ని గడిపి తనువులు చాలించారు. అటువంటి మహనీయులలో రైతాంగ సాయుధ పోరాట వీరుడు మాజీ ఎమ్మెల్యే కర్రోళ్ల నరసయ్య ఒకరు.

సిరిసిల్ల ప్రాంతంలో రైతాంగ సాయుధ పోరాటం చేసిన వీరుల గురించి సేకరించాలని తెలంగాణ రాష్ట్ర సాధన మలిదశ ఉద్యమంలో భాగంగా 2014 మార్చి 9, 10 తేదీలలో వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, సిరిసిల్ల, కోనరావుపేట మండలాలలో సంచరించాను. నిమ్మ పల్లి, మానాల, గర్జనపల్లి, గాలిపెల్లి లక్ష్మీపురం, వెంకటాపురం, పదిర, సింగారం గ్రామాలలో రైతాంగ సాయుధ పోరాట విషయాలు సేకరించాను.కర్రోళ్ల నరసయ్య గురించి విని మల్కపేట గ్రామం వెళ్లాను. కవి వెంగళ నాగరాజు సహకరించారు.

కర్రోళ్ల నరసయ్య ఇంటికి వెళ్లగానే కర్రోళ్ల మధు కొందరు నా శిష్యులు నమస్కారం సార్ మీరు మా ఇంటికి వచ్చారు అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వారు సిరిసిల్ల ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో శిష్యులుగా విద్య అభ్యసిస్తున్నారు. నేను ఆ కళాశాలలో లెక్చరర్గా తెలుగు బోధిస్తున్నాను. వారు కర్రోళ్ల నర్సయ్య మనువలుగా చెప్పారు. నేను ఆశ్చర్యపోయాను. బాధపడ్డాను. ఒక మాజీ ఎమ్మెల్యే మనవలు మన ప్రభుత్వ కళాశాలలో చదువుతున్నారు. ఎంతగొప్ప కుటుంబం, ఎంత నిరాడంబరమైనది, ఒకింత సామాన్య జీవితం గడుపుతుంది. ఇంట్లో కారల్ మార్క్స్, లెనిన్, స్టాలిన్ ఫోటోలు ఉన్నాయి. కర్రోళ్ల నరసయ్య ఉమ్మడి సిరిసిల్ల నియోజకవర్గాల్లో రిజర్వ్డ్ నేరళ్ల నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా పని చేశారు. కుటుంబ పరిస్థితులు కుటుంబ సభ్యుల పరిస్థితులు చూస్తె నా గుండె చెరువు అయింది. చెలించి పోయాను. నిరుపేద కుటుంబం. నరసయ్య భార్య దుర్గవ్వను ఇంటర్వ్యూ చేశాను తనకు తెలిసిన సమాచారం అందించింది. నేను కూలి నాలి చేసుకుంటున్న అని కంట నీరు పెట్టుకుని చెప్పింది. నేటి రాజకీయ నాయకుల పరిస్థితులు మదిలో మెదిలాయి. సర్పంచులు, జెడ్ పి టి సిలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎక్కువమంది కార్లు బిల్డింగులు ఉండి కోట్లు సంపాదిస్తున్నారు. కానీ నరసయ్య ఎమ్మెల్యేగా పనిచేసి నిజాయితీగా, నిరాడంబరంగా బతికి ప్రజల సేవ చేశారు. స్వాతంత్ర్య సమరయోధుల పెన్షన్ కోసం కాళ్లరిగేలా తిరిగి మందుల కోసం అప్పులు చేసి చివరకు తనువు చాలించిన మహనీయులు, రైతాంగ సాయుధ పోరాట వీరులు కర్రోళ్ల నరసయ్య అని తెలుసుకున్నాను.

కర్రోళ్ల నర్సయ్య1942లో భూమికోసం,భుక్తికోసం,తెలంగాణ విముక్తికోసం బద్దం ఎల్లారెడ్డి,అమృతలాల్ శుక్లా ఉపన్యాసాలకు ఉత్తేజితుడై15యేళ్ల వయస్సులో సాయుధపోరాటంలో చేరారు. నిరుపేద దళితకుటుంబంలో నర్సయ్య-ఎల్లమ్మ దంపతులకు జన్మించారు. సమసమాజస్థాపనకోసం నడుము బిగించారు. సాయుధ శిక్షణపొంది నర్సయ్య నిమ్మపల్లి పోలీసు అవుట్ పోస్టుపై దాడిచేశారు. తర్వాత లోతురెల్లో ఆనాటి నిజాం పోలీసులను మాటువేసి మట్టి కరిపించారు. నర్సయ్యకు చదువులేకపోవడంతో రాజకీయ అర్గనైజేషన్లో ముందుకు సాగలేకపోగా కలత చెందారు. రాత్రివేలళ్లో బడికిపోయి కష్టపడి నాల్గవతరగతి చదువుకున్నారు. సమాజాన్ని చదివారు. రాజకీయాన్ని ఒంటబట్టించుకున్నారు. ప్రజల సమస్యలను అధ్యనంచేశారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేశారు. దీనితో పార్టీ నాయకత్వం మిలటరీదళం నుండి రాజకీయదళాల్లోనికి బదిలీ చేసింది. వెట్టిచాకిరి, బానిసత్వం, రైతులు, రైతుకూలీల సమస్యలను తెలుసుకున్న నర్సయ్య దొరల వెట్టిచాకిరి విధానానికి వ్యతిరేకంగా సభలు, సమావేశాలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేయడంలో అలుపెరుగని క్రృషి చేసారు.

బద్దం ఎల్లారెడ్డి,అమృతలాల్ శుక్లా, గడ్డం తిరుపతిరెడ్డి మొదలగు రైతాంగ సాయుధ అనుచరులతో ముందుకు సాగారు. అప్పటికే విధ్వంసకర సంఘటనలతో సంచలనం సృష్టించిన నరసయ్యను పట్టుకున్న పోలీసులు ఆయనకు బేడీలు వేసి గ్రామ గ్రామాన తిప్పారు. ప్రజలను ఇతనికి వ్యతిరేకంగా సాక్ష్యం ఇవ్వాలంటూ నైజాం పోలీసులు ఎంత ప్రయత్నించినా ఎవరు సహకరించలేదు. దీనితో పోలీసులు బలమైన ఆధారాలు లేకుండానే కోర్టులో హాజరుపరిచారు. నరసయ్య తిరిగి మూడు నెలలకే విడుదలయ్యి మళ్లీ పోరాట బాటలోనే ప్రయాణం కొనసాగించారు. 1948 సెప్టెంబర్ 17న భారత ప్రభుత్వం పోలీసు చర్య చేపట్టగా అనంతరం సాయుధ పోరాటాన్ని కమ్యూనిస్టు రహస్య జీవితం నుండి బయటకు వచ్చారు. నరసయ్య గారు కూడా బయటకు వచ్చారు.

1952లో నిషేధం కూడా ఎత్తి వేయలేదు. అసెంబ్లీకి జరుగుతున్న ఎన్నికల్లో నరసయ్య గారు పోటీపడగా పోటీ చేయకుండా అడ్డుకున్నారు. తరువాత 1957లో తిరిగి జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి సిరిసిల్ల నియోజకవర్గం నుండి జనరల్ అభ్యర్థిగా అమృతలాల్ శుక్లా పోటీచేయగా రిజర్వ్ అభ్యర్థిగా నరసయ్యలు పోటీ చేసి విజయం సాధించారు. నరసయ్య గారు గెలుపొందిన అనంతరం సిరిసిల్ల ప్రాంతంలోని నర్మాల ప్రాజెక్టు కింద భూములను పేదలు దున్నుతుంటే ప్రభుత్వం 12 ఏళ్ళపాటు నిషేధం విధించింది. భూములపై నిషేధం ఎత్తివేయాలని ఉద్యమాలు నిర్వహించడమే గాక 500 రూపాయల వ్యాల్యుయేషనకే భూములకు పట్టాలు ఇప్పించడంలో నరసయ్య గారు ప్రముఖ పాత్ర వహించారు. తిరిగి 1962- 67 లో అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో నియోజకవర్గాలకు రిజర్వేషన్ కేటాయించడంతో నరసయ్య నేరెళ్ల నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థి జానకి రామయ్యపై పోటీ చేసి ఓడిపోయారు. తిరిగి రాజకీయాలలో రాణించడానికి తన వద్ద ఆర్థిక స్థోమత లేకపోవడంతో కాలక్రమేణా రాజకీయాలలో ముందుకు సాగ లేకపోయారు. సామాన్య జీవనం గడిపారు.

ఎందరికో ఆదర్శంగా నిలిచిన నరసయ్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్న చూపే చూశాయి. 1980లో కేంద్ర ప్రభుత్వ సమరయోధుల పింఛన్ దరఖాస్తు చేసుకున్న నరసయ్యగారికి తీరని ఆవేదనే మిగిలింది. అప్పటినుండి పరిశీలనలో ఉన్న నర్సయ్య గారి ఫైలుకు రెండు దశాబ్దాలుగా మోక్షం లభించలేదు. సిరిసిల్ల మాజీ శాసనసభ్యులు సిహెచ్ రాజేశ్వరరావు చైర్మన్గా సమరయోధుల స్క్రీనింగ్ కమిటీ ఆయన పింఛన్ ఫైలుకు మోక్షం కలగజేసినా ఢిల్లీలో పెండింగ్లో పడిపోయింది. కేంద్ర మంత్రి విద్యాసాగర్రావు, మాజీ శాసనసభ్యులు సి.హెచ్. రాజేశ్వరరావులను కలిసి అనేకసార్లు పింఛన్ మంజూరు చేయాలని విన్నవించుకున్నా మంజూరు కాలేదు. మాజీ శాసన సభ్యునిగా ప్రభుత్వం ఇచ్చే వెయ్యి రూపాయల గౌరవ వేతనం మందులకే సరి పోగా 2002లో ఆర్థిక సహాయం అందించాలని అప్పటి ముఖ్యమంత్రికి దరఖాస్తు చేసుకున్నారు. అప్పటి కరీంనగర్ జిల్లా కలెక్టర్ సుమిత్ర ద్వారా రూపాయలు 50000 ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరు చేశారు. స్వాతంత్ర సమరయోధుల పెన్షన్ కోసం కాళ్లరిగేలా తిరిగారు. తీవ్ర అనారోగ్యంతో 2003 మే 16న పరమపదించారు. అసెంబ్లీలో ఆ సంవత్సరంలో పరమపదించిన ఎమ్మెల్యేలు వావిలాల గోపాలకృష్ణయ్య, ఆలపాటి ధర్మారావు, వి. ధర్మారెడ్డి, నిచ్చెర్ల రాములు, డి. సుందరయ్య మంగెన గంగయ్య, ఉప్పలపాటి రామచంద్ర రాజులతో పాటుగా కర్రోళ్ల నరసయ్యగారికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

నరసయ్య భార్య దుర్గవ్వ దినసరి కూలీగా మల్కపేటలో జీవనం సాగించి 16-10- 2018లో పరమపదించారు. నరసయ్య- దుర్గవ్వలకు ముగ్గురు కుమారులు. దుర్గవ్వ బతికి ఉన్నప్పుడు భర్త నర్సయ్యకు అన్ని విధాలుగా సహకరించింది. నేను నేను ఇంటర్వ్యూ చేసినప్పుడు దుర్గవ్వ మాటల్లో చెప్పినది ఏమిటంటే "రజాకార్లతోటి కొట్లా డడానికి పదిహేనేళ్లు ఇల్లు విడిచి పోయిండు.. సచ్చిండో బతికిండో తెలియదు.. బతికి వస్తడని ఏనాడు అనుకోలేదు.. నేను రోజు కైకిలి పోయి నా భర్తను సాధినా.. ఎన్ని పదవులు చేసిన మాకు ఏ సంపాదన లేదు.. ఎప్పుడు అడిగినా ప్రజలు ప్రజలు అంటాడే తప్ప కుటుంబాన్ని భార్యాపిల్లలను పట్టించుకునే వారు కాదు.. కొడుకులు ఎవరి సందల్లవారు కైకిలి గంబడి చేసుకుని బతుకుతుండ్రు.."

నరసయ్య గారు ఎంత ఎత్తు ఎదిగిన ఒదిగే ఉన్నారు. అవసాన దశలో నేటి రాజకీయాలు స్వార్థపూరితంగా మారాయని ఆవేదన చెందారు. ధనార్జనే ధ్యేయంగా నాయకులు నడుచుకోవడం బాధాకరమని, ప్రజాక్షేమం వారి అవసరాలు పట్టించుకోవడంలేదనీ, నాడు ప్రజా జీవితాలతోనే రాజకీయ నాయకుల జీవితం ముడిపడి ఉండేదని, నిస్వార్థంగా ఏలే వారని తను అభిప్రాయపడ్డారు. నేడు అసెంబ్లీలో ఎమ్మెల్యేలు ప్రజాసమస్యలు విస్మరించి ఒకరిపై మరొకరు ఆరోపణలు చేస్తూ కుంభకోణాలు, అక్రమాస్తుల పైనన్నే చర్చలు సుదీర్ఘంగా జరుపుతూ కాలం వెళ్లదీస్తున్నారనీ అభిప్రాయపడ్డారు. మాజీ ఎమ్మెల్యే అయినప్పటికీ 1984 నుండి తన స్వాతంత్ర్య సమరయోధుల పెన్షన్ కోసం తిరిగినా మంజూరు చేయలేదని ఆవేదన చెందారు.

ప్రజాస్వామ్య విలువలకు ఊపిరిలూదిన నరసయ్య గారిని చూసి నేటి రాజకీయ నాయకులు ప్రజా ప్రతినిధులు నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో దళ నాయకునిగా పని చేసి రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తూ అజ్ఞాత జీవితం గడిపి జైలు పాలై విడుదలై ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచి ప్రజలకు సేవలు అందించారు. పేదలకు భూములు పంపిణీ చేయించారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన సందర్భంలో అప్పుడు ప్రచారానికి నరసయ్య గారు ఖర్చు చేసింది కేవలం 150 రూపాయలు మాత్రమే. నేడు ఎన్నికల్లో ధనం, మద్యం, డబ్బు ఏరులై పారుతుండటం దిగజారిన రాజకీయాలకు నిదర్శనం. నేటి తరాలకు కర్రోళ్ల నరసయ్య లాంటి మహనీయుల జీవిత చరిత్ర తెలియాల్సిన అవసరం ఉంది. ఆనాడు నిస్వార్థంగా పోరాడిన వారి త్యాగాన్ని స్మరించుకుని వారి స్ఫూర్తితో దేశాన్ని ఈ దుస్థితి నుండి కాపాడి ముందుకు నడిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నమ్ముతూ కర్రోళ్ల నరసయ్యగారికి జోహార్లు అర్పిస్తున్నాను.

-డాక్టర్ వాసరవేణి పర్శరాములు,
9492193437.

## వసంతోత్సవం కావాలి

కష్టాలకొలిమిలో కాలుతూ
ఉచ్ఛ్వాస నిచ్ఛ్వాసలను మోస్తున్న
ఎన్నో జీవితాలు?.!!
లేనితనంలో దుఃఖం
వారికి ప్రాణవాయువు
జీవితనావ ఎప్పటికీ తీరంచేరదు
ఒకరి అనుభవం తరతరాలకు చరిత్ర
మాట శిలాశాసనం
పర స్త్రీ మాతృమూర్తి
నడుస్తున్న పాదాల్లో అడుగడుగునా
ఎన్ని గాయాలో?!!
చెట్టూ చేమా పుట్టా పురుగు
ప్రవహిస్తున్న లేతకిరణాలవెలుగులో
నవ్వులు మొలుస్తున్నాయి
అవి అడవినావలో పొదవుకున్న
ఆత్మీయ నేస్తాలు
విప్పారిన నేత్రాల్లో రెప్పపాటున
కనుమరుగైన వసంతం
ప్రపంచం చుట్టినా
ఆనవాలు దొరకని కలవరం
సాగరమథనం కాదిప్పుడు
వారధి నిర్మాణం చేపట్టాలి
చిన్ని ఉడుత సాయం కూడా
ఇప్పుడు కొండంత అండ
సృష్టిలోని ప్రతిజీవీ ప్రేమాన్వితమే
అందుబాటులో అన్నీ ఉండవు
ఉన్నవాటితోనే అన్నీ సాధించాలి
ఇంద్రియాలపై నియంత్రణ
ఆలోచనలో కార్యసిద్ధి సాధనతో సాధ్యమే
విధ్వంసానికి ?. రాక్షసత్వానికి
నిలువెత్తు రూపం ఎదురుగా నిలిచినప్పుడు
ఎక్కుపెట్టే బాణం రాబోయే తరాలకు
కోటి కాంతుల తో వెల్లివిరిసే
వసంతోత్సవం కావాలి?!!

-జయంతి వాసరచెట్ల
9985525355

## అడుగులు వేద్దాం

విద్య విజ్ఞానపు రెక్కలతో జ్ఞాన విహంగం
భరతావని ఘనవైభవాన్ని
దశదిశలా చాటిన వేళలు..

రసాయనం, జ్యోతిష్యం,గణితం, అంతరిక్షం
అన్ని శాస్త్రాలనూ పుక్కిట పట్టిన
బోధనా నైపుణ్యం..

శిష్య సంతాప హారిణం...
శిష్యుల సంతాపాలను,సందేహాలను
తొలగించే ఆచార్య గణం..

తక్షశిల,నలంద,
నాగార్జున విజ్ఞాన పీఠాల
సాంస్కృతిక ఔన్నత్యం..

చీనా,తిబ్బత్,జపాను మొదలగు దేశాల
విద్యార్థులకు మన చదువులే ప్రమాణం..

వసుధైవ కుటుంబమనే మన నిర్మల
భావ తరంగం..

అంతః చేతన,కరుణ,మానవత్వమే
సంపదలుగా విలసిల్లిన స్వర్ణ యుగం..
ఆ అద్భుతమగు కాలాన్ని
ముంగిట నిలుపుదాం..
కాంచిన స్వప్నపు కాంచన దీప్తికై
పునరంకితమవుదాం

భావ దాస్యం,
గుణ దారిద్ర్యం పట్టి పీడిస్తున్న
సమాజ వైకల్యాన్ని సరిచేద్దాం..

వ్యవసాయం,విద్య,
విజ్ఞానాలకు కాంతులద్దే
శోధన సాధన పరిశోధనలతో
వెలుగులు పంచుదాం..

భూ గర్భకుహరంలోకి పడిపోతున్న
జన జీవన ప్రాభవం
మళ్ళీ పురుడు పోసుకునేలా
అడుగులు వేద్దాం..

-వెల్ముల జయపాల్ రెడ్డి
9441168976

## అమ్మ యాదికొస్తే...

అమ్మ...నీవు యాదికొచ్చిన యాల
కంటికి మనసుకు ఏసిన దారి కూలిపోతది
ఎన్నొద్దులు దాటిన
ఎదగట్టున నీ చేతివేళ్ళ తడిస్పర్శ
నా నుదిటిన గాలై వీస్తది.
నీవు వొంపిపోయిన కష్టాలతేనే
నన్ను ఒక మన్నిగా నిలబెట్టింది
నీవు సద్దిబువ్వలో
కారంపొడిగల్పి తినిపించిన మాటలే
సాటోళ్ళపై చూపించే సానుభూతైంది.
అమ్మ... నేను ఎన్ని సద్దులు సద్దినా
నీవు ఏసే ముగ్గులో నేలరాలే సుక్కనైతుంటి
అచ్చరం ముక్కరాకున్న ...
అంతరాలెరుగని తల్లివి
మాట మాటకు మనసు నిండ
పేమ కుండను పల్లగొట్టి
ఉడ్కు పేగులను సల్లగా జేస్తుంటివి.
యాలకు కూడులేకున్న
ఇమానంగా బతికిన తల్లివి
నిన్ను ఎంతమంది ఎగతాళి జేసిన
సిన్నిన కొంగుల గట్టుకొని
కట్టానికి నడుం బిగిస్తుంటివి..
చెమట సుక్కలతోన ఎగతాళిని గడ్గి
మొకంమీద తుపుక్కున ఉమిచ్చి
భూతల్లి పాదాలను మొక్కుతుంటివి...
మాయమ్మ . ఎవరి కీడు గోరని
అంబ్యాద తల్లి
పూటకు ఎల్లనినాడు
ఉన్నోళ్ళ రోట్ల జొన్నలొడ్లు దంచి
మా కడ్పులనిండ గంజై పారేది.
మాయమ్మ ...గుడ్సెల వెంచిన
గుండెనిండ పేమని తోటోళ్ళకు పంచమన్నది
ఎవరు మా కీడెంచిన..
మేలును పంచి తోడుండమన్నది
అమ్మ యాదికొస్తే..కన్నీళ్ళేగాదు
కర్తవ్యాన్ని గూడ బోధించిపోతది.

-బోల యాదయ్య
9912206427

## కాకి లగ్గం !!

ఎండ కొట్టుడు కొడుతూ
వాన దంచుడు దంచితే కాకి లగ్గం !
కాకి లగ్గమైతేనేం
చిన్నుకలు నెమల్లూ అరస్తున్నై వాకిట్లో
పిల్లల తడి తడి ముఖాల
ఆనంద నాట్యం
సెల్ఫీలే సెల్ఫీలు మబ్బుల మెరుపుల్లా
తాతలకూ తమ కాలం నాటి
కాకి లగ్గాలు జల్లులు జల్లులుగా యాది
ప్రకృతి మాతకు ఎంత దయ !
ఉబ్బరాన్ని ఒక్క ధల్లుతో ఊటి చేస్తోంది
రోజూ పట్ట పగలు కాకి లగ్గం
దగడూ ఉష్ కాకి

- కందాళై రాఘవాచార్య
8790593638

## ఉమ్మడి కుటుంబం

రెండు మూడు తరాలను కలిపే
అనురాగపు లోగిళ్ళు
ఒకే ఇల్లు, ఒకే ఇంటి పెద్ద, ఒకే పొయ్యి
ఐదారు కుటుంబాలు కలిసి నడవడాలు
అమ్మ చేతి కమ్మని వంటలు
ఉన్నంతలోనే సర్దుకుపోయే జీవితాలు
అందరూ కలిసి భోజనం చేసే సహపంక్తులు
సామాజిక విలువలు పాటించడాలు
అద్భుతమైన సామాజిక వ్యవస్థలు
ఉమ్మడి కుటుంబాలు.
పరస్పర సహకారం, భద్రతకు ఆనవాళ్లు
పిల్లలకు పెద్దలు
జీవన విలువలు బోధించడాలు
ధర్మ సూత్రాలు తెలియపరచడాలు
ఆడపిల్లల పెళ్లికి
తలా ఒక చేయి వేయడాలు
ఆకలిగా ఉన్న వారిని పిలిచి
అన్నం పెట్టడాలు
అతిథి సత్కారాలు చేసే
విధానాలు నేర్చుకోవడాలు
ఇంట్లో వృద్ధులకు సేవలు చేయడాలు
సమాజ సంక్షేమానికి ఊతకర్రలు
ఉమ్మడి కుటుంబాల.
స్వార్థం,ఈర్ష్య, అసూయలను మరచి
కుటుంబ భేషజాలను విడిచి
ఆడపిల్లలకు రక్షణ కల్పించి
తల్లిదండ్రుల ఆశలను గమనించి
సామాజిక విలువలు పాటించే
అనురాగం.. ఆత్మీయతల కలబోతలైన..
ఉమ్మడి కుటుంబ వ్యవస్థ
తులుపులు తీద్దాం..!!

-పిల్లి.హజరత్తయ్య,
9848606573

## వేపచెట్టును నేను

భగవంతుడు ప్రకృతికి ఇచ్చిన వరాన్ని నేను
ప్రతి దేవాలయంలోనూ నాటుతారు...
నన్ను వేపచెట్టు అంటారు..
ప్రతి గుడిలో దైవం వలె స్థానం ఇచ్చారు..
మానవాళికి ప్రకృతి అందాలలో
భాగం అయి
ఆయుర్వేద వైద్యంలో
ముఖ్య ఔషదమయ్యాను...

బోనాల పండుగలో నాకై వెతుకుతారు..
ఉగాది పండుగనాడు నాపూవులతో పచ్చడి చేసి
ఇంటిల్లిపాది ఇష్టంగ తీసుకుంటారు..
క్రొత్త సంవత్సరంలో
భోగభాగ్యాలను ఇమ్మని అడుగుతూ
ఎండ, ఎండా అంటూ ఆగమయ్యేవారికి
చల్లని నీడని ఇస్తాను
ఎన్నో పక్షులకు అవాసమైన నేను
గూడు పెట్టుకుని, గుడ్లు పెట్టే పక్షి జాతిని
అంతరించిపోకుండా కాపాడుతున్నాను.
ఆకులు రాల్చి, కాయలు ఇచ్చి
ఎరువుగా మారి
పంటలకు కీడలనుంచి రక్షణనిస్తూ
రైతన్నలకు వెన్నుదన్నునైయ్యాను...
ప్రతి ఇంటిముందు నేనుండి
ప్రాణవాయువునిస్తున్నాను
పసిపిల్లలాడుకోవటానికి ఒడిని ఇస్తూ
అమ్మలా ఆలవాలమయ్యాను...
వేపచెట్టును నేను ...
మనవాళిని కాపాడేతందుకు
వచ్చిన దివ్య దేవతను నేను..!

హు! అయినా నన్ను ఎప్పుడూ
తిట్టుకుంటూ ఉంటారు
పూవు రాలి, ఆకు రాలి, పుల్లా
రాలింది మీ వేపచెట్టుది
మా వాకిలి అంతా నిండిపోయి
చెత్తగా అవుతుందని
ఒకటే గొడవలు పక్కింటి వాళ్ళు...
నా నుంచి వచ్చే చల్లని గాలి మాత్రం
వాళ్ళకు కావాలి!

ఏమిటీ ఈబాధ! ఎందుకీ అనిశ్చిత?
ఎందరో..
"నువ్వు వొద్దు" నీ నుంచి అవసరం కన్నా
అనవసరపు బాధలే ఎక్కువయ్యాయి.."
అంటూ
దిన దినమూ నన్ను క్షోభ పెడ

## నా తెలంగాణ

నైజాం పాలనలో
నలిగిన బ్రతుకులు
బ్రతుకు పోరాటంలో
బానిస సంకెళ్లను తెంచి
పోరుబాట జెండా ఎగిరేసిన వేళ...
ఈ నేలలో గడ్డి పరక కూడా
ఉరితాడుగా
గరీబ్ బోడి కూడు కూడా
తిరగబడిన వేళ...
బంగారు భవితకు
ప్రకృతి ఒడి బ్రతుకమ్మ
ఆయుధమైన వేళ...
ఆట ,పాట
జానపదాల మూట
జనం గుండె నుండి
జనం గోడు విప్పిన వేళ...
రతనాల తెలంగాణలో
బడుగు బలహీనుడు కూడా
బలవంతుడిగా
దొర గడీల పొగరును
అనిచి వేసిన వేళ...
నైజామో డైన
ఆంధ్ర పాలకుడైన
పెత్తందారుల పెత్తనాన్ని సహితం
ఎదిరించిన వేళ...
సాయుధ పోరాటమైన
ఆత్మబలిదానాలు ఆయుధమైన వేళ...
స్వరాష్ట్ర స్థాపనే ధ్యేయంగా
తొలి దశ
మలి దశ పోరాటం
అమరవీరుల ఆత్మబలిదానాలతో
ఆత్మగౌరవ జెండా ఎగరేసిన వేళ....
నా తెలంగాణ
సస్యశ్యామలం
నా తెలంగాణ
నదుల కోలాహలం
నా తెలంగాణ
పసిడిపంటల ఆభరణం
అందుకే నా తెలంగాణ
ఎప్పటికీ కోటి రతనాల వీణ...

-శ్రీపాల్
8978894808

### ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వ పాలన

## రాష్ట్రంలోనే వేగవంతంగా కరీంనగర్ జిల్లాలో అభివృద్ధి

రాజన్న సిరిసిల్ల, జూన్ 2 (నేటినిజం ప్రతినిధి):ప్రజల ఆకాంక్షల మేరకే రాష్ట్రంలో పరిపాలన సాగుతుందని, ప్రజల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందని రాష్ట్ర బీసీ సంక్షేమం, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. జూన్ 2 బుధవారం రోజున తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణంలో జాతీయ జెండా ఆవిష్కరించి జెండా వందనం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సుదీర్ఘ పోరాటాల తర్వాత సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రజల కాంక్షలుకు అనుగుణంగా పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. మార్మి అభివృద్ధిని సమపాళ్లలో పరుగులు పెట్టించి రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ అభివృద్ధి పథంలో ముందుంచారని అన్నారు. కాలేశ్వరం జలాలతో, వ్యవసాయ రంగానికి 24 గంటలు నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరాతో రాష్ట్రంలో వీడు భూములన్నీ సస్యశ్యామలంగా మారాయన్నారు. రాష్ట్రం ఏర్పడక ముందు కరీంనగర్ పట్టణం ఒక కుగ్రామంగా ఉండేదని రాష్ట్రం ఏర్పడిన తర్వాత పట్టణీకరణ, అభివృద్ధికి నేరుగా నిధులు కేటాయింపులతో కరీంనగర్ రూపురేఖలు మారిపోయాయి అన్నారు. కరీంనగర్ పర్యాటక రంగంలో వెదుకుతు ఉంది అన్నారు. రాష్ట్రంలోనే కరీంనగర్ జిల్లా వేగవంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. కేబుల్ బ్రిడ్జ్, ఐటి టవర్లను ఏర్పాటు చేసుకున్నమన్నారు.గతంలో జిల్లాలో 2లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే నేడు నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు.గతంలో రాష్ట్రంలో 14 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరిస్తే నేడు దానికి ఎన్నో రేట్లు అధికంగా 81 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి దేశానికి అన్నపూర్ణగా నిలిచిమన్నారు. దేశంలో పంజాబ్ తర్వాత తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధికంగా ధాన్యం ఉత్పత్తి జరిగిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో కనీస మద్దతు ధరకు రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సాగునీరు, వ్యవసాయం, గ్రామీణ లంబన కరెంటు ఐటి రంగాలలో పురోగతి అద్భుతం తులతో రోడ్లు పక్కా భవనాలు విద్య వైద్యం వంటి అన్ని రంగాల్లో ప్రగతిని, సంక్షేమాన్ని అందిస్తున్నామని మంత్రి అన్నారు. జిల్లాలో కరోనాను సమర్థవంతంగా ఎదుర్కోవడం జరుగుతుందన్నారు. కరీంనగర్ జిల్లాను ఆదర్శం గా తీర్చి దిద్ది అగ్రపథంలో నిలుపుదమని అన్నారు. మంత్రి అంతకుముందు అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించి, ఆచార్య జయశంకర్ విగ్రహానికి, తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కనుమల్ల విజయ, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్ సుంకే రవిశంకర్, నగర మేయర్ వై సునీల్ రావు జిల్లా కలెక్టర్ శశాంక పోలీస్ కమిషనర్ కమలాసన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వల్లూరి క్రాంతి ఏ ఎస్ పి రీతిరాజ్ పాల్గొన్నారు.

## నిశ్శబ్దం

శబ్దం అంటే
ఖాళీలు పూరించడం కాదు.
అప్పుడప్పుడు
దాని నుదుట ధ్వని కిరణాలు కూడా
మొలకెత్తుతుంటాయి.
శూన్యం ఆవహించిన చౌరస్తాలో
మేలి గమ్యాల తోవలు నిర్దేశిస్తుంది.
నిశబ్దం ఏకాంత వాసి అనుకోవడం
వొట్టి భ్రమే అవుతుంది.
ఒక్కసారి మాట్లాడటం మొదలైతే
పుటలు పుటలుగా దొర్లుతుంది.
మౌనం పొరలు పటాపంచలై
భావ ప్రసరణ రాగం అందుకుంటుంది.
పద ప్రవాహంలో
నిశ్శబ్దం ఒక అంతర్వాహిని.
పుస్తకాలు పుక్కిట పట్టడం తేలికే కావొచ్చు!
నిశ్శబ్దాన్ని పలికించడమే
అసలైన పాండిత్యం.
శబ్దాడంబరాలు అన్నీ
వేడుకులు కాకపోవచ్చు!
కొన్ని సార్లు అర్థాలు పలకని
స్వర తంత్రులు మీటని
పద సమూహాల కన్నా
మౌనం వెయ్యి రెట్లు గొప్పది.
శబ్దాన్ని గౌరవిద్దాం సరే.
పదం ఆగిన చోట
తాను మొదలయ్యే
నిశ్శబ్దాన్ని
మరింత ప్రేమిద్దాం.

- డా॥పోరెడ్డి రంగయ్య
సెల్: 9948049864

భల్లం భాష్యం

# కవిత్వం గాలి పీల్చకుండా బతకలేని కవుల గూర్చి...

కవిత్వం - నీలోనూ ఉండవచ్చు. నాలోనూ ఉండవచ్చు. అయితే- ఇవన్నీ వివిధ కోణాల్లో కవిత్వానికి సంబంధించిన ప్రాథమిక ప్రతిఫలనాలే. కానీ అసలైన కవిత్వం ఆత్మ ప్రేమ మాత్రమే. ఎవ్వరైతే జీవితాన్ని ప్రేమతో ఆదరిస్తాడో ఆరాధిస్తాడో అనుభవిస్తూ అక్షరీకరిస్తాడో అట్టివాడు సుకవి అవుతాడు.

అటువంటి కవులతో మాట్లాడడం భలే కష్టమైన పని ఏమో..!? అయితే కష్టమనిపించే కవిత్వంపు మాటలన్నీ ఇష్టం లేని మాటలు కానక్కర్లేదు. కాసేపు దైనందిన జీవితం నుంచి పక్కకు జరిగి బుగ్గమీద చేయి ఆనించి ఆ కవుల మాటలు వింటే- ఏ కష్టమూ ఉండదు. అప్పుడు- ఆ కవి- అన్నగానో, తమ్ముడుగానో, కొడుకుగానో తండ్రిగానో, స్నేహితునిగానో స్పందిస్తూ తమకు అనేకానేక నిద్రలేని రాత్రులు ఉన్నాయంటారు. కవిత్వ సాధనలో, కవిత్వ ఆరాధనలో, కవిత్వ ధ్యానంలో అవేమీ బాధించేవిగా ఉండేవి కావు అంటుంటారు. మరి అప్పుడు ఆ కష్టనష్టాన్ని మరిచిపోవడానికి ప్రయత్నిస్తూ అయినా ఉండొచ్చు.

ప్రజలు ఎదుర్కొంటున్న రాజకీయ, సామాజిక వైఫల్యాల పరిణామ పర్యవ స్థానాల్లోంచే కవి అన్నవాడు సాహిత్య వాస్తవాల్ని కూడా దర్శించాలి. ఆ పరిణామాలే సాహిత్య వస్తు రూపాల్లో అధికంగా కవిత్వ స్వరూప స్వభావాన్ని ఒకొక్కరి అధికంగా నిర్ణయిస్తుందన్నది జరుగుతుంది.

కవులు వ్యక్తిగతమైన అనుభవాల్లోంచి పలకరించినపుడు లోతైన అనుభూతులు ఆవిష్కరింపబడతాయి. వైయక్తిక జ్ఞాపకాల సంవేదనలోంచి సామాజిక చిత్రణ మొత్తం రూపుదిద్దుకుంటుంది. నిరంతరం బతికించే నోస్టాలిజిక్ భావనలు, పల్లెల్ని, వృత్తుల్ని రికార్డు చేసే దిశగా కొనసాగుతాయి. అట్లాంటి సందర్భాలోనే కవులు మహత్తరమైన చారిత్రక కర్తవ్యాన్ని భుజాన వేసుకుంటాడు.

కవి వ్యక్తిత్వానికీ ప్రకృతికీ మధ్య వున్న చుట్టరికం కూడా చిన్నదేమీ కాదు. భౌతిక ప్రకృతిని బట్టి వ్యక్తిత్వం కొంత రూపుదిద్దుకుంటుంది కదా. అందుకే- ఒక కవిని గురించి తెలుసుకునే ప్రయత్నంలో అతని ఊరూ వాడ గురించి కొంత ఆరాతీస్తే- ఆ ప్రాంతీయ పదబంధాల పరిమళాలు- పడికట్లు, ఆచార వ్యవహారాలు ద్యోతమౌతాయి.

నిజానికి కవిత్వంలో నిశ్శబ్దాన్ని గురించి చెప్పడం ఎంత కష్టమో ఆచరించడం కూడా అంతకంటే ఎక్కువ కష్టం. కాని కొంతమంది మహనీయకవులు తాము స్వయంగా నిశ్శబ్ద కవిత్వాన్ని రాయడమే కాదు. ఇతరేతర కవులు పలికిన నిశ్శబ్దాన్ని కూడా మన తెలుగులోకి అనువదించి శెహబాష్ అనిపించుకున్నారు కూడా.

కొంత మంచి కవులు ఇతర కవుల రచనల్ని చదవడానికి ఇష్టపడరు. అలాగని మరీ బొత్తిగా చదవడం లేదా అంటీ చదువుతారు. కాని మనసుపెట్టి అంతగా చదవరని పిండితార్థం. ఇతర భాషల్లో వచ్చిన కవిత్వాన్ని అర్థం కాకపోయినా- ఏ దేశ కాల పరిస్థితుల్లో రాస్తారో తెలీకపోయినా చదువుతుంటారు. ఏతావతా తేలిందేమంటే- కొంతమంది కవులకి తోటి వారి కవిత్వమంటే ఎంతో చిన్నచూపు.

చరిత్రకున్నట్లే కవిత్వానికి, కవిత్వ చరిత్రకు ఒక నిరంతరమైన కొనసాగింపు ఉంటుంది. అదే సమయంలో గొప్ప గొప్ప మార్పులు ఉంటాయి.ఒక్కొక్కతరి కవిత్వం వట్టి వచనంగా, వచనం రుచీపచీ లేనట్టుంటుంది. కొందరి కవిత్వమంతా ఒక ఏకాత్మక భావన, ఆలోచన, అనుభూతి, రూపం అలల్లా కదలాడుతూ వుంటాయి. చదివిన తర్వాత జీవిత గమనం, తాత్త్విక సూత్రం అంది చదువరి మనస్సులో కవిత్వం సుస్థిరమవుతుంది.

ఉత్తమమయిన కవిత్వం- ఉత్తుంగ ఉద్వేగధారతో పాఠక హృదయాల్ని ఊపిరి సలువనివ్వదు. అదొక తరంగ పరంపరలా ముంచెత్తుతుంది. ఒక దృశ్యాన్ని దురంత దుఃఖాన్ని కలిగలిపిన అలలపై అలల్లాంటి వాక్యాలు అల్లకల్లోలం చేస్తాయి. అన్నీ కల్లోలాలనీ కదలిలా చుట్టుముట్టి కడుపారా ఏడవడానికీ, కన్నీరు పెట్టడానికీ వెసులుబాటు దొరకని వేదన నిండిన కవిత్వమవుతుంది.

ఎప్పుడైతే మన కవిత్వం ముమ్మరంగా ఇంగ్లీషులోకి అనువదింపబడుతుందో, ఎప్పుడైతే మన కవిత్వపు ఆంగ్ల అనువాదాలు విదేశీ సాహిత్య వేదికలపైన దర్శనమిస్తాయో, ఆనాడు మన కవి కవిత్వం ఎల్లలు దాటి దూర తీరాలకు చేరుతుందని కొందరు ఇప్పటి ఎప్పటికీ ప్రగాఢంగా విశ్వసిస్తుంటారు.

ఏ వస్తువుకైతే కవి తాను బద్ధుడై కవిత్వం సృష్టిసాడో ఆ కవిత్వం నిబద్ధమైంది. అతడు నిబద్ధుడైనకవి. ఆ నిబద్ధుడైన సాహిత్యకారుడు అంతటితో ఆగిపోకుండా వస్తువు పట్ల మమైక్యం కావటం నిమగ్నత వస్తువుతో తాను అంతర్లీనం కావడం నిమగ్నత. నిబద్ధతతో సాహితీ కారుడు వస్తువుకు కట్టుబడి వుంటాడు.

కవుల్లో వీధికొక్క కాదు- ఇంటికొక మహా కవి పుట్టాక- ఆది కవి ఎవరు? అతగాడు మా పక్కవీధిలో ఉన్న ఇంటికవి కంటే గొప్ప? అని ప్రశ్నించే సందర్భంలో కవులకు యోజనాల దూరంగా ఉంటున్న జనాలకు కవిత్వం వలన ఏమన్నా ప్రయోజనం ఉందా? పోనీ ఆ రాసే కవులకైనా సందేహం కొందరికి ఈనాటిదేం కాదు. కవిత్వ పుస్తకం కనుగొని కాదు కొని చదివే పాఠకోత్తములున్నారో..? లేదో..? అనేకానేక ప్రశ్నల పరంపరల మధ్య గొడవల గోడొన్న సందిట వాలిపోయి, చీలిపోయి, ఆవిష్కరణ సభలు బహిష్కరణ సమావేశాలై కవిత్వశాలల్లో చిక్కుకొని, చిచ్చురేగడం గమనిస్తూనే ఉన్నాం కదా? గండపెండేరాలు, గజారోహణలు పోయి- 'కవులొస్తున్నారు జాగ్రత్త" అని కొందరు ప్రజలు ఇల్లు అద్దెక్కూడ ఇవ్వడానికి భయపడడం అక్కడక్కడా దర్శించడం బాధగానూ, భయంగానూ ఉంటుంది.

"కవిత్వాభిమానం" అంటే కవిత్వ సభలకు హాజరవ్వటం. కవుల్ని చూడటం, మాట్లాడటం, కవిత్వాన్ని చదవడం, వివిధ ప్రక్రియల్లో వస్తున్న కవితా సంకలలాల్ని కొనడం, చదవడం, సేకరించడం, సొంత గ్రంథాలయం కలిగి వుండడం- అందులోని కవితా సంకలనాల్ని కొన్ని తోటి కవితా ప్రియులకు ఇవ్వటం- తిరిగి వాటిని తీసుకోవటమే కాదు నచ్చిన కవితా సంకలనాల్ని వందో రెండొందలో కొని పంచడం, ఇంకా నచ్చితే ప్రచురించి మరీ పంచటం- ఇష్టమైన మిత్రుల ఇళ్లలో శుభకార్యాల సమయంలో సంకలనాలు చేసి మరీ పంచటం- మరింకా- ఆ సంకలనాలు చదవదగిన వారిని వారే ఎంపిక చేసుకొని రాష్ట్ర వ్యాపితంగా పంచటం. స్వంతంగా గాని, ఇంకొంత మంది మిత్రులతో కలిసిగాని, సాహిత్య పత్రిక నడపటం ఇవన్నీ గాని, ఇందులో కొన్ని గాని వాళ్లని కవిత్వ ప్రియులుగా భావించవచ్చు.!!

-ఎస్.ఆర్.భల్లం
సెల్: 9885442642

## నిత్యస్మరణీయులు



-దోరవేటి
సెల్:9866251679

### పిల్లలమర్రి పినవీరభద్రుడు

'వల్లి నొరిల్లి'యన్న వచ్చోభవమున
ఇంద్ర! భూపాల సత్కార సాంద్ర చరిత!
అవని పిల్లలమర్రి మహా కులాబ్ధి
చంద్ర! పినవీరభద్ర కవీంద్ర! నతులు!

సంసోత్తుంగ తరంగ ధీర కలతిబ్ధ్యాగ్రప్రబంధక్రియా
శృంగం బంచు నుతించులీతి కృతిగా శృంగార శాకుంతలం
బుం గూర్చితివు, నవీన సత్కవుల కాపేదంబుగా మార్దన
శ్రీం గావించెను నిన్న సత్కృతి యశశ్రీ వీరభద్ర! నమో!

జైమిని భారతంబును గరగముగను
నారదీయ పురాణమున్ నవ్వముగను
మాఘ మావేత్స్య మాదిగా మధుర రచన
లను జగతి కందజేసిన యనఘ చరిత!

మా తెలుగాలిమందు మహిమాన్విత రత్నము నల్లగొండలో
ప్రేతాల గూడ్రగ్రామమది పిల్లలమర్రిన జన్మమంది, వి
శ్వోతి వహించినాల ప్రజయార్థకవీ పినవీరభద్ర! యీ
జాతి నదీ స్మరించు మనసారగ నిన్నల మాటిమాటికిన్!

## కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న
పోటీ ఫలితాలు
'బుధవారం బాద్షా'

అడ్మిన్: రమాదేవి కులకర్ణి

నిర్వహణ: డా॥ప్రతికంఠం మాలతీలత
ఈ సమూహంలో చేరదలచినవారు 8985613123కి మెసేజ్ చేయవచ్చు.

ప్రథమ బహుమతి విజేత
'ముందుకు కదులుతున్నా"

అతని 'గుండె గుడిలో కుడికాలు మోపింది' మొదలు
అతని 'హృదయ కోవెలలో కొలువైంది' మొదలు
ఆలింగనాల హారతులిస్తాడనీ
అదరచుంబనాల తాంబూలాలందిస్తాడనీ
నా ఎదవీణను మీటి సరసాల సరిగమలు పలికించి
సంసారయానం రసరమ్యకావ్యం చేస్తాడనీ నే కన్నకలలు, కన్నీటి జల్లులై రాలాయి
విరహపు నిట్టూర్పూ నిరాశలతో 'నా ముంగిలి అంతా రంగవల్లులు నింపి'
అహపు అనవసరపు మాటలతో, ఆగ్రహపు పోటులతో
నా గుమ్మంలో తోరణాలు కట్టి
శాసనాల ముట్టడితో ఆంక్షల కట్టడితో
నా మది గది అంతా అడుగడుగు చెరల అరలను పట్టి
జీవితమంతా ఇక ఎడారిలో ఇసుక తిన్నెలే ననిపించాయి
×నింగిలోని తారక నేల మీదికి వచ్చినట్టుగా మెల్లగా×
ఎడారి బాటలోనే నీటి ఊట దొరికినట్టు చల్లగా
నాలోని 'తప్పు చేయకపోతే తలవంచకూడద'నే తలంపు రేగగా
తలిదండ్రులిచ్చిన గుండె ధైర్యముండగా మెండుగా
చెంపలపై జారిన చారికలే,
నే దిద్దుకోబోయే నా భవితకు ఓనమాలవ్వగా
ముందుకు కదులుతున్నా నే సబలగా

-కవిత బేతి

ద్వితీయ బహుమతి విజేత
నిరీక్షణ

ఆమె అనంత సౌందర్యవతి
అద్భుత భాషణ చమత్కృతి
నా మనసు దోచిన విరిబోని
'నింగిలోని తారకల నేలమీదికి'
'వచ్చెను మెల్లగా' చొచ్చెను నా హృదిలోకి.
ఆమె కోసమే మది పరిచాను
మధుర భావనలు పంచాను
పరి పరి విధాల పరితపించాను
'నా ముంగిలి అంతా రంగవల్లులు నింపి'
నా జీవితానికి వెలుగు చూపుతుందని ఆశ.
ఆమె నీడనై బతికాను
ఆమె చూపే వెన్నెల కరణమనుకున్నాను
ఆమె కోసమే జీవితమనుకున్నాను
ఏనాటికైనా నా 'గుండె గుమ్మంలోకి'
'కుడికాలు మోపదా అనే ఆశ'.
నా నిరీక్షణ ఫలించింది
నా ఆశలకు చుక్కానై నిలిచింది
నా జీవిత పయనానికి తోడైంది
'నా హృదయ కోవెలలో కొలువై నిలిచింది'

-వనపర్తి గంగాధర్
9440146435

విశాలాక్షి
సాహిత్య మాస పత్రిక
శ్రీ ఆళ్ల దశరథరామిరెడ్డి
స్మారక కథల పోటీ



విశాలాక్షి సాహిత్యమాస పత్రిక సంక్రాంతి కథల పోటీ నిర్వహించిన విజయానందంలో ఇప్పుడు శ్రీ ఆళ్ల దశరథరామిరెడ్డి స్మారక కథల పోటీతో మరోసారి కథా రచయిత (త్రు)లకు చేరువవుతుంది. సంక్రాంతి కథల ప్రత్యేక సంపుటి లానే మరో కథల సంపుటిని ప్రత్యేకంగా తీసుకు వచ్చే ప్రయత్నంలో ఉన్నాము. మీరంతా బహుమతులతో, మంచి తెలుగు కథలతో ప్రత్యేక సంపుటిని తెలుగు కథా సాహిత్యంలో చిరస్థాయిగా నిలిపేలా భాగస్వాములయ్యేందుకు కొత్త కలంతో, సిరా బలంతో ముందుకు రావాలని మీ అందరికీ స్వాగతం పలుకుతున్నాము.

బహుమతుల వివరాలు

| | |
|---|---|
| వేసవి కథల సంపుటి కోసం 15 కథలు ఎంపిక జరుగుతుంది. ఒక్కో కథకు రూ. 3000/- సమాన బహుమతి ఉంటుంది. | 15 కథలు ఒక్కో కథకు రూ. 3000/- సమాన బహుమతి మొత్తం రూ. 45,000/- |

ఎంపికైన మరికొన్ని కథలు - విశాలాక్షి మాసపత్రికలో సాధారణ ప్రచురణ జరుగుతుంది

- స్వచ్ఛమైన తెలుగు కథ. కొత్త కథ అయి ఉండాలి
- తిరిగొచ్చిన కథలు, జెరాక్స్ ప్రతులు వద్దు
- ఏదైనా సామాజిక అంశం.
- A4లో 5 పేజీలు మించకుండా యూనికోడ్‌లో మెయిల్‌కు పంపాలి.
- కథ మీద రచయిత పేరు లేకుండా ప్రత్యేకంగా హామీ పత్రంలో రాయాలి.
- ఎంపిక కాని కథలు తిరిగి పంపరనే విషయాలు ప్రత్యేకంగా చెప్పటం లేదు.

కథలు పంపవలసిన మెయిల్ :
e-mail : visalakshi.poteelu@gmail.com

Address :
VISALAKSHI MASA PATHRIKA
D.No. 27-5-487, Padmavathi Nagar,
Balaji Nagar Ext,Nellore - 524002.
Cell : 9440529785

గడువు : 15-7-2021


Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 225వ రోజు 'రైల్వే గేటు' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. 'రైల్వే గేటు' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.. - సంపాదకులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
ఏకాంశ కవిత్వం నిర్వహణ:
డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

## విచక్షణ మార్గం

పెరిగిన జనాభాతో
దూరంగా ఉన్న రైలుకట్ట
నగరం నడిబొడ్డుకు
ఉరుకులు పరుగుల జీవితం
నియంత్రణ కోసమే రైల్వేగేట్ !.

రైలు అతిపెద్ద వేగవంతమైన
వాహనం..
తెలిసుండే అజ్ఞానంతో..
అవతల కొంపమునుగుతున్నట్టూ
గేటునుండి దూరి
క్షణంలో అవతలికి పోయే గుండెధైర్యం..
సమయం ఉంది మిత్రమా..
కాలం కత్తులు దూస్తే..
నీ అంచనా తారుమారే..
క్షణంలో మింగే మృత్యువు..
చూపరుల హృదయం భీతితో..

ఎందుకు అలా..?
నువ్వు పాలు,కూరలమ్మే వాడివా?
పిల్లలని బడికి పంపే వాడివా..
ఆఫీస్ పక్షి
అత్త గారింటికి అర్జెంట్గా వెళ్లే పని..
ఇంటర్వ్యూ.. ఏదైనా కావచ్చు
అతి వేగంగా దూసుకొచ్చే..
రైలుతో పోటీ పడలేవు !
కాస్త ఆగు!!.

అటునుంచి ఇటు కూడా
అంతే మంది వేచిఉండే
ఎంత రక్షణ ఈ రైల్వే గేటు..
ఇక్కడ కూడా ఆ పదినిమిషాల్లో
జరిగే వ్యాపారం అద్భుతం
పల్లీలు, సోడాబండి..
అరటిపండ్లు.. ఐస్ క్రీమ్..
బడుగు జీవుల బ్రతుకుగేటు
ఆత్మ విశ్వాసనీ సెపరేటు !.

రైల్వేగేటు కథలెన్నో
రమణీయ జీవిత చిత్రణలై
పాఠకుల మనో రంజితాలు!
ఇక్కడే చిగురించే ప్రేమకథలు
కొన్ని నవరస సంభాషణలు
ఒకచిన్న గదిలో ఎర్రజెండాతో
ఏళ్ళ తరబడి కాపురం
జనాన్ని హెచ్చరించే గేట్ మెన్
ఎన్ని ప్రాణాలు కాపాడే సైనికుడో
ఆలస్యం అమృత సమానం భద్రతగా
ఈ రైల్వే గేట్ విషయంలో మాత్రం !
ఈ గేట్ నిజనీగా గ్రేట్ !.

- ఎం. వి. ఉమాదేవి,
7842368534

## జర భద్రం

సాంకేతికత సౌలభ్యం
భద్రత కు పెద్ద పీట.

రాదారంతా బతుకు చిత్రం
పచ్చని కలల హృదయం.

కుడిఎడమైతే శాల్తీలు గల్లంతే
కనుల కొలనులో కాపలా చూపులు.

రైలు కూతకు ముందే గేట్ లాక్
ఎర్రలైట్ తో హెచ్చరించరిక
గేట్ కిరువైపులా చీమల బారు
ఆగి సాగుటే ప్రయాణం బాగు బాగు.

జల్దీ జల్దీగా రైలుకు పోతమంటే
కనికరించని కాలానికి
కంప అడ్డమొచ్చినట్లు
హఠాత్తుగా గేటు పడితే
పయనం బంద్
చికాకులు షురూ.

రైల్వే గేట్స్ ఆటో సజేషన్
ఓపెన్ టూ లాక్
వెన్నెల కావాలంటే
అమాసనూ ఆహ్వానించాల్సిందే.

ప్రాణాల రక్షణ ముఖ్యోద్దేశం
నియమాలు పాటించడమే శరణ్యం.

- ఏడెల్లి రాములు,
9494800454

## రైలు చెపుతోంది ....

అనేక జీవులు సంచరిస్తున్న
మహా జన సముద్రంలో
అడ్డు వచ్చిన వారి పాలిట
అనకొండను నేను !.

రహదారికి అడ్డంగా
నా రాక పోకలు అనివార్యం
అసహనంగా గేటు దూరి వస్తె
అనుభవిస్తావు పర్యవసానం !.

నా పై నమ్మకంతో
నాతో పయనించేవారిని
క్షేమంగా గమ్యం చేరుస్తాను
అది నా బాధ్యతగా భావిస్తాను !.

మానవ జీవితాన్ని
రైలు ప్రయాణంతో పోలుస్తారు
గేటు వద్ద ఆలస్యం
జీవితంలో నీకు కలిగే అవరోధం
ఓపికగా భరిస్తే
ముందు ప్రయాణం సుఖ మయం
అసహనంగా దూసుకు వెళితే
అత్యంత ప్రమాదకరం !.

-రామకృష్ణ చంద్రమౌళి,
9666656687

## రక్షణ కవచం

పాద చారులను వాహన చోదకులను
కాపాడే రక్షక కవచం
ఆగకుండా సాగే రైలు
పట్టాలు దాటే పరిష్కారం గేటు!!.

కాపలా ఉన్న గేట్లు
ప్రజల ప్రాణాలకు హామీ
ఇచ్చే రక్షకద్వారాలు
కాపలా లేని గేట్లు
ప్రజల ప్రాణాలకు హామీ ఇవ్వలేక
ఎత్తేసిన నరక ద్వారాలు
కాపాలాదారు లేకుంటే
అతలాకుతలం
ఎన్నో ప్రాణాలకు సంకటం!!.

కాపలా ఉన్న గేటులో కూడా
మితి మీరిన ఆత్మ విశ్వాసం ఫలితం
రక్తమోడుతున్న రైలుపట్టాలు
జరభద్రం మానవా
గేటు వేసినా దూరుడు మానవా!!.

రైల్వే గేట్లు
రైలు వంతెనలు కట్టలేని
నిస్సహాయ ప్రభుత్వాలకు
నిలువెత్తు సాక్ష్యాలు!!

పాదచారులు వాహనచోదకుల
తొందరపాటుతో
భారతీయ రైల్వేకే పెనుసవాల్.
గేటు ఒక లక్ష్మణరేఖ
గీత దాటావో వాత పడుతుంది
ఆగిచూసి దాటు
ఆతురత వద్దు
స్వీయనియంత్రణ
పాటించాలి మనం
ప్రమాదాల నివారణలో
ముందుండాలి
మనమందరం!!.

-పరిమి వెంకట సత్యమూర్తి,
9440720324

## రాకపోకల నియంత్రణ

పతీ రైలుమార్గం దారుల్లో
రైలు మార్గాన్ని దాటుకుని
వెళ్ళవలసిన ఊర్లవద్ద
రైలు దగ్గరికొచ్చిన తరుణంలో
రైలు మార్గానికడ్డంగా గేటు వేసి
రాకపోకలను నియంత్రిస్తూ
ప్రజల ప్రాణాలు రక్షించే ఏర్పాటు.

గేటు పడుతుందేమోనని
రైలు రాకముందే లైను దాటుదామని
ఉరుకులు పరుగులతో వచ్చినా
చూస్తుండగానే గేటువేయడం
పది నిముషాల పైగా వేచి చూడడం
బి.పి. పెరగడం
ఆయాసపడడం మామూలే.
గేటు కీపరు అలక్ష్యంగా ఉంటే
గేటు వేయడం ఆలస్యమైతే
వృద్ధులకూ వికలాంగులకూ మరీ కష్టం

రైలు చప్పుడులో
కలిసిపోయే బాధల హోరు.

-నాగిరెడ్డి అరుణ జ్యోతి,
9966181561

## ష్.. జాగ్రత్త

వడి వడిగా పయనించే రైలు
గేటు దగ్గర పిల్లల కేరింతలు
ఎంత చూసినా తరగని ఆనందాలు
బోగీలలోని ప్రయాణికులు
చేతులు ఊపుతూ
ఉత్సాహపు సంజ్ఞలు
ఫుట్ బోర్డ్ పై కూర్చోవటాలు
భయం లేని విన్యాసాలు
సిగ్నల్ లైట్ల అందాలు
బిజీ బతుకుల ఆందోళనలు
కాపలాదారైనా
ఆదుర్గా జనమైనా
నిర్లక్ష్యని చేస్తే పోతాయి ప్రాణాలు
రైలు గతి తెలుపక
టపీమని ఎగిరిన
మూగ జీవ ప్రాణాలెన్నో...
బడి పిల్లల నవ్వులు ఆగిపోయి..
రక్త తర్పణమైన
రైలు గేటులెన్నో
రైలు గేటుకు